ఆదివారం
10-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 49
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఎన్నికల్లో పోటీ చేయకుండా మొరేల్స్‌పై నిషేధం

లా పాజ్: బొలీవియా మాజీ అధ్యక్షుడు ఈవో మొరేల్స్ తిరిగి అధ్యక్ష పగ్గాలు చేపట్టేందుకు వీల్లేకుండా పోయింది. అధ్యక్ష ఎన్నికల్లో ఆయన పోటీపై నిషేధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దీంతో దీర్ఘకాలంగా సాగుతున్న రాజకీయ సంక్షోభంలో కొత్త దశకు తెరలేసింది. 2006 నుంచి 2019 వరకు బొలీవియాకు మొరేల్స్ నాయకత్వం వహించారు. ఎంఏఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయాలని భావించారు కానీ బొలీవియా రాజ్యాంగం కోర్టు తాజా నిర్ణయం ఆయన ఆశలను ఆవిరిచేసింది. రెండు పర్యాయాలు అధ్యక్ష పగ్గాలు చేపట్టిన వారు మరోమారు ఎన్నికకు అర్హులు కాబోరని కోర్టు తెలిపింది. దీంతో మొరల్స్ పోటీ చేయకుండానే 2015లో బొలీవియాలో ఎన్నికలు జరగనున్నాయి.

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో రాజ్యాంగం ధ్వంసం

జంషెడ్‌పూర్: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని సర్వనాశనం చేయాలని భావిస్తున్నాయని, అయితే తాము మాత్రం రాజ్యాంగాన్ని రక్షించుకుంటూనే ఉంటామని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. జార్ఖండ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ విపక్ష ఇండియా ఐక్యసంఘటన భాగస్వామ్య పార్టీలను గెలిపిస్తే రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తాయన్నారు. దేశంలో

- మిగతా 2 లో

అబద్ధాలకోరు మోదీ

- నల్ల చట్టాలతో అదానీ, అంబానీలకు మేలు
- 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్‌కు తరలింపు
- తెలంగాణలో పథకాల అమలుపై నిజాలు చెప్పేందుకే వచ్చా: రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: మహారాష్ట్రకు రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు... మోదీ గుజరాత్‌కు తరలించుకుపోయారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మిమ్మల్ని మోసం చేసిన బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం ముంబైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్ర బీజేపీ నేతలు కొద్దిరోజులుగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ కూడా తెలంగాణలో కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై అబద్ధాలు చెప్పడం మొదలుపెట్టారని మండిపడ్డారు. మోదీ అబద్ధాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటామన్నారు. అందుకే తాను మహారాష్ట్ర ప్రజలకు తెలంగాణలో ఆరు గ్యారంటీల అమలుపై నిజాలు చెప్పడానికి ఇక్కడకు వచ్చానని తెలిపారు. దేశంలో మహారాష్ట్రలోనే ఎక్కువ రైతు ఆత్మహత్యలు జరిగాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయని ధ్వజమెత్తారు. నల్లచట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని మోదీ భావించారని అన్నారు. తెలంగాణలో రైతులకు రూ.రెండు లక్షల మేర రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చామని, 25 రోజుల్లో 22,22,067 మంది రైతులకు రూ.17,869 కోట్లు మాఫీ చేశామన్నారు. రైతుల విషయంలో మోదీ విమర్శలకు సరైన సమాధానం ఇచ్చామని

- మిగతా 2 లో

ప్రగతిశీల భావాల వ్యాప్తికి కుటుంబ సర్వే తోడ్పాటు

సిబ్బందితో కలెక్టర్లు తరచూ మాట్లాడాలి

మంత్రులు, ఎమ్మెల్యేలకు సమాచారమివ్వండి: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: యావత్ దేశం తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న కుటుంబ సర్వేను గమనిస్తుందని, ప్రగతిశీల భావాలను వ్యాప్తి చేయడానికి ఈ సర్వే గొప్పగా తోడ్పడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర ఇంటింటి సర్వే పై శనివారం ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇంటి జాబితాలు పూర్తి చేసుకుని సర్వే ప్రారంభించిన నేపథ్యంలో సిబ్బందితో తరచుగా మాట్లాడాలని కలెక్టర్లకు సూచించారు. ప్రజల సందేహాలను కలెక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి వారి అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువ సార్లు సర్వేలో భాగస్వాములు అయ్యేలా చూడాలని అధికారులను కోరారు. ప్రశ్నలు పకడ్బందీగా రూపొందించారు, సర్వే సిబ్బదికి బాగా శిక్షణ ఇచ్చారు,గృహాల జాబితా కూడా విజయవంతంగా పూర్తి చేశారు. ఇదే రీతిలో కుటుంబ సర్వేను విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్లు

- మిగతా 2 లో

14 నుంచి కాంగ్రెస్ ప్రజా విజయోత్సవాలు

కేబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో భట్టి

2లో

నీట్ విద్యార్థినిపై అత్యాచారం

ఇద్దరు ఉపాధ్యాయుల అరెస్ట్

కాన్పూర్: దేశంలో అత్యాచార ఘటనలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. వైద్య విద్య ప్రవేశ పరీక్ష 'నీట్'కు సిద్ధమయ్యేందుకు కాన్పూర్‌కు వెళ్లిన ఓ మైనర్‌పై నగరంలోని ప్రముఖ కోచింగ్ సెంటర్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు నెలల తరబడి అత్యాచారం చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డారు. మరో విద్యార్థినిని కూడా ఒక ఉపాధ్యాయుడు లైంగికంగా వేధించిన వీడియో దృశ్యం సోషల్

- మిగతా 2 లో

నా గెలుపు అవకాశాలు పెరిగాయి

అందుకే ప్రియాంక నా వద్దకు వచ్చారు: సత్యన్ మొకేరి

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార ఎల్‌డీఎఫ్, ప్రతిపక్ష యూడీఎఫ్ మధ్య ప్రత్యక్ష పోరు నెలకొంది. ఇద్దరు అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఆశ్చర్యకర సన్నివేశం చోటుచేసుకుంది. ఎల్‌డీఎఫ్ అభ్యర్థి, సీపీఐ నేత సత్యన్ మొకేరి... గిరిజన ప్రాంతమైన ఎరుముండాలో ప్రచారం చేస్తుండగా అటుగా రోడ్‌షో నిర్వహించిన యూడీఎఫ్ అభ్యర్థి ప్రియాంక గాంధీ... వాహనం దిగి మొకేరితో కరచాలనం చేసి కాసేపు ముచ్చటించారు. అభ్యర్థుల స్నేహపూర్వక సంభాషణ చర్చనీయాంశంగా మారింది. వయనాడ్‌లో వాస్తవ పరిస్థితులను గ్రహించినందు వల్లే ప్రియాంక మెట్టు దిగి వచ్చారని తమ భేటీని ఉద్దేశించి మొకేరి అన్నారు. తన సభ వద్దకు ప్రియాంక రావడాన్ని రాజకీయ విజయంగా ఆయన అభివర్ణించారు. పోటీ పెరిగిందని గ్రహించినందునే ఆమె తనతో స్నేహపూర్వక సంభాషణకు చొరవ తీసుకున్నారని చెప్పారు. ఇప్పటివరకు గెలుపు దీమాతో ఉన్న ఆమె ఓ మెట్టు దిగి వచ్చారంటే

- మిగతా 2 లో

కూటములకు తప్పని ఇంటిపోరు

29 స్థానాల్లో స్నేహపూర్వక పోటీ

ముంబై: మహారాష్ట్రలో మరో పదిరోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఈ నెల 20న పోలింగ్ జరగనుంది. అక్కడ ప్రధాన పోటీ అధికార మహాయుతిలోని మూడు పార్టీలు (బీజేపీ, శివసేన-షిండే, ఎన్సీపీ-అజిత్ పవార్), ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లోని మూడు పార్టీల (కాంగ్రెస్, ఎన్సీపీ-శరద్ పవార్, శివసేన-యూబీటీ) మధ్యనే జరగనుంది. అయితే మొత్తంగా 288 అసెంబ్లీ స్థానాలకు గాను 29 స్థానాల్లో మహాయుతి, ఎంవీఎస్ మిత్రపక్షాల మధ్య స్నేహపూర్వక పోటీ జరుగుతుండటం గమనార్హం. కాగా స్నేహపూర్వక పోరు మహాయుతి కన్నా ఎంవీఏకి సంక్లిష్టంగా మారింది. ప్రత్యేకించి ఇండియా కూటమిలో భాగమైన చిన్న పార్టీలు కూడా పోటీలో ఉన్నాయి. అధికార మహాయుతి భాగస్వామ్య పక్షాలు

- మిగతా 2 లో

ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది

కేసులు, అరెస్టులకు భయపడం: కేసీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: చాలా రోజుల తరువాత పార్టీ కార్యకర్తలతో మాట్లాడిన గులాబీ దళపతి కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో మాట్లాడిన కేసీఆర్... కాంగ్రెస్ ప్రభుత్వం గురించి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తయిందని, ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమైందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలు చాలా విశ్వాసంతో ఉన్నారన్నారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని కేసీఆర్ సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. 'పాలన అంటే ఒట్టి మాటలతో నడిచేది కాదు. అధికారంలోకి రాగానే వాణ్ణి లోపల వేయాలి... వీన్ని లోపల వేయాలని బీఆర్ఎస్ చూడదు. ప్రభుత్వం అంటే అందరినీ కాపాడాలి. నిర్మాణం చేయాలి. పది మందికి లాభం చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఎలా మాట్లాడుతున్నారో... ఏం చేస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారు' అని కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై కేసీఆర్ మండిపడ్డారు.

అది చేస్తాం... ఇది చేస్తామని పిచ్చి మాటలు తమకు రావా అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు మీకు బాధ్యత ఇచ్చింది సేవ చేయడానికా లేక మాటలతో కాలయాపన చేయడానికా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. తాము తమ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల కంటే 90 శాతం ఎక్కువే అడగకుండానే అమలు చేశామని కేసీఆర్ గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో వందశాతం బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని కేసీఆర్ ఉద్ఘాటించారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టినా భయపడాల్సిన పని లేదని పార్టీ శ్రేణుకు భరోసారి ఇచ్చారు. అరెస్టులకు, కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. న్యాయపరంగా పోరాడదామని పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అందరూ కష్టపడి పని చేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. శనివారం ఇతర పార్టీలకు చెందిన నాయకులు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాగా, తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత కేసీఆర్ పూర్తిగా మౌనం దాల్చారు. ఫలితాలు వెలువడక ముందే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయారు. ఆ తరువాత ఇంట్లో పడిపోవడం, ఆపరేషన్, విశ్రాంతి కారణంగా కొన్ని నెలలు ఆయన ప్రజలకు దూరంగా ఉన్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ తరపున ప్రచారం నిర్వహించారు. ఆ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఒక రోజు సమావేశానికి హాజరైన కేసీఆర్... ఆ తరువాత మళ్లీ కనిపించలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన ప్రజా క్షేత్రంలోకి వచ్చింది లేదు. కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలోనే ఉంటూ... పార్టీ ముఖ్యనేతలు వచ్చినప్పుడు కలుస్తూ... వారికి కీలక సూచనలు చేస్తున్నారు. దాదాపు 5 నెలల తరువాత కేసీఆర్ మళ్లీ తన నోరు విప్పి... పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ విధానాలను తప్పుపడుతూ తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు.



బీజేపీతో కాంగ్రెస్ కుమ్మక్కు

వినయ్ విశ్వం

తిరువనంతపురం: కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతున్న వేళ కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం వ్యాఖ్యానించారు. తమను ఈ పార్టీ వెన్నుపోటు పొడవడం, మోసం చేయడం గురించి మైనారిటీ వర్గాలు మరిచిపోలేదన్నారు. దేశవ్యాప్తంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం పాటుపడుతున్నది, బీజేపీ, కాంగ్రెస్ మోసాలను బహిర్గతం చేస్తున్నది వామపక్షాలేనన్నారు. కాంగ్రెస్ పార్టీ వయనాడ్‌లో బీజేపీ కుళ్లు రాజకీయాలే చేస్తోందని వినయ్ విశ్వం విమర్శించారు. ఆహార పంపిణీ కుంభకోణం, పలక్కాడ్‌లో ట్రాలీబ్యాగ్‌లో నల్లధనం వంటివి

- మిగతా 2 లో

APCRDA
Andhra Pradesh Capital Region Development Authority

అమరావతిపై దుష్ప్రచారం

సీఆర్‌డీఏ వివరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వరదముప్పు ఉందంటూ జరుగుతున్న దుష్ప్రచారంపై సీఆర్‌డీఏ వివరణ ఇచ్చింది. వరదరహిత నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచించినట్లు తెలిపింది. వందేళ్ల వర్షపాతాన్ని పరిశీలించి టాటా కన్సల్టింగ్ ఇంజినీర్లు, నెదర్లాండ్స్ సంస్థ నివేదిక ఇచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు సీఆర్‌డీఏ అధికారులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చాలా పెద్దపెద్దోళ్లకి నామినేటెడ్ పదవులు ఇచ్చారు, ఇక మన బ్రతుకులు మారిపోయినట్లే!

ఉద్యమిస్తేనే రైతుబంధు, రుణమాఫీ

- అధికారంలో అభివృద్ధి... ప్రతిపక్షంలో పోరాటం
- కూలగొట్టిన ఇంటి నుంచే మూసీ పాదయాత్ర
- రైతుగర్జన సభలో హరీశ్‌రావు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: పోరాడితేనే రైతుబంధు, రుణమాఫీ రైతులకు దక్కుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కుల్చారంలో శనివారం రైతుగర్జన సభ జరిగింది. హరీశ్‌రావు మాట్లాడుతూ... కేసీఆర్ రైతుల సీఎం అయితే ... రేవంత్ రెడ్డి బూతుల సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు. మూసీలో కూలగొట్టిన ఇంటి నుంచి పాదయాత్ర చేద్దామని సీఎంకు సవాల్ విసిరారు. మొద్దు నిద్రపోతున్న కాంగ్రెస్ మెడలు వంచి రైతు రుణమాఫీ చేసేందుకు రైతు దీక్ష ఏర్పాటు చేశారన్నారు. నెల రోజులు దాటినా వడ్లు కొనడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పంట చేతికి వచ్చినా రైతుబంధు ఊసేలేదన్నారు. ప్రభుత్వ అసమర్థతను ఎత్తిచూపేందుకు రైతు దీక్ష అన్నారు. హామీ ఇవ్వకపోయినా రైతుబంధు పెట్టింది కేసీఆర్ అన్నారు. తెలంగాణలో ఆరు హామీలు అమలు చేశామని మహారాష్ట్ర ఎన్నికలో ప్రచారంలో చెప్పుకోవడం దుర్మార్గం అన్నారు. కేసీఆర్ రూ.3,800 కోట్లు ఖర్చుపెట్టి మూసీ పునరుజ్జీవం ప్రారంభించారని గుర్తు చేశారు. కాంగ్రెస్, టీడీపీల పుణ్యమే

- మిగతా 2 లో

అవినీతికి బరితెగింపు

'మేఘా, రాఘవ' బాగోతాలను వదిలిపెట్టం

రేవంత్‌ది అధికార దుర్వినియోగం: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీకి, మేఘా సంస్థకు ఈ-టెండర్లు కట్టబెట్టడమంటే... నీకిది-నాకది అని క్రోని క్యాపిటలిజానికి ముఖ్యమంత్రి పాల్పడడం అధికార దుర్వినియోగం చేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి నియోజకవర్గం నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ పనులను మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్, మేఘా ఇంజినీరింగ్ సంస్థలకు కట్టబెట్టటంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి బరితెగించి అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ వంటి పెద్ద కంపెనీలకు టెండర్లు దక్కకుండా కుట్ర చేశారని ఆరోపించారు. సాంకేతిక కారణాలు చూపి టెండర్లు తప్పించారన్నారు. ఏలాగైన మేఘా, రాఘవ సంస్థలకు ఈ ప్రాజెక్ట్ కట్టబెట్టాలని మీరు చేసిన తప్పుడు ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. 3.9 శాతం, 3.95 శాతం పంచుకునే విధంగా రాఘవ, మేఘా బిడ్ లు వేయటమంటే మతలబు ఏంటని ప్రశ్నించారు. సుంకిశాలలో ప్రభుత్వానికి రూ. 80 కోట్లు నష్టం చేసిన మేఘా కంపెనీకి పనులను ఎందుకు కట్టబెట్టారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మేఘా సంస్థను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు చెప్పినప్పటికీ దానిపై రేవంత్ రెడ్డికి అంత ప్రేమ ఎందుకని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజాధనాన్ని లూటీ చేసే పనిలో నిమగ్నమై ఉన్నారని విమర్శించారు. రూ.4,350 కోట్ల ఈ ప్రాజెక్ట్ ను మేఘా, రాఘవ సంస్థ లకు అప్పగించి వారి ద్వారా రూ.వేల కోట్లు



- మిగతా 2 లో

ఇజ్రాయిల్ బాంబుల వర్షం

గాజా, లెబనాన్‌లో భీకరంగా వైమానిక దాడులు

జెరూసలేం: ఇజ్రాయిల్ దళాలు భీకరంగా సాగిస్తున్న భూతల, వైమానిక దాడులతో గాజా అతలాకుతలమవుతోంది. తాజా దాడుల్లో 21 మంది చనిపోయారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఉన్నారని గాజా పౌర రక్షణ సంస్థ శనివారం ప్రకటించింది. అల్ మవాసీ 'సేఫ్ జోన్'పై ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించిందని, అటు లెబనాన్ రాజధాని బీరుట్‌లోనూ మారణహోమాన్ని కొనసాగించిందని సంబంధిత అధికారులు తెలిపారు. ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడులు జరిపి లెబనాన్‌లోని నివాసాలను నేలమట్టం చేసినట్లు వెల్లడించారు. ఖాన్ యూనిస్‌లోని గుడారాలపై వైమానిక దాడిలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని గాజా రక్షణ శాఖ అధికార ప్రతినిధి మహమూద్ బస్సల్ వెల్లడించారు. మరో 11 మందికి గాయాలు కాగా వారిని నాసర్ ఆసుపత్రికి తరలించినట్లు పలస్తీనా రెడ్ క్రెసెంట్ తెలిపింది. ఉత్తర గాజాలో పదుల సంఖ్యలో తీవ్రవాదులను మట్టుబెట్టినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించుకుంది. ఇదిలావుంటే గతేడాది అక్టోబరు 7 నుంచి ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 43,552 మంది పలస్తీనియన్లు చనిపోగా, 1,02,765 మంది గాయపడ్డారు. లెబనాన్‌లో మృతుల సంఖ్య 3,117కు చేరింది. గాయపడిన వారి సంఖ్య 13,888కి పెరిగింది.

వెస్ట్‌బ్యాంక్‌లో 18 మంది అరెస్టు

ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో 18 మంది పలస్తీనియన్లను ఇజ్రాయిల్ దళాలు నిర్బంధించాయి.

ఈ మేరకు పలస్తీనా ప్రిజనర్స్ సొసైటీ, డీటెయినీస్ & ఎక్స్ డీటెయినీస్ వ్యవహారాల కమిషన్ వెల్లడించాయి. ఇజ్రాయిల్ దురాక్రమణ మొదలైనప్పటి నుంచి గాజాలో 11,600 మందికిపైగా పలస్తీనియన్లు వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంలో అరెస్టు అయినట్లు వఫా వార్తాసంస్థ నివేదించింది.

మృతుల్లో 70 శాతం మంది పిల్లలు, మహిళలే

గాజాపై ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకు చనిపోయిన వారిలో 70శాతం మంది పిల్లలు, మహిళలేనని ఐరాస మానవహక్కుల కార్యాలయం తెలిపింది. వేలాది మంది బాధితుల వ్యక్తిగత వివరాలను ధ్రువీకరించినట్లు పేర్కొంది. భయానక రీతిలో సాగుతున్న మారణహోమాన్ని ఆపాలని పిలుపునిచ్చింది. ఉత్తర గాజాలో కరువు పరిస్థితులు తీవ్రమవుతున్నట్లు ఐరాస మానవహక్కుల కార్యాలయం హెచ్చరించింది.

కిస్సుఫిమ్ క్రాసింగ్ తెరిచే యోచనలో ఇజ్రాయిల్

సెంట్రల్ గాజాలో కిస్సుఫిమ్ క్రాసింగ్ తెరవాలని ఇజ్రాయిల్ యోచిస్తోంది. గాజాకు మరింతగా సహాయ సామాగ్రి చేర్చేలంటూ అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి పెరుగుతుండటంతో ఈ దిశగా చర్యలకు ఇజ్రాయిల్ సైన్యం ఉపకరించింది. కొత్త క్రాసింగ్‌ను ఇంజినీరింగ్ పని పూర్తి అయిన తర్వాత తెరుస్తామని, ఆర్మీ ఇంజినీర్లు పర్యవేక్షణ క్షేత్రాలు, రోడ్లు నిర్మిస్తున్నారని సైనిక ప్రకటన వెల్లడించింది.

4 రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు ప్రయోగించిన చైనా

జియుక్వాన్: చైనా శనివారం రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. జియుక్వాన్ ఉపగ్రహాల ప్రయోజన కేంద్రం నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టింది. ఉదయం 11.39 గంటలకు (బీజింగ్ కాలమానం) లాంగ్ మార్చ్ 2 సీ కెరీయర్ రాకెట్ ద్వారా 'పీఐఈఎస్ఏటీ-2' నాలుగు ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ ఉపగ్రహాలు వాణిజ్యపరమైన రిమోట్ సెన్సింగ్ డేటా సేవలను అందిస్తాయి. కాగా, లాంగ్ మార్చ్ కెరియర్ రాకెట్ సిరీస్‌లో ఇది 544వ ప్రయోగం.

29న ఐర్లాండ్‌లో సార్వత్రిక ఎన్నికలు

లండన్: ఐర్లాండ్‌లో ఈనెల 29న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల తేదీని ప్రధాని సిమన్ హారిస్ ప్రకటించారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేందుకు వీలుగా పార్లమెంటు దిగువ సభ, కరెంట్ డైల్‌ను దేశాధ్యక్షుడు మైఖెల్ డి.హిగ్గిన్స్ రద్దు చేశారు. తాజా ఎన్నికల్లో 174 మంది పార్లమెంటు సభ్యులు ఎన్నికవుతారు. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే మెజారిటీ కోసం 88 మార్క్‌ను పార్టీలు దాటాల్సి ఉంటుంది.

పాక్‌లో ఆత్మాహుతి దాడి

25 మంది మృతి- 46 మందికి గాయాలు

క్వెట్టా స్టేషన్ వద్ద ఘటన - ఇది మా పనే: బీఎల్ఏ

క్వెట్టా: పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటన బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని క్వెట్టా రైల్వేస్టేషన్ వద్ద శనివారం జరిగింది. 25 మంది చనిపోయారు. 46 మందికి గాయాలయ్యాయి. బాధితుల్లో 14 మంది సైనికులు ఉన్నట్లు పోలీసులు చెప్పారు. పేలుడు ధాటికి స్టేషన్ పైకప్పు ధ్వంసం కావడం... ఫ్లాట్‌ఫారంపై మృతదేహాలు చెల్లాచెదురుగా పడివుండటం సీసీటీవీలో కనిపించినట్లు తెలిపారు. గాయపడిన 46 మంది ఆసుపత్రికి తరలించగా, అక్కడ అత్యవసర పరిస్థితిని ప్రకటించాల్సి వచ్చినట్లు చెప్పారు. ఇన్‌ఫాంట్రీ స్కూలుకు చెందిన సైనికులే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు బలూచిస్థాన్ ఐజీ అన్సారీ తెలిపారు. ఈ ఘటనను ఖండించిన బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తీ... దీనిపై దర్యాప్తునకు ఆదేశాలిచ్చారు. అమయాకులను చంపేయడం భయానకమన్నారు. 'అమయాక ప్రజలు, కార్మికులు, పిల్లలు, మహిళలను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. అమాయకుల ప్రాణాలు తీస్తున్న వారు దయకు అనర్హులు' అని సీఎం అన్నారు. బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ జిల్లాలోని ఆసుపత్రి, బాలికల పాఠశాల సమీపంలో పేలుడు జరిగి ఐదుగురు పిల్లలు సహా ఎనిమిది మంది మరణించిన ఘటన మరువక ముందే ఆత్మాహుతి దాడి జరిగింది. ఘటనా సమయంలో స్టేషన్‌లో దాదాపు వంద మందికిపైగా ఉన్నట్లు క్వెట్టా ఎస్ఎస్‌పీ మహమ్మద్ బలూచ్ తెలిపారు. పెషావర్‌కు బయల్దేరేందుకు జాఫర్ ఎక్స్‌ప్రెస్ సిద్ధంగా ఉందన్నారు. పోలీసులతో పాటు భద్రతా సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు బలూచిస్థాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి షాహిద్ రింద్ తెలిపారు. కాగా, ఆత్మాహుతికి పాల్పడినది తామేనంటూ బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ప్రకటించింది. ఈ దాడికి నిషేధిత తీవ్రవాద సంస్థ బాధ్యత వహించింది.

అణు దాడికి అణ్వస్త్రంతోనే బదులిస్తాం

ఉత్తర కొరియాకు ద.కొరియా హెచ్చరిక

సియోల్: తమ దేశంపై అణు దాడికి ఉత్తర కొరియా యత్నిస్తేగనుక అమెరికాతో కలిసి దీటుగా బదులిస్తామని దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యెల్ హెచ్చరించారు. తమ దేశాన్ని కాపాడుకోవడం కోసం అమెరికా అణ్వస్త్రాలపై ఆధార పడితే సరిపోతుందని, సొంత ఆయుధాలను వినియోగించాల్సిన అవసరం రాబోదని ఆయన చెప్పారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియాపై అణు దాడిపై యుద్ధం చేయాలని ఉత్తర కొరియా భావిస్తే అది అహేతుకమైన నిర్ణయమే అవుతుందన్నారు. ఉత్తర కొరియా అందుకు సాహసిస్తేగనుక ఆర్ఓకే-అమెరికా కూటమి వెంటనే ఉత్తర కొరియాపై అమెరికా అణ్వాయుధాన్ని ప్రయోగిస్తుందని తేల్చి చెప్పారు.

అబద్ధాలకోరు మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 50వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. మహాలక్ష్మీ పథకం ద్వారా రూ.500లకే గ్యాస్ అందిస్తున్నామని, 50 లక్షల మంది ఉచిత విద్యుత్ ద్వారా లబ్ది పొందుతున్నారన్నారు. వరికి రూ.500 మద్దతు ధర, 1.04 కోట్ల మంది మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వినియోగించుకున్నారన్నారు. రూ.3,541 కోట్లు ఆర్టీసీకి ప్రభుత్వం అందించిందన్నారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టామన్నారు. దేశచరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉందని, దేశ గతిని మార్చిన ఎందరో మహానుభావులకు ఈ గడ్డ జన్మనిచ్చిందన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, బాలగాంగధర్ తిలక్, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి ఎందరో మహానుభావులు ప్రజల్లో చైతన్యం నింపి దేశానికి ఒక దారి చూపారని అన్నారు. ఇంతటి ఘనత ఉన్న మహారాష్ట్ర ఎవరి చేతుల్లోకో వెళ్లకూడదని సూచించారు.

ఉద్యమిస్తేనే రైతుబంధు, రుణమాఫీ

(మొదటిపేజీ తరువాయి)

నల్గొండ ఫ్లోరోసిస్‌కు కారణమన్నారు. ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దింది కేసీఆర్ అని పేర్కొన్నారు. తెలంగాణలో 30 శాతం వడ్లు దళారుల పాలయ్యాయన్నారు. ప్రభుత్వం కొనే పరిస్థితిలేక దళారులకు రూ.1,700లకు అమ్ముకుంటున్నారన్నారు. రూ.2,300 మద్దతు ధర, 500 బోనస్ కలిపి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా వానకాలం... యాసంగి కలిపి రూ.15 వేలు ఇవ్వాల్సిందే అన్నారు. అధికారంలో అభివృద్ధి చేశాం, ప్రతిపక్షంలో ప్రజల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ 100 సీట్లు గెలిచి అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ

కుల్చారం మండలం చిన్నఘనపూర్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని హరీశ్‌రావు ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమం నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు.

తెలంగాణ తల్లి మన ఉద్యమానికి నిత్యం స్ఫూర్తి నిచ్చేదన్నారు. కేసీఆర్ ఎంతో కష్టపడి తెలంగాణ తెచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సునీత రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, శేరి సుభాష్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి , బీఆర్ఎస్ మెదక్ ఇంచార్జి తిరుపతిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీతో కాంగ్రెస్ కుమ్మక్కు

(మొదటిపేజీ తరువాయి)

సృష్టించిందన్నారు. మైనారిటీ పార్టీల్లో పోటీ సృష్టించేలా బీజేపీ, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని వ్యాఖ్యానించారు. బాబ్రీ మసీదు విధ్వంసానికి కుట్ర చేసినది, బీజేపీ భయంతో లీగ్ జెండా పట్టుకోనివ్వనిది కాంగ్రెస్సేనని ముస్లింలు మరువలేదన్నారు.

తమను రక్షించే వారు బీజేపీలో ఉన్నట్లు భావించే మైనారిటీ నేతలు ఒక్కసారి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గోల్వాల్కర్ రాసిన 'విచారధార'ను చదివితే వాస్తవాలు తెలుస్తాయని వినయ్ విశ్వం సూచించారు. దేశంలో అంతర్గతంగా తొలి శత్రువు ముస్లింలు, ఆ తర్వాత స్థానాల్లో క్రైస్తవులు, కమ్యూనిస్టులు ఉన్నట్లు అందులో ఉందన్నారు. బీజేపీతో కలిసి మెలిసి ఉన్న కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారని వినయ్ విశ్వం అన్నారు.

14 నుంచి కాంగ్రెస్ ప్రజా విజయోత్సవాలు

కేబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్:

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై ఈ నెల 14 నుంచి డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు 25 రోజుల పాటు ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా విజయోత్సవాలు ఏవిధంగా జరపాలి, ఏ అంశాలపై ప్రచారం చేయాలనే దానిపై విధివిధానాలు రూపొందించేందుకు భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఉత్సవాల నిర్వహణపై సబ్‌కమిటీ భేటీలో వివిధ నిర్ణయాలు తీసుకోవడంతోపాటు రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు. భట్టి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఏడాది కాలంలో దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేని ఎన్నో విప్లవాత్మక, ఊహకు అందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఇందిరా మహిళా శక్తి తదితర పథకాలు అమలు చేసినట్టు వివరించారు. 50 వేల ఉద్యోగాలను ఇవ్వడంతో పాటు, రూ. 18 వేల కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ, మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందచేశామని గుర్తు చేశారు. మూతపడిన కమలాపూర్ రేయాన్స్ పరిశ్రమను రూ.నాలుగువేల కోట్లతో పునరుద్ధరించబోతున్నామన్నారు. జవహర్ లాల్ నెహ్రూ జయంతి రోజున ప్రారంభమయ్యే విజయోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ మొదలుపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయి వరకు ఈ సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 'ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఉస్మానియా ఆస్పత్రి, స్పోర్ట్స్ వర్సిటీకి శంకుస్థాపన చేస్తాం. 28న పారామెడికల్, 16 నర్సింగ్ కళాశాలలను ప్రారంభిస్తాం. వివిధ కంపెనీలో ఒప్పందాలు చేసుకుంటాం. గ్రూప్-4కు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తాం. డిసెంబర్ 9న హైదరాబాద్‌లో వేలాది మంది కళాకారులతో ప్రదర్శనలు, లేజర్ షోలు, బాణసంచా తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేసి భారీగా ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తాం' అని తెలిపారు. రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ప్రారంభం, పోలీస్ శాఖ ద్వారా డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలు, డాగ్ షోలు, పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల, ప్రజాకవి జయరాజ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ముఖ్య కార్యదర్శులు రవి గుప్త, క్రిస్టినా జోంగ్తు, ఎం. శ్రీధర్, కార్యదర్శి దాసరి హరిచందన, లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

అవినీతికి బరితెగింపు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొట్టనుందన్నారు.మేఘా, రాఘవ కన్‌స్ట్రక్షన్ అవినీతి బాగోతాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, అవినీతి పాలనపై పోరాటం చేస్తూనే ఉంటామని కేటీఆర్ హెచ్చరించారు.

కేసీఆర్ పేరును ఎవరూ చెరపలేరు

తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ ఉంటారని, ఆ పేరును ఎవరు చెరిపేయలేరని కేటీఆర్ అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. నువ్వు స్లిపర్లు వేసుకొని రాజకీయాల్లోకి వచ్చేందుకు పనికిమాలిన పోరనిలా తిరుగుతున్నప్పుడే కేసీఆర్ తెలంగాణ కోసం తన పదవికి తృణప్రాయంగా రాజీనామా చేశాడని, నువ్వు పార్టీ టికెట్ కోసం లాబీయింగ్‌లో బిజీగా ఉన్నప్పుడే ఆయన తెలంగాణ స్వరాష్ట్రం కావాలని పట్టుదలతో పోరాటం చేసి తెలంగాణ సాధించాడని గుర్తు చేశారు. తెలంగాణ గొంతుకలను అణచివేయడానికి నువ్వు తుపాకీ పట్టుకున్నప్పుడు, ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టాడని పేర్కొన్నారు. తెలంగాణను సగర్వంగా తలెత్తుకొనేలా చేసిన కేసీఆర్ ఈ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. పిచ్చి ప్రచారాలు చేస్తూ కేసీఆర్ పేరు చెరిపివేయవచ్చని అనుకోవటం మూర్ఖత్వమే అవుతుందన్నారు.

కుటుంబ సర్వే తోడ్పాటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి చిన్న విషయాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్న అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. సర్వేపై కలెక్టర్లతో పాటు అన్ని స్థాయిల్లో అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రధానంగా పట్టణాలపై దృష్టి పెట్టాలని కోరారు. సీఎస్ శాంత కుమారి, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తాన్య యితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు, కొత్త రెవెన్యూ రికవరీ చట్టంపై చర్చ

రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి భట్టి విక్రమార్క తో సమావేశం అయ్యారు. అంబేద్కర్ సచివాలయంలో జరిగిన సమావేశంలో కోదండ రెడ్డి తో పాటు సునీల్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ సింగ్ ఠాకూర్ .. ధరణి సమస్యలు, ప్రతిపాదన దశలో ఉన్న కొత్త రెవెను రికవరీ చట్టం గురించి వివరించారు. రాష్ట్రంలో భూసంస్కరణ చట్టం, అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టం, ధరణిలోని పార్ట్-ఎ లోని భూముల వివరాలపై చర్చించారు.

'నీట్' విద్యార్థినిపై అత్యాచారం

(మొదటిపేజీ తరువాయి)

మీడియాలో వైరల్ కావడంతో ధైర్యం చేసిన బాధితురాలు ఆ ఉపాధ్యాయులపై ఫిర్యాదు చేయడంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగింది. 2022లో ఒక బాలిక నీట్‌కు సన్నద్ధమయ్యేందుకు ఆ కోచింగ్ సెంటర్‌లో చేరింది. ఈ ఏడాది జనవరిలో బయోలజీ టీచర్ అయిన 32 ఏళ్ల సాహిల్ సిద్ధిఖీ తన ఇంట్లో పార్టీ పేరుతో ఆమెను ఆహ్వానించాడు. విద్యార్థులందరినీ పిలిచినట్లు చెప్పినప్పటికీ ఆ ఉపాధ్యాయుడి ఇంటికి చేరుకున్న ఆ బాలిక అక్కడ తాను మాత్రమే ఉన్నట్లు గ్రహించింది. మత్తుమందు కలిపిన పానీయం ఇచ్చి ఉపాధ్యాయుడు సిద్ధిఖీ ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. వీడియో రికార్డ్ చేసి ఆమెను బ్లాక్‌మెయిల్ చేశాడు. అతని ఇంట్లో నిర్బంధించి అనేక సార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒక పార్టీలో కెమిస్ట్రీ టీచర్ అయిన 39 ఏళ్ల వికాస్ పోర్వాల్ కూడా ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మరోవైపు హోలీ సందర్భంగా తల్లిదండ్రులను కలిసేందుకు ఆ బాలిక తన ఇంటికి వెళ్లింది. దీంతో సిద్ధిఖీ ఆమెకు ఫోన్ చేశాడు. వెంటనే తిరిగి రాకపోతే ఆమె కుటుంబానికి హాని చేస్తానని బెదిరించాడు. అయితే సిద్ధిఖీ మరో విద్యార్థినిని లైంగికంగా వేధించిన వీడియో వైరల్ అయ్యింది. ఈ కేసులో అరెస్టయిన అతను బెయిల్‌పై విడుదలయ్యాడు. దీంతో ధైర్యం చేసిన ఆ యువతి గురువారం ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు సిద్ధిఖీతో పాటు మరో ఉపాధ్యాయుడు వికాస్‌ను అరెస్ట్ చేశారు. వారిద్దరిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ అభిషేక్ పాండే మాట్లాడుతూ 'విద్యార్థిని తనపై వేర్వేరు సందర్భాలలో నిందితులు అత్యాచారం చేశారని చెప్పింది. కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి విచారిస్తున్నాం. ఆ సమయంలో విద్యార్థిని మైనర్. చాలా వివరాలను పంచుకోవద్దని మమ్మల్ని అభ్యర్థించింది' అని వివరించారు.

కూటములకు తప్పని ఇంటిపోరు

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ, శివసేన (ఏక్‌నాథ్ షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్)లు ఎనిమిది స్థానాలు - మన్‌ఖుర్ద్ శివాజీనగర్ (ముంబై), అష్టి (బీడ్), సింధ్‌ఖేడ్ రాజా (బుల్దానా), కటోల్ (నాగ్‌పూర్), మోర్షి (అమరావతి), దిండోరి (నాసిక్), శ్రీరాంపూర్ (అహ్మద్‌నగర్), పురందర్ (పూణే)లో పరస్పరం పోటీ చేయనున్నాయి. ఇక ఎంవీఏ కూటమి పక్షాలైన శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ), కాంగ్రెస్ పార్టీలు 21 అసెంబ్లీ నియోజకవర్గాలలో పరస్పరం తలపడనున్నాయి. ఇందులో ప్రధానమైన వాటిలో నాందేడ్ నార్త్ ఒకటి. ఇక్కడ శివసేన (యూబీటీ) అభ్యర్థి సంగీతా పాటిల్‌తో కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్ గఫూర్ పోటీపడుతున్నారు. ఇంకా చాలా నియోజకవర్గాల్లో పీసాంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా (పీడబ్ల్యూపీఐ), సమాజ్‌వాదీ పార్టీ, వామపక్షాల అభ్యర్థులపై ఎంవీఏ పక్షాలు పోటీ చేస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ ఎనిమిది మంది అభ్యర్థులను నిలబెట్టింది. ఇందులో కాంగ్రెస్‌తో కలిసి భివాండి వెస్ట్ (థానే), తుల్జాపూర్ (ధరాశివ్), ఔరంగాబాద్ తూర్పు (ఛత్రపతి సంభాజీనగర్), మాలెగావ్ సెంట్రల్ (నాసిక్) స్థానాల్లో,

ఎన్సీపీ (ఎస్పీ)తో కలిసి పరండా (ధరాశివ్)లో, శివసేన (యూబీటీ) తోలసి ధూలే సిటీ అసెంబ్లీ స్థానాల్లో ఎస్పీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక పీడబ్ల్యూపీఐ 14 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. పొత్తులో భాగంగా తమకు బలమున్న ఆరుస్థానాలను కోరినట్లు పీడబ్ల్యూపీఐ నేత ఒకరు తెలిపారు.

అయితే ఈ నియోజకవర్గాల్లో పెద్ద పార్టీలు అభ్యర్థులను నిలబెట్టాయని ఆయన అన్నారు. 14 స్థానాల్లో అభ్యర్థుల్ని నిలబెట్టడం వల్ల ఎంవీఏ కూటమి ఓట్లకు గండికొట్టే అవకాశం ఉందా అన్ని ప్రశ్నించగా... 'అదే జరుగుతుంది... ఏం చేస్తాం? మేం పెద్ద పార్టీల నుంచి సీట్లు కోరుకున్నాం కానీ అవి మొండిగా ఉన్నాయి' అని అన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అబూ అజ్మీ మాట్లాడుతూ, ఎంవీఏ ఐక్య కూటమిగా ఎన్నికల్లో పోరాడాల్సి ఉందని... అయితే అది తమ పార్టీని చర్చలకు కూడా పిలవలేదని అన్నారు. "వారు (ఎంవీఏ) తమ బలంతో ఎన్నికల్లో గెలవాలని భావిస్తున్నారు. మా (ఎస్పీ) అవసరం లేదు" అని ఆయన అన్నారు.

షోలాపూర్ సిటీ సెంట్రల్‌లో సీపీఎం అభ్యర్థి నర్సయ్య ఆడమ్, కాంగ్రెస్ అభ్యర్థి మధ్య పోటీ జరుగుతుండగా, వనీ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి హెపట్, శివసేన (యూబీటీ) అభ్యర్థి సంజయ్ దెర్కర్ పోటీలో ఉన్నారు.

నా గెలుపు అవకాశాలు పెరిగాయి

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్, సీపీఐ మధ్య పోటీ సమానస్థాయిలో సాగుతోందన్నారు. 'వయనాడ్ నుంచి విజయం నల్లేరుపై నడక కాదని ప్రియాంక గ్రహించారు. 2019లో కాంగ్రెస్‌కు నాలుగు లక్షల ఓట్లు వచ్చాయి. 2024లో 3.5 లక్షల ఓట్లు వచ్చాయి. ఈసారి ఆరు లక్షల ఓట్లు వస్తాయని చెప్పుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో సమానస్థాయిలో పోరు సాగుతోంది. ఇందుకు ప్రియాంక వచ్చి పలకరించడమే రుజువు' అని మొకేరి అన్నారు. వయనాడ్‌లో 2014 తరహా ఫలితాలు రాబోతున్నట్లు తెలిపారు. అప్పట్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఎంఐ షానవాస్‌కు చుక్కలు కనబడ్డాయని, 2009లో 1,53,439 ఓట్లు సాధించిన ఆయన 2014లో 20,870 ఓట్లకు పరిమితమయ్యారని మొకేరి గుర్తుచేశారు. 2014 ఎన్నికల్లో వయనాడ్‌లో మనంతవాదీ, సుల్తాన్ బతేరీ, కాల్పెట్టా వంటి నియోజకవర్గాల్లో తాను ఆధిక్యత సాధించడాన్ని గుర్తుచేశారు. 'ప్రియంక రోడ్‌షో నా సభ జరుగుతున్న వైపునకు రావడంతో ఆమె వాహనం దిగి, వేదిక వద్దకు వచ్చారు. ఎలా ఉన్నారంటూ నన్ను పలుకరించారు. ఆనందంగా ఉన్నానని, గెలుపుపై విశ్వాసంతో ఉన్నానని నేను సమాధానమిచ్చా. అంత ధీమా ఎందుకని ప్రియాంక ఆత్రుతగా ప్రశ్నించారు. 2014లో ఏం జరిగిందో ఆమెకు వివరించాను' అని మొకేరి తెలిపారు. మీరు పట్టించుకోని అనేక సమస్యలు వయనాడ్‌లో ఉన్నాయని ప్రియాంకతో చెప్పానన్నారు. 'ప్రచారంలో అభివృద్ధి గురించి మీరు మాట్లాడటం లేదు. దీనిని ప్రజలు గ్రహించారు. అందుకోసమే గెలుపుపై దీమాగా ఉన్నా అని చిరునవ్వుతో చెప్పాను' అని మొకేరి అన్నారు. ప్రియాంక అలా వచ్చి తనను పలకరించడం ఆత్మీయ భావన కలిగించిందని సత్యన్ మొకేరి చెప్పారు.

రష్యాలో కొత్త మంత్రిత్వశాఖ 'మినిస్ట్రీ ఆఫ్ సెక్స్'?

మాస్కో: రెండేళ్లకుపైగా ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగిస్తున్న రష్యా కొత్త సమస్యను ఎదుర్కొం టోంది. కొన్నేళ్లుగా రష్యాలో జనన-మరణాల్లో అంతరం భారీగా పెరుగుతున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ తరుణంలో మినిస్ట్రీ ఆఫ్ సెక్స్ పేరిట కొత్త శాఖను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన వచ్చింది. కుటుంబ రక్షణకు సంబంధిం చిన పార్లమెంట్ కమిటీ దానిని పరిశీలిస్తోందని అంతర్జాతీయ మీడియా కథనం పేర్కొం ది. జనన మరణాల రేటులో అంతరాన్ని తగ్గించేందుకు సరికొత్త వ్యూహాలు అమలు చేయాలని అధ్యక్షుడు పుతిన్ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఓ ఏజెన్సీ ఈ ప్రతిపాదన చేసింది. జననాల రేటు పెంచే కార్యక్రమాలన్నీ ఈ శాఖ పరిధిలో ఉంచాలంటూ కొన్ని సూచనలు చేసింది. బంధాలను ప్రోత్సహించేందుకు యువతకు ఫస్ట్ డేట్‌కు 5000 రూబెల్స్ ఇవ్వాలని సూచించింది. ఇంటిపనులు, పిల్లలను చూసుకునేందుకు ఉద్యోగం మానేయాలనుకునేవారికి కొంతమొత్తం చెల్లించాలని చెప్పింది. వీటితో పాటు మరికొన్ని అసాధారణ ప్రతిపాదనలు చేసింది. ఇదిలా ఉంటే... జననాల రేటు పెంచడం కోసం మహిళల వ్యక్తిగత వివరాలను అధికారులు సేకరిస్తున్నట్టు కథనాలు పేర్కొన్నాయి. డేటా సేకరణలో భాగంగా ప్రభుత్వ రంగానికి చెందిన మహిళా ఉద్యోగులకు కొన్ని ప్రశ్నలతో కూడిన ఫామ్స్ అందినట్లు తెలిపాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం... రష్యాలో ఈ ఏడాది జూన్ వరకు 5,99,600 మంది పిల్లలు జన్మించారు. 2023 జూన్‌తో పోలిస్తే దాదాపు 16,000 మంది పిల్లలు తక్కువగా పుట్టారు. 1999 నుంచి జననాల రేటులో తగ్గుదల కనిపిస్తోంది. మరోపక్క 2024 జనవరి నుంచి జూన్ మధ్య 3,25,100 మరణాలు నమోదయ్యాయని, గత ఏడాదితో పోలిస్తే ఇవి 49 వేలు అధికమని పేర్కొంది.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో రాజ్యాంగం ధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధాంతాల యుద్ధం నడుస్తోందని, ఒకవైపు ఇండియా ఐక్యసంఘటన, మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉన్నాయన్నారు. ఒకవైపు ప్రేమ, ఐక్యత, సోదరభావం ఉంటే... మరోవైపు హింస, కోపం, అహంకారం ఉన్నాయన్నారు. ఇండియా ఐక్యసంఘటన రాజ్యాంగాన్ని పరిరక్షించాలనుకుంటుంటే... బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాన్ని నాశనం చేయాలనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు.

అమరావతిపై దుష్ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

శనివారం మీడియాకు వివరించారు. 'వరద నిర్వహణకు అమరావతిలో ప్రవహిస్తున్న వాగులను విస్తరిస్తాం. కొండవీటి వాగు, పాలవాగు లోతు... వెడల్పు పెంచుతాం. వరద నిర్వహణ ప్రణాళిక డిజైన్‌ను సాంకేతిక కమిటీ ఆమోదించింది. రాజధాని అమరావతిలో వరద నిర్వహణ పనులకు రూ.2,062 కోట్లతో అంచనాలు రూపొందించాం. ఈ ప్రణాళికపై ప్రపంచ బ్యాంక్, ఏడీబీ సంతృప్తి చెందాయి. వరద పనులు 2019-24 మధ్య చేసి ఉంటే ఖర్చు తక్కువయ్యేది. 25-30 శాతం తక్కువ ఖర్చుతోనే పనులు పూర్తయ్యేవి. గత ఐదేళ్లలో జరిగిన నిర్లక్ష్యాన్ని సరిదిద్దాలని నిర్ణయించుకున్నాం.

వచ్చే మూడేళ్లలో వరద పనులతో పాటు నగర అభివృద్ధి చేస్తాం' అని సీఆర్‌డీఏ తెలిపింది.

కులగణనపైనే కాంగ్రెస్ దృష్టి: జైరాంరమేశ్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లపై 50శాతం పరిమితి రద్దు చేయడంపైనే కాంగ్రెస్ ప్రధానంగా దృష్టి పెట్టిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. భారతదేశ నిర్మాణకర్తలు, రాజ్యాంగ రూపకర్తలు కోరుకున్నట్లుగా దేశంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం ఆలోచనకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని అన్నారు. శనివారం నుంచి తెలంగాణలోని తమ ప్రభుత్వం కుల సర్వేకు నడుం బిగించిందన్నారు. 80వేల ఎన్యుమనేటర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారని, 33 జిల్లాలోని 1.17 కోట్ల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తారని జైరాం రమేశ్ చెప్పారు. 1931 నుంచి తెలంగాణలో ప్రభుత్వ పరిధిలో కులాధారిత సర్వే జరగడం ఇదే మొదటిసారన్నారు.

ఆరుగురు మావోయిస్టు సానుభూతిపరులు అరెస్ట్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు పార్టీకి చెందిన ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మణుగూరు డీఎస్పీ వి. రవీంద్ర రెడ్డి శనివారం అందించిన వివరాలు ఇలా వున్నాయి. చర్ల పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, సిఆర్పిఎఫ్ 141 సిబ్బందితో చర్ల మండలం తాలిపేరు డ్యామ్‌కి దగ్గరలోనీ అడవి ప్రాంతంలో సంచరిస్తుండగా వీళ్ళను అదుపులో తీసుకున్నారు. పట్టుకున్న ఒక వ్యక్తి దగ్గర ప్లాస్టిక్ సంచి ఉండగా దాన్ని తనిఖీ చేసారు. అందులో ఎలక్ట్రికల్ వైరుతో ఉన్న ప్రెషర్ కుక్కర్ దొరికింది. విచారించగా మావోయిస్టు పార్టీకి సానుభూతిపరులుగా పనిచేస్తున్నారని తెలింది. చర్ల మండలానికి చెందిన మడకం దేవ, సోడి ఉంగ, సోడి కొస, మడకం ఇడుమ, కలుమ అడుమ, కొవ్వాసి భీమయ్య, పేలుడు పదార్థాలను ఉపయోగించి కూంబింగ్ నిర్వహించే భద్రతా బలగాలను హతమార్చాలని వ్యూహం పన్నినట్లు డిఎస్పి వెల్లడించారు. అజ్ఞాత దళాలలో పనిచేస్తున్న నిషేధిత మావోయిస్టు పార్టీ నాయకులు, సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయి కోరారు. వీరికి ప్రభుత్వం అందించాలని సౌకర్యాలు చేకూరుస్తామని హామీ ఇచ్చారు. మీడియా సమావేశంలో డీఎస్పీతోపాటు ఎస్‌హెచ్‌ఓ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం : 56 వాహనాలు సీజ్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వనమా నగ, హమాలీ కాలనీలో స్థానిక పోలీసులు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ సూచనలతో శనివారం ఈ కార్యక్రమం చేసారు. ఇందులో భాగంగా అక్కడ ఉన్న ప్రతి ఇంటిని సోదా చేసి ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేసుకోవడం జరిగింది. మొత్తం 250 ఇండ్లను సోదా చేయగా సరైన పత్రాలు లేని 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను స్వాదీనం చేసుకున్నారు. అనుమానిత వ్యక్తుల ఇళ్లల్లో పోలీస్ జాగిలం చేత సోదాలు జరిపారు. ఈ సందర్భంగా పాల్వంచ సీఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ ఏరియాలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసు సమాచారం అందించాలని స్థానికులను కోరారు. తమ ఏరియాల్లో ప్రతి చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ టౌన్, రూరల్ ఎస్సైలు సుమన్, జీవన్ కుమార్, సురేష్, ములకలపల్లి ఎస్సై రాజశేఖర్, స్పెషల్ పార్టీ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - నేరేడు చర్ల : నేరేడుచర్ల పట్టణ పరిధిలో ఉన్న చెరువుల్లలో నాణ్యత లేని చేప పిల్లలు సొసైటీలకు పంపిణీ చేస్తున్నారని శనివారం సూర్యాపేట జిల్లా మత్స్య సహకార సంఘ ప్రమోటర్ పేర బోయిన వీరయ్య ముదిరాజ్ ఆరోపించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యశాఖను బలోపేతం చేసేందుకు నాణ్యమైన ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయాలని కాంట్రాక్టర్లకు అప్పగించగా అప్పుడే పుట్టిన చిన్న పిల్లలను అందిస్తూ, నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన చేప పిల్లలు ఇవ్వకుండా నాణ్యతలేని పిల్లలను అందిస్తున్నారని, పదివేల పిల్లలకు కేవలం 1000 పిల్లలని అందిస్తూ, రాత్రి వస్తున్నామని చెప్పి ఉదయమే హడావిడిగా పంపిణీ చేస్తూ మత్స్య సహకార సంఘాలను మోసం చేస్తున్నారని ఇలా చేయడం సరికాదని అన్నారు. హడావిడిగా పంపిణీ చేసే నాణ్యతలేని చేప పిల్లలు ఎవరు తొందరపడి తీసుకోవద్దని మత్స్య సహకార సంఘాలను కోరారు. ప్రతి సొసైటీ సభ్యులు పిల్లలను తీసుకునేటప్పుడు మనకు ఇచ్చిన ఇండెంట్‌లో ఉన్న సైజు, ఉన్న రకాలు, ఉన్న సంఖ్యలను సరిపోలితేనే తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖలను కోరారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని లేదంటే జిల్లా స్థాయిలో మత్స్య కార సొసైటీల సభ్యులచే రాష్ట్రస్థాయి అధికారులకు, అవసరమైతే, జిల్లా మంత్రివర్యులు, ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ సూచనల ప్రకారం కుటుంబ సర్వే చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రభుత్వ సూచనల ప్రకారం సమాచారాన్ని సేకరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం జిల్లాలో కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, కురవి మండల కేంద్రంలో ఇంటింటి కుటుంబ సర్వే, స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సర్వే చేసే ఎన్యుమినేటర్స్ ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం ఖచ్చితమైన సమాచారం సేకరించాలని, విధులలో ఎలాంటి అలసత్వం వహించకుండా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే చేసిన రికార్డులను అత్యంత జాగ్రత్తగా భద్రపరచడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట కురవి ప్రత్యేక అధికారి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, తహసిల్దార్ సునీల్ రెడ్డి, ఎంపీడీవో వీరబాబు, తదితరులు ఉన్నారు.

డీఆర్‌ఓగా అదనపు బాధ్యతలు స్వీకరించిన రత్న కళ్యాణి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా: శుక్రవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఓ కార్యాలయంలో ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) గా అదనపు బాధ్యతలు స్వీకరించిన నిర్మల్ ఆర్డిఓ రాయపుడి రత్న కళ్యాణి డిఆర్ఓగా బాధ్యత స్వీకరించారు.

చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

విశాలాంధ్ర - కూసుమంచి : రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం మంత్రి కూసుమంచి మండల తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వరి పంట సాగు చేసిన రైతులు నిర్భయంగా ఉండాలని, చివరి గింజ వరకు మద్దతు ధరపై ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అదే విధంగా సన్న వడ్లకు క్వింటాల్‌కు అదనంగా రూ. 500 చెల్లిస్తామని అన్నారు. గత ప్రభుత్వాలు రైతుల పట్ల ఎలా వ్యవహరించాయో మనందరికీ తెలుసని అన్నారు. ప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలు, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రానికి ఉన్న అప్పులు తీరుస్తూ, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, మరో 13 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉందని, డిసెంబర్ నెలాఖరు నాటికి పెండింగ్ రుణమాఫీ చేస్తుందని అన్నారు. నిరుద్యోగ యువతకు ప్రజా ప్రభుత్వం వచ్చిన పది నెలల వ్యవధిలో 57 వేల పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల భర్తీకి పరీక్షలను నిర్వహించామని, డిసెంబర్ నెలలో వారికి ఉద్యోగాల అపాయింట్మెంట్ ఆర్డర్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను తప్పనిసరిగా అమలు చేస్తామని అన్నారు. మంత్రి ఈ సందర్భంగా 61 మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు రూ. 6107076 ల చెక్కులను పంపిణీ చేశారు. కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో ఇటీవలి వరదల్లో మృతి చెందిన షేక్ యాకుబ్, సైదాబీ దంపతుల కుమారులు షేక్ యూసుఫ్, షేక్ షరీఫ్‌లకు కూసుమంచి మండల కేంద్రంలో ఇండ్ల స్థల పట్టాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పకడ్బంధీగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ఇల్లందు : సమగ్ర కుటుంబసర్వేను పకడ్బంధీగా నిర్వహించా లని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక జేకే కాలనీలో కొనసాగుతున్న సర్వేను స్వయంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబసర్వే కార్యక్రమంలో కుటుంబ సభ్యుల వివరాలను ఎలాంటి పొరపాట్లకు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సర్వే ప్రక్రియలో భాగంగా కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్‌ల ప్రకారం ఇళ్లను సందర్శించి కుటుంబ వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. స్వయంగా కొన్ని నివాసాల్లో సర్వేను సిబ్బందితో కలిసి కలెక్టర్ కుటుంబ వివరాల ప్రక్రియను సేకరించి పలు సూచనలు చేశారు. సర్వేపై అనుమానాలు ఏమైనా ఉంటే తహసిల్దార్, ఎంపీడీవోలను సంప్రదించాలని కలెక్టర్ కోరారు. అనంతరం ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. త్వరతరగతిన పనులు పూర్తి కావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో ధన్ సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - కొమురం భీం : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జిల్లాలో శనివారం ప్రారంభమైన కుటుంబాల ప్రశ్నావళి సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని వార్డు నెంబర్ 15నిర్వహిస్తున్న సర్వే తీరును జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే పరిశీలించారు. సర్వే లక్ష్యాన్ని నెరవేర్చే బాధ్యత ఎన్యుమరేటర్లపై ఉంటుందన్నారు. నిర్దేశించిన ఫారంలో ఇచ్చిన ప్రతి అంశాన్ని ప్రజల వద్ద నుండి సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధిపై పాలకులు దృష్టి పెట్టాలి

టిజిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : స్వాతంత్రం సిద్ధించి 70 ఏళ్ళు దాటినప్పటికీ ఆదునిక సమాజానికి, సౌకర్యాలకు ఆదివాసీల ఇంకా దూరంగా ఉండి పాలకుల నిరాదరణకు గురవుతూనే ఉన్నారని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పాలకుల తీరు తెన్నులు మార్చుకుని నిజాయితీగా పవారి అభివృద్ధి కోసం పని చేయాలని కోరారు. తెలంగాణ గిరిజన సమాఖ్య కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ శనివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల అసలైన సమస్యలను గుర్తించి రాజ్యాంగపరంగా సామాజిక బాధ్యతగా భావించి కేంద్ర, రాష్ట్ర పాలకులు వివక్ష చూపకుండా నిబద్ధతగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పోలీసులు మరోవైపు నక్సలైట్ల మధ్య ఆదివాసి తెగలు నలిగిపోతున్నాయని, ప్రాణాలు బలిదానం అయిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లిస్తుండటంతో గిరిజన గ్రామాలు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదన్నారు. ఆదివాసీ గిరిజనులు సంఘటితమై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి నాయక్, నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, సోంది కుటుంబరావు, బానోతు వెంకట్, రామచంద్రనాయక్, వెంకట్ నర్సమ్మ, భూక్య దసురు, గూగుల్లోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు ఎలాంటి తప్పులకు తావు లేకుండా పూర్తి వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. శనివారం మెదక్ పట్టణంలో వెంకట్రామ నగర్ కాలనీ, హావేలీ ఘనపూర్ మండలం కొత్తపల్లిలో పర్యటించారు. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పరిశీలించి మొదటి రోజు వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని ఎన్యూమరేటర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే సూపర్వైజర్లకు, ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మెదక్ జిల్లాలో 2 లక్షల 20 వేల ఇండ్ల జాబితా నమోదు చేయడం జరిగిందన్నారు. మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్స్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని, ప్రజలందరికీ సర్వేపై కలెక్టర్ వివరిస్తూ ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పట్టాదారు పాస్ పుస్తకం సమగ్ర సమాచారం అందించి సహకరించగలరని సూచించారు. ఎన్యుమరేటర్లు ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తగా దాదాపు 56 అంశాలతో కూడిన వివరాలను పొందుపరచాలని అన్నారు. వెంట తహసిల్దార్లు లక్ష్మణ్ బాబు, లావణ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

విశాలాంధ్ర - హుస్నాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో నాటి మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్ అన్నారు. శనివారం సీపీఐ అనభేరి ప్రభాకర్, సింగిరెడ్డి భూపతిరెడ్డి అమరుల భవనంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే మహాపాదయాత్ర సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి మాట్లాడుతూ ఈనెల 27, 28 తేదీల్లో కరీంనగర్ లోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం, నుండి వేములవాడలోని మహాదేవుని ఆలయం వరకు జరిగే ఉద్యమ కారుల విజయ సంకల్ప మహా పాదయాత్రకు హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయిలోని వివిధ మండలాల్లో గ్రామీణ, ప్రాంతాల్లో ఉన్నటువంటి తెలంగాణ ఉద్యమ కారులు హాజరై మహాపాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని హుస్నాబాద్, కొహెడ, సైదాపూర్, ఎల్కతుర్తి, మండలాల అధ్యక్షులు వస్తాదుల సదానందం, శ్రావణ్ రెడ్డి, అయిలేని సంజీవరెడ్డి, నిమ్మల మనోహర్, మహ్మద్ అంకుశావలి, గుంటిపెల్లి లక్ష్మీ, ఏలూరి స్వాతి, చోక్కం ఎల్లవ్వ, రోళ్ళ భాగ్యలక్ష్మి, పెరక శ్రీనివాస్, గోవింద వెంకటేష్, బత్తుల చంద్రమౌళి, కేతిరి మమత, గద్దం స్వామి, మామిడి మొగిళి, తాటిపల్లి శంకర్, కే.విద్యాసాగర్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర- పినపాక : సైబర్ నేరగాలతో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదేశాల మేరకు సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం హెడ్ కానిస్టేబుల్ మల్సూర్ గోపాలరావుపేట గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. సమగ్ర కుటుంబ సర్వే జరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు చరవాణిలో గాని, ప్రత్యక్షంగా గాని మీ బ్యాంక్ వివరాలు, ఆధార్ వివరాలు, ఓటీపీలు చెప్పమని అడిగే అవకాశాలు అవకాశాలున్నాయని వివరించారు. సమగ్ర సర్వే సిబ్బంది ఎటువంటి బ్యాంకు వివరాలు అడగరని స్పష్టం చేశారు. ఎవరైనా వచ్చి అనుమానస్పదంగా వివరాలు అడిగితే పోలీస్‌స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : శనివారం హైదరాబాద్ నుండి సమగ్ర కుటుంబ సర్వేపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయాలతో కలిసి ఉప ముఖ్యమంత్రి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమగ్ర కుటుంబ సర్వేకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు, కలెక్టర్‌లతో చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారని జిల్లా కలెక్టర్లను, ఎన్యూమరేటర్లు ను ఉప ముఖ్య మంత్రి అభినందించారు. శనివారం నుండి ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియతో యావత్తు దేశం మొత్తం తెలంగాణను గమనిస్తున్నదని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్ వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, సర్వే కు ముందు రోజు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి డిఆర్ఓ రత్నాకళ్యాణి, సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్ గౌడ్, శంకర్, అంబాజీ, శ్రీనివాస్, మోహన్ సింగ్, ఏడి మార్కెటింగ్ శ్రీనివాస్, ఏడి సర్వే లాండ్ రికార్డ్ రాథోడ్ సుదర్శన్, మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, రాజేష్ కుమార్, మనోహర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై గ్లోబల్ నిపుణులతో అపోలో కేన్సర్ కాన్‌క్లేవ్ భాగస్వామ్యం

ముంబయి : అపోలో క్యాన్సర్ సెంటర్స్, ముంబై శనివారం నిర్వహించిన అపోలో క్యాన్సర్ కాన్‌క్లేవ్ 7వ ఎడిషన్‌కు 2,000 మందికి పైగా ఆంకాలజిస్టులు హాజరయ్యారు. వీరిలో 400 మంది ఫ్యాకల్టీతో పాటు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ క్యాన్సర్ కేర్ నిపుణులు, పరిశోధకులు కూడా ఉన్నారు. సమకాలీన చికిత్సల నుండి ప్రెసిషన్ క్యాన్సర్ చికిత్సల వరకు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అంశాలను అన్వేషించటం, క్యాన్సర్ సంరక్షణలో తాజా పురోగతులు, ఆవిష్కరణలను చర్చించడంపై ఈ కార్యక్రమం దృష్టి సారించింది. నవంబర్ 8 నుండి 10వ తేదీ వరకు జరిగిన ఈ సదస్సు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లు, రీసెర్చ్ ప్రెజెంటేషన్‌లలో పాల్గొనడానికి శక్తివంతమైన వేదికను అందించింది. గుర్తింపు పొందిన, అభివృద్ధి చెందుతున్న క్యాన్సర్ సంరక్షణ చికిత్సలు, నిర్వహణ వ్యూహాల గురించి కీలకోపన్యాసం, పలు చర్చా కార్యక్రమాలు అమూల్యమైన పరిజ్ఞానం అందించాయి.

మిర్చి సహకారంతో ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ స్పెల్ బీ రీజనల్ ఫైనల్

హైదరాబాద్: భారతదేశంలోని అత్యంత విశ్వసనీయ జీవిత బీమా సంస్థలలో ఒకటైన ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, మిర్చి సహకారంతో, హైదరాబాద్‌లో ఎస్బిఐ లైఫ్ స్పెల్ బీ 2024 - 'బీ స్పెల్‌బౌండ్' 14వ ఎడిషన్ కోసం రీజినల్ ఫైనల్స్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభా వంతులైన యువ స్పెల్లర్‌లను ఒకచోట చేర్చే ఈ పోటీ ఇప్పుడు దాని తదుపరి దశకు చేరుకుంది. హైదరాబాద్ రీజినల్ ఫైనల్‌లో హైదరాబాద్ నుండి 27 పాఠశాలల నుండి 8,425 మంది విద్యార్థులకు గాను 52 మంది విద్యార్థులు ఫైనల్‌లో పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని కెన్నెడీ హై ద గ్లోబల్ స్కూల్‌కు చెందిన 9 వ తరగతి విద్యార్థి, 13 ఏళ్ల యశ్విన్ పచౌరి తన అత్యుత్తమ స్పెల్లింగ్ సామర్థ్యం, మేధో నైపుణ్యంతో ఎస్బిఐ లైఫ్ స్పెల్ బీ 2024 హైదరాబాద్ రీజినల్ ఫైనల్‌ను గెలుచుకున్నాడు. అతను ఇప్పుడు ఇతర నగరాల నుండి ఎంపిక చేయబడిన విజేతలతో పోటీ పడనున్నాడు. ఈ పోటీ డిసెంబర్ 24న జరుగనుంది. అభిషేక్ కర్ మజుందార్, రీజనల్ డైరెక్టర్ - హైదరాబాద్ రీజియన్, ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఇతర ప్రముఖుల సమక్షంలో ఫైనలిస్టులను సత్కరించారు.

సోనీ లివ్ ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ ట్రైలర్ ఆవిష్కరణ

హైదరాబాద్: ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్రీడమ్ ఎట్ మిడ్ నైట్ ట్రైలర్ విడుదలైంది. స్టూడియోనెక్స్ట్‌తో కలిసి ఎమ్మే ఎంటర్‌టైన్‌మెంట్ (మోనిషా అద్వానీ అండ్ మధు భోజ్వానీ) నిర్మించారు, ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్‌లో తెరవెనుక ఒక అద్భుతమైన బృందం ఉంది. నిఖిల్ అద్వానీ ఈ ప్రాజెక్ట్‌కి షోరన్నర్, డైరెక్టర్‌గా నాయకత్వం వహిస్తుండగా, అభినందన్ గుప్తా, అద్వితీయ కరేంగ్ దాస్, గుందీప్ కౌర్, దివ్య నిధి శర్మ, రేవంత సారాభాయ్, ఏతాన్ టేలర్‌లతో సహా ప్రతిభావంతులైన బృందంఈ కథను అందించింది. లారీ కాలిన్స్ మరియు డొమినిక్ లాపియర్ రాసిన పేరులేని పుస్తకం ఆధారంగా, ఈ ధారావాహిక భారతదేశం స్వాతంత్ర్య పోరాటం చుట్టూ ఉన్న గందరగోళ సంఘటనలను లోతుగా పరిశోధిస్తుంది. ఈ ధారావాహికలో జవహర్‌లాల్ నెహ్రూగా సిధాంత్ గుప్తా, మహాత్మా గాంధీగా చిరాగ్ వోహ్రా, సర్దార్ వల్లభాయ్ పటేల్‌గా రాజేంద్ర చావ్లా, ముహమ్మద్ అలీ జిన్నాగా ఆరిఫ్ జకారియా, ఫాతిమా జిన్నాగా ఇరా దూబే, సరోజినీ నాయుడుగా మలిష్కా మెండోన్సా, లిఖ్వా కుమారి రాజ్‌త్‌తో సహా నక్షత్ర తారాగణం నటించింది.ఇది సోనీ లివ్‌లో నవంబర్ 15న ప్రసారం కానుంది.

కాప్‌స్టన్ సర్వీసెస్ ఆర్థిక ఫలితాలు వెల్లడి

హైదరాబాద్: ఎండ్-టు-ఎండ్ మ్యాన్‌పవర్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన కాప్‌స్టన్ సర్వీసెస్ లిమిటెడ్, సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన క్యూ2 ఎఫ్‌వై25 ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ.168.34 కోట్లు అంటే 30.51% పెరిగింది. ఈబీఐటీడీఏ 7.49 కోట్ల వద్ద ఉంది, 37.42% పెరిగింది. పీఏటీ (ప్యాట్) 3.94 కోట్లుగా ఉంది. వివరాల్లోకి వెళితే, క్యూ2ఎఫ్‌వై25లో మొత్తం ఆదాయం రూ.168.34 కోట్లు ఉండగా, క్యూ2ఎఫ్‌వై24లో రూ.128.99 కోట్లతో పోలిస్తే, 30.51% పెరిగింది. క్యూ2ఎఫ్‌వై24లో రూ.5.45 కోట్లతో పోలిస్తే ఈబీఐటీడీఏ రూ.7.49 కోట్లు, 37.42% వృద్ధిని నమోదు చేసింది. ఇక హెచ్1ఎఫ్‌వై24లో రూ.242.25 కోట్లతో పోలిస్తే మొత్తం ఆదాయం రూ.321.99 కోట్లుగా ఉంది, 32.92% పెరిగింది. హెచ్1ఎఫ్‌వై24లో రూ.10.88 కోట్లతో పోలిస్తే ఈబీఐటీడీఏ 14.15కోట్లు, 30.06% వృద్ధిని నమోదు చేసింది. నికర లాభం రూ.7.26 కోట్లు.

సిగ్నేచర్‌గ్లోబల్ భారీ వృద్ధిరేటు

ముంబయి: భారతదేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కంపెనీలలో సిగ్నేచర్ గ్లోబల్ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఆదాయం హెచ్1ఎఫ్‌వై25లో రూ.59.0 బిలియన్ల ప్రీ-సేల్స్, క్యూ2ఎఫ్‌వై24లో 184% నుండి రూ.27.85 బిలియన్లకు పెరిగింది. క్యూ1ఎఫ్‌వై25 సమయంలో, రూ30బిలియన్ల టౌన్‌షిప్ ప్రాజెక్ట్‌లు దాక్సిన్ విస్టాసిన్ సోహ్నా కారిడార్ రూ. 23 బిలియన్ల కోసం గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్ట్ టైటానియం ఎస్‌పీఆర్ విజయవంతంగా ప్రారంభించడం ద్వారా బలమైన ప్రీ-సేల్స్ పనితీరు నడపబడింది. కంపెనీ సేకరణలు 60% నుండి రూ.21.3 బిలియన్ల హెచ్1ఎఫ్‌వై25 వరకు పెరిగాయి. పీ అండ్ ఎల్ ఖాతాలో ప్రతిబింబించడం ప్రారంభించిన మరిన్ని ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడంతో పాటు ఆర్థిక నివేదికలను మరింత పటిష్టం చేసే అవకాశం ఉన్నందున, ప్రీ-సేల్స్‌లో పెరుగుదలతో పాటు, కంపెనీ హెచ్1ఎఫ్‌వై25 కోసం 342% వైఓవై నుండి రూ.11.5 బిలియన్ల ఆదాయంలో వృద్ధిని నమోదు చేసింది.

హైదరాబాద్‌లో టెక్సాస్ రివ్యూ అతిపెద్ద ప్రపంచ ఎడ్యుకేషన్ ఫెయిర్

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రముఖ విదేశీ విద్య కన్సల్టెన్సీ అయిన టెక్సాస్ రివ్యూ బేగంపేటలోని మారిగోల్డ్ హొటల్‌లో వరల్డ్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమం విదేశాల్లో చదువుకోవడానికి అవకాశాలను అన్వేషిస్తోన్న 1000 మంది అభ్యర్థులను ఆకర్షించింది. విద్యార్థులు యుఎస్‌ఏ, యుకె, జర్మనీ, ఐర్లాండ్, ఫ్రాన్స్, కెనడా, సైప్రస్, మాల్టా, డెన్మార్క్ మొదలైన 75 పైగా విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన ప్రతినిధులతో నేరుగా మాట్లాడే అవకాశం కలిగింది. క్యాంపస్ ఫ్రాన్స్ ఇండియా నుండి ప్రతినిధులు ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించే భారతీయ విద్యార్థులకు మద్దతు ఇస్తూ, ఫ్రెంచ్ రిపబ్లిక్ చొరవతో క్యాంపస్ ఫ్రాన్స్ ఇండియా ఈ కార్యక్రమములో పాల్గొంది. ఈ కార్యక్రమంలో వారు పాల్గొనటం, భారతదేశంతో విద్యా సంబంధాలను మరింతగా పెంచుకోవడంలో ఫ్రాన్స్‌కు ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. దాని గౌరవప్రదమైన విశ్వవిద్యాలయాలు మరియు గొప్ప సాంస్కృతిక ఆకర్షణతో, రాబోయే సంవత్సరాల్లో మరింత మంది భారతీయ విద్యార్థులను ఆకర్షించాలని ఫ్రాన్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

10 నుంచి జీ తెలుగు సింగింగ్ షో సరిగమప సీజన్ 16

విశాలాంధ్ర - ఆదిలాబాద్: తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మ్యూజికల్ రియాలిటీ షో సరిగమప సీజన్ 16 నవంబర్ 10 నుండి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి 10 గంటల వరకు జీ తెలుగులో ప్రసారం కానుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ సీజన్‌కు సంగీత దిగ్గజాలు కోటి, ఎస్పీ శైలజ, కాసర్ల శ్యామ్‌తో ఈ సీజన్ ఉత్తేజకరమైన ప్రదర్శనలు, మనసును హత్తుకునే పాటలతో సంగీత ప్రియులకు మరింత వినోదం పంచబోతోందన్నారు. ప్రతి కంటెస్టెంట్ తమ ఆకట్టుకునే ప్రదర్శనలతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్‌గా మారుతున్నారన్నారు. ఔత్సాహిక గాయకులు తదుపరి సింగింగ్ సెన్సేషన్ టైటిల్ కోసం పోటీ పడుతుండటంతో థ్రిల్లింగ్ కాంపిటీషన్లు, మరచిపోలేని క్షణాలను అందిస్తూ ప్రతి వీకెండ్‌ను మరింత స్పెషల్ చేస్తోందన్నారు. ఆదివారం అంతులేని వినోదం అందించే ఉద్దేశంతో జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రసార సమయాన్ని మరింత పెంచిందన్నారు. శ్రోతల మనసును తాకే సంగీతంతోపాటు చక్కని వినోదం అందించే లక్ష్యంతో వస్తున్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటలకు, తప్పక చూడాలన్నారు.

సంపాదకీయం

సి.జె.ఐ. వెళ్లిపోయారు ఉమర్ ఉండిపోయారు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆదివారం పదవీ విరమణ చేయనున్న న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ కొన్ని వారాల నుంచి తన ప్రతిష్ఠను తానే తగ్గించుకునే పనిలో మునిగిపోయారు. పైగా చరిత్ర నన్ను ఎలా గుర్తుంచుకుంటుంది అని ప్రశ్నించుకున్నారు. చరిత్రలో అప్పుడప్పుడు వక్రీకరణలు కూడా జరగొచ్చు. కానీ తమను చరిత్ర ఎలా గుర్తుంచుకుంటుందో ఎవరికైనా తెలుస్తూనే ఉంటుంది. డి.వై.చంద్రచూడ్ ప్రధాన న్యాయమూర్తి అయిన తరవాత ఉదారవాది, పౌరుల హక్కులకు కాపలా ఉండే వ్యక్తి, బెయిలు హక్కు, జైలు అత్యవసరమైతేనే అని మనస్ఫూర్తిగా నమ్మిన వ్యక్తిగా కనిపించారు. లేదు అలా కనిపించడానికి పనిగట్టుకుని ప్రయత్నించినట్టున్నారు. ఆయన పదవీకాలం ఇటీవల ఏ ప్రధాన న్యాయమూర్తికీ లేనట్టుగా రెండేళ్లు ఉండడం కూడా ఆయన మీద ఆశలు పెరిగాయి. ఆయన పదవీకాలం అంత్యదశకు వస్తున్న కొద్దీ అనేక వివాదాల్లో చిక్కుకున్నారు. విమర్శలకు గురయ్యారు. చివరకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు కొందరు విమర్శలకు దిగారు. ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటు చేయకూడదని అన్నవాళ్లూ ఉన్నారు. కానీ తారీఖుల ప్రకారం ఆయన పదవీ విరమణ ఆదివారం అయినప్పటికీ ఆయన పనిచేసిన ఆఖరి రోజైన శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం ఏ లోటూ చేయకుండా చాలా గౌరవప్రదంగా వీడ్కోలుసభ ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కపిల్ సిబల్ మొన్న మొన్న కూడా ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నడవడిక మీద పెదవి విరిచినా వీడ్కోలు సభలో మాత్రం ఆయన గుణగణాలను నోరారా పొగిడారు. కాబోయే ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా సైతం చంద్రచూడ్ గురించి నాలుగు మంచి మాటలే చెప్పారు. సామాజిక మాధ్యమాలలో తనను తప్పుపట్టిన వాళ్లు అనేకమంది ఉన్నారని, ఏ న్యాయమూర్తినీ ఇంతగా విమర్శించలేదని చంద్రచూడ్ అన్నారు. తాను ఆదివారం పదవీ విరమణ చేస్తాను కనక సోమవారం నుంచి వారంతా నిరుద్యోగులైపోతారుగా పాపం అన్నారు. వీడ్కోలు సభలో చంద్రచూడ్ మాట్లాడినప్పుడు అనేకసార్లు ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు. వీడ్కోలు సభల్లోనూ, సంతాప సభల్లోనూ ఎవరూ విమర్శలకు దిగరు. అందుకే ఎక్కడా ఆయనమీద అసంతృప్తి ఉన్నట్టు కనిపించనేలేదు. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ చెప్పే మాటలకూ ఆచరణకు చాలాసార్లు పొంతన కుదరడం లేదు. ఇటీవల ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన "అడ్డా" కార్యక్రమలో పాల్గొంటూ తాను ఎ టు జడ్ అందరికీ బెయిలు ఇప్పించానన్నారు. బెయిలు హక్కు అని ఆయన ఇంతకాలం నుంచి పదే పదే చెబుతున్నారు కనక ఈ మాటకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఆయన ఎ టు జడ్ అనడంలో ఓ అంతరార్థం ఉంది. ఎ అంటే రిపబ్లిక్ టీవీ అర్నాబ్ గోస్వామి. జడ్ అంటే జుబేర్. ఆల్ట్ న్యూస్‌లో పనిచేసే పత్రికా రచయిత. ఇక్కడ దాకా బాగానే ఉంది. చంద్రచూడ్ చేసిన ప్రసంగాల మీద, ఇచ్చిన తీర్పుల మీద చాలాకాలం చర్చ జరుగుతూనే ఉంటుంది. మంచి చెడ్డలను బేరీజు వేసేవారు ఉండనే ఉంటారు. ఈ మథనం తరవాత చరిత్రలో ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ స్థానం ఏమిటో తేలొచ్చు. ఆయన మీద విమర్శలు ఎంత తీవ్రమైనవి అంటే సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం నేత దుష్యంత దవే అయితే ఆయనకు చరిత్రలో ఏ స్థానమూ ఉండదన్నారు.

పదవీ విరమణ చేస్తున్న చంద్రచూడ్ ఎ టు జడ్ అనడంలో అలాంకారికత కొంత ఉండొచ్చు. కానీ అర్హులైన వారెవరికీ తాము బెయిలు నిరాకరించలేదని ఆయన ఖండితంగా చెప్పారు. బెయిలు హక్కు అని చెప్పి ఊరుకోకుండా కిందిస్థాయి న్యాయమూర్తులు తమ స్థానం తాము కాపాడుకోవడానికి బెయిలు ఇవ్వడానికి జంకుతూ ఉంటారని కూడా ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అన్నారు. బెయిలు ఇవ్వాల్సి వచ్చినప్పుడు ఇంగిత జ్ఞానం ఉపయోగించాలిగా అని దెప్పి పొడిచారు కూడా. ద్రవ్య అక్రమ చెలామణి నిరోధక చట్టం ప్రకారం కూడా బెయిలు పొందడానికి హక్కు ఉంటుందని ఆయన గట్టిగానే చెప్పారు. కానీ ఎ టు జడ్ బెయిలు మంజూరు చేశానని అలంకారిక భాషలో చెప్పినప్పటికీ ఎక్కాలు చదవమంటే కాస్త కఠినంగా ఉండే 13వ ఎక్కం, 17వ ఎక్కం దాట వేసినట్టు ఆ ఎ టు జడ్ లో "జి" (గుల్ఫిషా ఫాతిమా), "క్" ఖాలిద్ సైఫీ, "ఎస్"– షెర్జిల్ ఇమాం, "యు" ఉమర్ ఖాలిద్ లాంటి వారికి నాలుగేళ్లుగా బెయిలు ఎందుకు మంజూరు కాలేదో మాత్రం న్యాయమూర్తి చంద్రచూడ్ చెప్పలేదు. ఉమర్ ఖాలిద్ లాంటి వారికి బెయిలు ఎందుకు మంజూరు కావడం లేదని నిర్దిష్టంగా ప్రశ్నించినప్పుడే ఆయన ఎ టు జడ్ అన్న మాట వాడారని గుర్తుంచుకోవాలి. ప్రధాన న్యాయమూర్తి తీర్పుల్లో మంచివీ ఉండొచ్చు. మంచివి కానివీ ఉండొచ్చు. కానీ ఆయనకు ఉన్న జ్ఞానం అపారమని అంగీకరించాల్సిందే. బెయిలు హక్కు అన్న మాట పదవీ విరమణ చేస్తున్న చంద్రచూడ్ నోట వినిపించినట్టు మరెవరి నోటా వినిపించలేదు. తాను వాడుతున్న భాష గురించి చంద్రచూడ్‌కు కచ్చితంగా మంచి అవగాహనే ఉంటుంది. ఆయన చాకచక్యంగా మాట్లాడి ఉండవచ్చు. తన భాషా పటిమను ప్రదర్శించి ఉండవచ్చు. కానీ ఆ మాటలు ఎంత నర్మగర్భంగా ఉన్నా కాలం ఆ మాటల వెనక ఉన్న సత్యాన్ని వెంటాడుతూనే ఉంటుంది. ఢిల్లీ అల్లర్లను ప్రోత్సహించారన్న ఆరోపణ ఎదుర్కొంటున్న ఉమర్ ఖాలిద్ లాంటి వారు నాలుగేళ్ల పై నుంచి జైలులో మగ్గుతున్నారు. అటు బెయిలూ రాదు. ఇటు విచారణా ప్రారంభం కాదు. ఇన్నాళ్లలో ఉమర్ ఖాలిద్‌కు సోదరి పెళ్లి కోసం వారం రోజులు స్వేచ్ఛ లభించింది. ఆ వారం రోజులూ ఆయన కనీసం కునుకు తీయలేదు. ప్రతిక్షణం కుటుంబంతో గడపాలనుకుని నిద్ర మానుకున్నారు. ఇప్పుడు వారానికి ఒకసారి మాత్రమే అంతర్జాలం ద్వారా వీడియో కాల్‌లో తల్లిదండ్రులతో మాట్లాడొచ్చు. ఉమర్ ఖాలిద్ బెయిలు కోసం పెట్టుకున్న పిటిషన్ సుప్రీంకోర్టులో కనీసం 14 సార్లు వాయిదా పడింది. ఒకసారి బెంచి ఉండదు. ఒకసారి న్యాయమూర్తి ఈ కేసును విచారించలేనంటారు. మరోసారి ఇంకేదో అవాంతరం వస్తుంది. షెర్జిల్ ఇమాం బెయిలు పిటిషన్ ఢిల్లీ హైకోర్టులో 2022 ఏప్రిల్ నుంచి నానుతోంది. "మిమ్మల్ని బెయిలు ఇమ్మని కోరడం లేదు. ఇస్తే ఇవ్వండి లేదా తిరస్కరించండి. కనీసం విచారించండి" షెర్జిల్ పిటిషన్ 64 సార్లు ప్రస్తావనకు వచ్చింది. కనీసం విచారించండి అని ఆయన తరపు న్యాయవాది సిద్ధార్థ దవే మొరపెట్టుకున్నారు. ఈ అంశాలేవీ ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ చెవిన పడలేదనుకోవాలేమో! అప్పటిదాకా బెయిలు హక్కు అని నినదిస్తూ సంతృప్తి పడదాం.

మానవాళి జీవనంలో ఎనలేని మార్పులు

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

నాటి పాత రాతియుగం నుంచి నేటి డిజిటల్-ఏఐ యుగం వరకు మానవాళి జీవనశైలిలో ఎనలేని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అంతర్జాలంతో భూమి కుగ్రామం అయిపోయింది. అరచేతిలో స్మార్ట్‌ఫోన్ వైకుంఠంగా వెలిసింది. దేశాల సరిహద్దులు వెలవెలబోతున్నాయి. వేల కిలోమీటర్ల దూరాలు క్షణాల్లో ఆడియో, వీడియో కాల్స్ ద్వారా దగ్గరవుతున్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, సమాచార వితరణలాంటి అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకనాడు ఊహకందని ఇలాంటి అద్భుత నవ్యజీవన విధానాలు వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాల వల్లనే సుసాధ్యం అవుతున్నది. నేటి ఆవిష్కరణ రేపు పాతబడిపోతున్నది. సైన్స్ లేదా వైజ్ఞానిక శాస్త్రం పరిష్కరించని సమస్యలు ఉండడంలేదు. వైజ్ఞానికశాస్త్ర మాధ్యమంగా సాంకేతిక ప్రగతి కొత్త పుంతలు తొక్కుతున్నది. మానవాళి అన్ని సమస్యలకు సరైన పరిష్కారాలు దొరుకుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా పౌర సమాజ సుస్థిరాభివృద్ధి, శాంతియుత సహజీవనానికి వైజ్ఞానిక శాస్త్రం విప్లవాత్మక భూమికను నిర్వహిస్తున్నది. ఇలాంటి విషయాలన్నింటినీ గమనిస్తున్న యునెస్కో 2002 నుంచి ప్రతి ఏట నవంబరు 10న శాంతి, అభివృద్ధికి ప్రపంచ వైజ్ఞానిక దినాన్ని పాటిస్తున్నది. సుస్థిరాభివృద్ధికి అంతర్జాతీయ వైద్యానిక శాస్త్ర దశాబ్దం 2024-33 సమన్వయంతో శాంతి, అభివృద్ధికి ప్రపంచ వైజ్ఞానిక దినం వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా యువత, వైజ్ఞానికేతర సమూహాలను ఏకం చేస్తూ డిజిటల్ ప్రపంచపు సైన్స్ పాత్రను వివరిస్తున్నారు.

శాంతి, అభివృద్ధికి ప్రపంచ వైజ్ఞానిక దినం-2024 థీమ్‌గా "వైజ్ఞానిక శాస్త్రం ఎందుకు ముఖ్యం - మనసు నిమగ్నంతో శక్తివంతమైన భవిష్యత్తు (వై సైన్స్ మ్యాటర్స్ - ఎంగేజింగ్ మైండ్స్ అండ్ ఎంపవరింగ్ ఫ్యూచర్)" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం కొనసాగుతున్నది. సుస్థిర సమాజ స్థాపనలో సైన్స్‌తో పాటు సైంటిస్టుల భూమికను కూడా సామాన్య జనాలకు అవగాహన కల్పించడం, సైన్స్ అందిస్తున్న అద్భుత ఫలితాలతో మానవజాతి శాంతియుతంగా, సమగ్రాభివృద్ధి దిశగా దినదినం వడివడిగా అడుగులు వేస్తున్నది. మన జీవితాల్లో ఆర్థిక, సామాజిక, పర్యావరణ మార్పులకు పునాదిగా సైన్స్ ఆవిష్కరణలు నిలుస్తున్నాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రధాన భూమికను వైజ్ఞానిక శాస్త్రమే నిర్వహిస్తూ, మన ఉజ్వల శాంతియుత భవితకు ఊతం ఇస్తున్నది.

శాంతి, అభివృద్ధికి ప్రపంచ సైన్స్ దినం వేదికగా ప్రజల్లో సైన్స్‌పై అవగాహన కల్పించడం, ప్రపంచ మానవాళిని ఏకం చేయడం, ప్రపంచ శాంతికి ఆజ్యం పోయడం, సమాజోన్నతికి సైన్స్‌ను వినియోగించడం, శాస్త్ర పరిశోధనలను కొనసాగించాల్సిన అవసరాన్ని చర్చించడం, సైన్స్ అందిస్తున్న ఫలాలతో మన దైనందిన జీవితాల్లో వచ్చిన మార్పులను వివరించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలి. వైజ్ఞానికశాస్త్ర కత్తికి రెండు వైపుల పదును ఉంటుందని గమనిస్తూ సైన్స్ అండ్ టెక్నాలజీ దుర్వినియోగాల నష్టాలను క్షుణ్ణంగా వివరించడం కూడా జరగాలి. స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయివరకు సైన్స్ ఆవిష్కరణలతో వచ్చిన సాంకేతికతను వ్యక్తులు, సంస్థలు, విద్యాలయాలు వివరించడం నిరంతరం కొనసాగాలి.

తమలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకునే సందర్భంగా ఈ వేదికలను వినియోగించుకోవడం, సైన్స్ అండ్ టెక్నాలజీలను మానవాభివృద్ధికి, సవాళ్లను అధిగమించే దిశగా సమర్థవంతంగా వాడుకోవడం, సైంటిస్టులను గౌరవించడం, సైన్స్ అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేయడం మన కనీస బాధ్యతగా తీసుకోవాలి.

సెల్: 9949700037

మోదీ పరువు తీస్తున్న సోషల్ మీడియా భక్తులు !

ఎం కోటేశ్వరరావు

ఫేక్ న్యూస్, కృత్రిమ మేధతో, నకిలీ ఫొటోలతో సామాజిక మాధ్యమంలో జరిపే ప్రచారంలో మనదేశం ఎంతో ముందుంది. నకిలీ వార్తల ముప్పు ఎక్కువగా ఉన్న దేశాలలో మనం ప్రథమ స్థానంలో ఉన్నట్లు గతంలో ప్రపంచ ఆర్థికవేదిక నివేదిక హెచ్చరించింది. గడచిన పది సంవత్సరాలలో ఈ ప్రచారదాడికి గురికాని వాట్సాప్ ఉన్న ఫోన్ బాధితులు లేరంటే అతిశయోక్తి కాదు. అది నరేంద్రమోదీ, జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ, మతం, విద్వేషం, తప్పుడు సమాచారం, వక్రీకరణ ఇలా వివిధ రూపాల్లో ఉంటుంది. కొన్ని సంవత్సరాల క్రితం ఫలానా కంపెనీ లేదా వ్యక్తి దివాలా కారణంగా తమ దగ్గర మిగిలిపోయిన వస్త్రాలను కారుచౌకగా విక్రయించి సొమ్ము చేసుకోవాలనుకుంటున్నారు అంటూ పత్రికల్లో ప్రకటనలు వచ్చేవి. నాసిరకం సరుకు అంటగట్టి దుకాణం ఎత్తివేసేవారు. ఈ వార్త ఏ ప్రధాన పత్రికల్లో, టీవీల్లో రాదు అంటూ తప్పుడు సమాచారాన్ని వాట్సాప్‌లో ఉచితంగా అందించే సామాజికసేవకులను మనం చూస్తున్నాం. అలాంటిదే ఇప్పుడు ఒక ఫొటో, దాని కింద సమాచారం ఒకటి తిరుగుతోంది.

ఎక్కడైతే ఘర్షణ జరిగిందో అక్కడే నాలుగు సంవత్సరాల తరువాత తొలిసారిగా దీపావళి రోజు భారత్-చైనా సైనికులు పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు. ఇలాంటి దృశ్యం మరోసారి చూడాలని కోరుకుంటున్నవారికి సంతోషం, ఘర్షణ కొనసాగాలని చూసిన వారికి విషాదం కలిగించింది. సంవత్సరాలపాటు సాగిన చర్చల అనంతరం అక్టోబరు మూడవవారంలో ఉభయ దేశాల ప్రతినిధులు సరిహద్దుల్లో ఉద్రిక్తతలను సడలించి సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు ఒక ఒప్పందానికి వచ్చారు. దాన్ని రష్యాలోని కజాన్ నగరంలో జరిగిన బ్రిక్స్ సమావేశాల సందర్భంగా అక్టోబరు 23న మన ప్రధాని నరేంద్రమోదీ-చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వంలో ఉభయదేశాల ప్రతినిధి బృందాలు సమావేశమై తుదిరూపమిచ్చాయి. ఒక క్రమపద్ధతిలో గాల్వన్ లోయ ఉదంతాలకు ముందున్న పరిస్థితిని పునరుద్ధరించేందుకు అంగీకరించారు, ఆ మేరకు అక్టోబరు చివరివారంలో సైనిక దళాల ఉపసంహరణ కూడా జరిగింది. ఈ తరుణంలో చైనా వ్యతిరేక మోదీ అనుకూల సోషల్ మీడియా మరుగుజ్జులు రంగంలోకి దిగారు.

చైనా దేశ మాప్ నేపథ్యంలో నరేంద్రమోదీ ఒక సింహాసనం లాంటి కుర్చీలో ఠీవీగా కూర్చొని ఉంటే జిన్‌పింగ్ మోకాళ్ల మీద కూర్చుని భూమిని అప్పగిస్తున్నదానికి చిహ్నంగా చెట్లు ఉన్న ఒక పచ్చని పళ్లెంలాంటి దాన్ని సమర్పించుకుంటున్నట్లు తయారు చేసిన నకిలీ కృత్రిమ చిత్రాన్ని సోషల్ మీడియాలో వదిలారు. దాన్ని చైనా సోషల్ మీడియాలో వైరల్ చేశారని, అడ్డుకునేందుకు అక్కడి ప్రభుత్వం సెన్సార్ చేసిందని, షేర్ చేస్తున్న వారి మీద కఠిన చర్యలకు దిగుతున్నట్లు సమాచారం వచ్చిందని రాశారు. తప్పుడు సమాచార వ్యాప్తిలో ఇదొక కొత్త టెక్నిక్, అబ్బే మనకేం సంబంధం లేదు చైనాలోనే అలాంటిది జరిగినట్లు నమ్మించే అతి తెలివి తప్ప మరొకటి కాదు. తప్పుడు చిత్రాలు, సమాచారాన్ని ప్రచారం చేసేవారు ఎక్కడో ఒక దగ్గర దొరికిపోతారు. చైనా ఆక్రమించుకున్న 90వేల చదరపు మీటర్ల ప్రాంతాన్ని (22,23ఎకరాలు) తిరిగి మనదేశానికి అందచేసినట్లు రాశారు. నిజానికి రెండు దేశాలమధ్య వివాదం ఉన్న స్థల విస్తీర్ణం 90వేల చదరపు మీటర్లు కాదు కిలోమీటర్లు. ఆ ప్రాంతాన్ని నిజంగా చైనా అప్పగిస్తే అది ప్రపంచ వార్తగా మారి ఉండేది. సరిహద్దుల్లో గతంలో మాదిరి ఎవరి ప్రాంతాల్లో వారు ఉండటం గురించి, గస్తీమీద ఒక ఒప్పందానికి వచ్చారు తప్ప ఒక్క గజం స్థలం కూడా మార్పిడి జరగలేదు, అసలు దాని మీద చర్చలే జరగలేదు. అది మాది అంటే మాది అని మన ప్రభుత్వం, చైనా సర్కార్ ఎప్పటి నుంచో పరస్పరం వాదించుకుంటున్నాయి. మన ఆధీనంలో 84వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న అరుణాచల్ ప్రదేశ్ తమదని, టిబెట్ దక్షిణ ప్రాంతమని చైనా చెబుతుంటే వారి ఆధీనంలో ఉన్న అక్సాయ్ చిన్ ప్రాంతం 90వేల చదరపు కిలోమీటర్లు మనదని అంటున్న అంశం తెలిసిందే. రెండు దేశాల మధ్య వివాదం కథ అదే. అసలేమీ జరగనిదాన్ని చైనా సోషల్ మీడియాలో ఎలా ప్రచారం చేస్తారు. అక్కడ మన మాదిరి దేన్నిబడితే దాన్ని జనం మీదకు వదలటానికి గూగుల్, యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్‌లు లేవు. వాటి మీద నిషేధం ఉంది. అవెక్కడా కనిపించవు. చైనా సర్కార్ అధికారికంగా నిర్వహించే బైదువంటి సామాజిక మాధ్యమ వేదికలు ఉన్నాయి. నిజంగా ఎవరైనా అలాంటి పిచ్చి పోస్టు వాటిలో పెడితే వెంటనే తొలగించే సాంకేతిక నైపుణ్యం చైనా దగ్గర ఉంది. అందువలన అలాంటి వాటిని వైరల్ చేసే అవకాశం అక్కడ లేదు. అలాంటి చిత్రాల గురించి నిజానిజాలు తేల్చేందుకు చూసిన వారికి మన సోషల్ మీడియాలో తిరుగుతున్న ఒక కృత్రిమ చిత్రంగా తేలింది తప్ప చైనాలో తయారైందిగా కనిపించలేదు. ఒకవేళ ఎవరికైనా అలాంటి సమాచారం ఉంటే ఆధారాలతో వెల్లడించవచ్చు. ఆ చిత్రం తీరుతెన్నులను చూస్తే నరేంద్రమోదీ గొప్పతనాన్ని కృత్రిమంగా పెంచేందుకు చూస్తున్న కిరాయిబాపతు సృష్టి తప్ప మరొకటి కాదు అన్నది స్పష్టం. వారికి అదొక తుత్తి (తృప్తి), చౌకబారుతనం తప్ప మరొకటికాదు. నిజంగా అలాంటి వాటిని పదే పదే ప్రచారంచేస్తే నిజం చెప్పినా ఒకనాటికి మోదీ భక్తులు కూడా నమ్మని స్థితి ఏర్పడుతుంది. పరాయి దేశాల్లో అపహాస్యం పాలౌతారు.

మన ఆధీనంలో 84వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న అరుణాచల్ ప్రదేశ్ తమదని, టిబెట్ దక్షిణ ప్రాంతమని చైనా చెబుతుంటే వారి ఆధీనంలో ఉన్న అక్సాయ్ చిన్ ప్రాంతం 90వేల చదరపు కిలోమీటర్లు మనదని అంటున్న అంశం తెలిసిందే. రెండు దేశాల మధ్య వివాదం కథ అదే. అసలేమీ జరగనిదాన్ని చైనా సోషల్ మీడియాలో ఎలా ప్రచారం చేస్తారు. అక్కడ మన మాదిరి దేన్నిబడితే దాన్ని జనం మీదకు వదలటానికి గూగుల్, యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్‌లు లేవు. వాటి మీద నిషేధం ఉంది. అవెక్కడా కనిపించవు. చైనా సర్కార్ అధికారికంగా నిర్వహించే బైదు వంటి సామాజిక మాధ్యమ వేదికలు ఉన్నాయి.

2020లో గాల్వన్‌లోయ సరిహద్దులో రెండు దేశాలమధ్య జరిగిన ఘర్షణ ఆసియా రాజకీయాల్లో భూకంపం అని కొందరు వర్ణించారు. ముఖ్యంగా అమెరికా మీడియా మాటలను చూస్తే భారత్-చైనాల మధ్య మరో యుద్ధమే తరువాయి అన్నట్లుగా భ్రమపడిన వారున్నారు. ఇంకే ముంది మన చేతికి మట్టి అంటకుండా చైనాను నిరోధించే బాధ్యత నరేంద్రమోదీ నెత్తిన పెట్టవచ్చనుకున్నారు అమెరికన్లు. సరిహద్దులో లక్షల సైన్యం కొనసాగితే మరింతగా సొమ్ము చేసుకోవచ్చని అమెరికా, ఇతర ఐరోపా దేశాల ఆయుధ కంపెనీలు మన గురించి ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. చైనా నుంచి గత నాలుగేండ్లుగా రికార్డు స్థాయిలో దిగుమతులు చేసుకోవటమే కాదు, నిషేధించిన పెట్టుబడులను కూడా పొందేందుకు మోదీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పుడు కుదిరిన సయోధ్య చైనా వ్యతిరేకులకు పిడుగుపాటుగా ఉంది. తమ ఎన్నికలకు పక్షం రోజుల ముందు కుదిరిన ఈ అవగాహనను అమెరికన్లు ఊహించినప్పటికీ పరిస్థితి తమ చేతుల్లో లేదన్న ఉక్రోషంతో ఉన్నారు. మనదేశంలోని కొన్ని శక్తులకు మింగుడు పడకపోయినా కార్పొరేట్ల వత్తిడి కారణంగా లోలోపల ఉడుక్కుంటున్నారు.

వైజ్ఞానిక స్వాప్నికుడు, తొలి ప్రధాని నెహ్రూ

డాక్టర్ దేవరాజు మహారాజు

వైజ్ఞానిక రంగంలో మన దేశం ఈరోజు ప్రపంచంలో తలెత్తుకుని ఉందంటే అందుకు కారణం మన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూయే. ఆయన వైజ్ఞానిక స్వాప్నికుడు, నిరీశ్వరవాది , హేతువాది, దార్శనికుడు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాల్ని త్యాగం చేసిన త్యాగులు ఆ కాలంలో ఎంత మందో ఉన్నారు. కాని, ఎవరికీలేని వైజ్ఞానిక దృక్పథం, పట్టుదల, కార్యదీక్ష ఉన్నందువల్లనే జవహర్‌లాల్ నెహ్రూ ఈ దేశానికి తొలి ప్రధాని- దేశ నిర్మాత కాగలిగారు. గాంధీజీని 'జాతిపిత' అని దేశం గుర్తుంచుకుంది. అలాగే జాతి నిర్మాతగా నెహ్రూని గౌరవించుకుంది. బ్రిటీష్ వారు ఇండియాను వదిలి వెళ్లిన తర్వాత, ఈ దేశ పరిస్థితి ఎలా ఉంది? రెండువందల ఏళ్ల నివాసముండి, ఇల్లు ఖాళీచేసి పోయినట్లుగా అస్తవ్యస్తంగా, చిందరవందరగా, అస్థిరంగా ఉంది. అన్నీ చక్కదిద్దుకుంటూ, చాకచక్యంగా అన్ని రంగాల్ని సంఘటితపరుస్తూ దేశాన్ని పునర్నిర్మించారు నెహ్రూ. దేశం నిండా చిన్న చిన్న సంస్థానాలు రాజ్యమేలుతున్నప్పుడు అందరినీ ఒక్కతాటిపైకి తెచ్చి విశాల భారతానికి రూపకల్పన చేశారు. సంస్థానాల్ని విలీనం చేసుకున్న ఘనత అంతా వల్లభ్‌భాయ్‌పటేల్‌ని ఇప్పటి ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తూ ఉంది. ఇంగితజ్ఞానంతో ఆలోచిస్తే విషయం అర్థమవుతుంది. పటేల్‌ను మనం ఏ మాత్రం తక్కువచేసి మాట్లాడాల్సిన అవసరంలేదు గానీ, ఆయన నెహ్రూ ప్రభుత్వంలోని హోంమినిస్టర్ మాత్రమే! ప్రధానికి తెలియకుండా హోం మంత్రి నిర్ణయాలు తీసుకోడు. వాటిని అమలు చేయలేడు. పండిట్ నెహ్రూ అనుమతి, అంగీకారం లేకుండానే పటేల్ దేశ సమైక్యతకు కృషి చేశారనడం అర్ధ సత్యం. అలాగే కశ్మీర్ విషయంలో నెహ్రూ తప్పు చేశారనడం అర్ధ సత్యం. అలాగే కశ్మీర్ విషయంలో తప్పు చేశారని నేటి ప్రభుత్వ పెద్దలు డప్పుకొట్టడమూ సత్యమే. నిజంగా అది తప్పయితే నాటి హోంమంత్రి పటేల్ బాధ్యత కూడా అందులో ప్రధానంగా ఉంటుంది.

రాజకీయాలు పక్కన పెట్టి, నెహ్రూజీ ఎందుకు దార్శనికుడయ్యారో చూద్దాం. ముందు చూపుతో ఈ దేశానికి కావల్సినవన్నీ కూర్చి వాటిని పటిష్టపరచడానికి నిరంతరం కృషి చేసిన వాడాయన. ఆయన దేశ ప్రధానిగా ఉన్న పదిహేడేళ్ల కాలంలో భారతదేశ 'ఆధునిక దేవాలయాలు' అనదగిన ఎన్నో ప్రాజెక్టులు పూర్తి చేశారు. ఆయన కాలంలోనే అవన్నీ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పండిట్ నెహ్రూ వైజ్ఞానిక స్పృహ గల ప్రధాని గనుక, దేశ ప్రజలకు విద్య అవసరమని, మరీ ముఖ్యంగా వైజ్ఞానిక విద్య-పరిశోధన చాలా అవసరం అని గుర్తించారు. ఆయన తీసుకున్న చొరవ వల్లనే దేశమంతటా శాస్త్ర పరిశోధనాశాలలు విస్తృతంగా అభివృద్ధి అయ్యాయి. ఇప్పుడు దేశంలో ఉన్న ప్రముఖ వైజ్ఞానిక సంస్థను దేన్ని తీసుకున్నా, దాని నేపథ్యంలో నెహ్రూయే కనిపిస్తారు.

ఉదాహరణకు ప్రస్తుతం విజయ దుందుభి మోగిస్తున్న ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఆర్ఒ), బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బిఎఆర్‌సి), కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సి), నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జిఆర్ఐ), ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమీ ఏరిడ్ ట్రాపిక్స్ (ఎసిఆర్ఐఎస్ఎటి), టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ పండమెంటల్ రీసెర్చ్ (టిఐఎఫ్ఆర్), వంటి ముఖ్యమైన పరిశోధనా కేంద్రాలన్నింటికీ రూపకల్పన చేసి, ప్రారంభించింది. అవి సజావుగా నడవడానికి స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని ముఖ్యంగా ఆర్థిక వనరుల్ని సమకూర్చింది మన తొలి ప్రధాని నెహ్రూజీయే. అంతేకాదు, రక్షణశాఖకు సంబంధించిన ఎన్నో పరిశోధనా కేంద్రాలకు నెహ్రూ ఊతమిచ్చారు. డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లాబొరేటరీ (డిఇఆర్ఎల్), డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్) వంటివి మరెన్నో ఉన్నాయి. స్వాతంత్ర్యం లభించిన తొలినాళ్లలో భారతదేశ పరిస్థితి తుపానులో కొట్టుకొచ్చిన మొక్కలాంటిది. దాన్ని నిలకడగా ఉంచి, నారు-నీరు పోసి, వేళ్ల భూమిలో నాటుకునేట్టు చేసి, నిటారుగా నిలబెట్టడం ఆషామాషీకాదు. ఎంతో అంకిత భావం కావాలి. పరాయిపాలనలో అస్తిత్వాన్ని కోల్పోయిన ఈ దేశం సర్వ స్వతంత్రంగా నిలదొక్కుకోవడానికి, ఎదిగి మహావృక్షమై విస్తరించడానికి తొలినాళ్లలో నెహ్రూ చేసిన ప్రయత్నం అసామాన్యం. ఆయనలోని వైజ్ఞానిక దృక్పథం, లలితకళల పట్ల గల మక్కువ, పిల్లలంటే ఉండే ప్రేమ ఆయనతో ఎన్నో పనులు చేయించింది. సాహిత్య. సాంస్కృతిక అకాడెమీలు, బాలల అకాడెమీ వంటి ఇతర జాతీయ సంస్థలన్నింటినీ ప్రారంభించి, నిలబెట్టింది నెహ్రూజీనే. అర్ధ శతాబ్దానికి పైగా నిరంతరం పరిశోధనలకు అంకితమైన ఈ జాతీయ పరిశోధనా సంస్థలకు ప్రస్తుత కేంద్రప్రభుత్వం ప్రతి యేటా కేటాయించే నిధులే ఇవ్వలేకపోతే ఉంది. ఇది నేటి దుస్థితి! పైగా ప్రయివేటు సంస్థల నుంచి, వ్యక్తుల నుంచి ఆర్థిక వనరులు సంపాదించుకోవాలని సూచిస్తోంది. ఎందుకంటే ఈ ప్రభుత్వానికి యోగ సాధువులు, బాబాలు తప్ప వైజ్ఞానికులు కనబడడం లేదు. నెహ్రూజీకి ఉన్న వైజ్ఞానిక దృక్పథం ఆరెస్సెస్‌కు, దాని అనుబంధ సంస్థలకు నచ్చదు. అందుకే ఆయనను, ఆయన కృషిని తక్కువచేసి మాట్లాడుతే ఉంటుంది. వెనక్కి నడిచేవాడికి ముందుకు పోయేవాడు నచ్చడు కదా?

భాక్రానంగల్, సట్లేజ్, హీరాకుడ్, మహానది, నాగార్జునసాగర్ వంటి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణాలన్నీ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడే అయ్యాయి. గంగ, యమున, కావేరి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, కృష్ణానదులపై ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది ఆయన హయాంలోనే. వాటివల్ల దేశంలో హరిత విప్లవం సాధ్యమైంది. తాగునీరు దొరికింది. సామాన్యుల జీవన ప్రమాణాలు పెరిగాయి. వ్యవసాయం రంగమే కాదు, పారిశ్రామిక రంగంలోనూ నెహ్రూ నేతృత్వంలో ఈ దేశం గణనీయమైన ప్రగతిని సాధించింది. బొకారో, జంషెడ్‌పూర్, రూర్కేలా, హిందుస్థాన్ జింక్, వంటి ఉక్కు పరిశ్రమలు నెల్కో (ఎన్ఎఎల్‌సిఒ) వంటి అల్యూమినియం పరిశ్రమలు, ఓ.యన్.జి.సి వంటి చమురు కేంద్రాలు, దేశ వ్యాప్తంగా ఎన్నో ఓడరేవులు నెహ్రూ చొరవతో నిర్మాణమై దేశాన్ని అన్ని విధాలా నిలబెట్టాయి. దేశ అవసరాలను పూర్తి చేయడమే కాకుండా ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతిచేసే దశకు చేరుకున్నాయి. వైద్యానికి, ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులు దేశంలోనే తయారుకావాలన్నది ఆయన ఆశయం. దాన్నే ఆయన సాధించారు కూడా!

దేశానికి ఊపిరులూదిన పండిట్ నెహ్రూ కృషిని తక్కువచేసి మాట్లాడేవారు చారిత్రక సత్యాలు తెలుసుకుంటే మంచిది. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలో ప్రతిపక్షంలో మహానుభావులెంతోమంది ఉండేవారు. ఎన్నో విమర్శలు చేసేవారు. అవి పనికొచ్చేవయితే ఆయన తప్పకుండా ఆలోచించేవారు. కార్టూనిస్ట్ శంకర్‌ను దగ్గరకు పిల్చుకుని "శంకర్ నువ్వు స్వేచ్ఛగా, సహేతుకంగా విమర్శించు. అధికారంలో ఉన్న మా అహంకారాన్ని ఎప్పటికప్పుడు వదిలిస్తూ ఉండు" - అని సలహా ఇచ్చారు. అలాంటి సంక్షేమం మరి ఇప్పటి నాయకులకు ఎందుకు లేదూ? నర్మదానది పరీవాహక ప్రాంతంలో డెబ్బయి రెండు గ్రామాల్ని ఊడ్చేసి, వేల మంది నిర్వాసితుల్ని పట్టించుకోకుండా ఎత్తయిన పటేల్ విగ్రహం స్థాపించినంత మాత్రాన, అది ఈ దేశంలో తొలి ప్రధాని స్థానాన్ని తగ్గించగలదా? ఎవరెన్ని చెప్పినా పటేల్ నెహ్రూ దగ్గర పనిచేసిన హోం మినిస్టర్ మాత్రమే! దార్శనికునిగా, వైజ్ఞానిక ద్రష్టగా పటేల్‌ను ఎవరూ గుర్తుపెట్టుకోలేదు. అయినా ప్రజలు ప్రేమతో, గౌరవంతో తాము ఏర్పాటు చేసుకున్న విగ్రహాల ఎత్తు ముందు, జనాన్ని హింసించి, ప్రభుత్వాలు నెలకొల్పే విగ్రహాల ఎత్తెంత? ఆలోచిస్తే విషయం చాలా లోతైంది! స్వాతంత్ర్య సమరంలో తలమునకలై ఉన్న నెహ్రూకు కూతురు ఇందిరను పెంచడం చాలా కష్టమైంది. ఎందుకంటే ఆయన భార్య కమల యవ్వన దశలోనే కన్నుమూశారు. జైలు నుంచి ఆయన కూతురికి ఉత్తరాలు రాశారు. అందులో దేశ భూ, భౌతిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల గూర్చి అనేక విషయాలు రాశారు. ఆ ఉత్తరాలే 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' గా- పుస్తకం వెలువడింది. దాని ఆధారంగా చిత్ర దర్శకుడు శ్యాం బెనగల్ టీవీ సీరియల్ తీశారు. పిల్లల పట్ల ఆయనకు గల ప్రత్యేకమైన శ్రద్ధ, ప్రేమల వల్ల ఎన్నో సంస్థలకు, ప్రాజెక్టులకు ఆయన రూపుదిద్దారు. చాచానెహ్రూగా శాశ్వతత్వం పొందారు. పిల్లలు పెద్దవాళ్లవుతారు. ముసలివాళ్లు కూడా అవుతారు. తరాలు మారినా పండిట్ నెహ్రూను మాత్రం చాచానెహ్రూగానే పిలుస్తున్నారు. ఆయన పుట్టినరోజు 14 నవంబర్‌ను పిల్లల దినంగా జరుపుకుంటున్నాం.

సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్

పట్టాలు తప్పిన సికింద్రాబాద్-షాలీమార్ ఎక్స్‌ప్రెస్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లాకు 20 కిలోమీటర్ల దూరంలోని నల్పూల్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో సికింద్రాబాద్ - షాలీమార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఘోరప్రమాదం తప్పింది. నల్పూల్ రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున 5.31 గంటలకు ఈ రైలు మూడు బోగీలు పట్టాలు తప్పాయి. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది హుటాహుటినా సంఘటన స్థలంకు చేరుకుని ప్రయాణికులను సమీప స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగపోవడంతో ప్రయాణికులతోపాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ మరమ్మత్తు పనులు వేగవంతం చేపట్టారు. ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ప్రమాదంపై సౌత్ ఈస్టర్న్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఓం ప్రకాశ్ చరణ్ స్పందించారు. నల్పూర్ స్టేషన్ సమీపంలో సికింద్రాబాద్ -శాలీమార్ (22850) వీక్లీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పినట్లు వెల్లడించారు. మిడిల్ లైన్ నుంచి డౌన్ లైన్‌కు మారుతున్న సమయంలో ఒక పార్శిల్ వ్యాన్, రెండు ప్యాసింజర్ కోచ్‌లు పట్టాలు తప్పాయని చెప్పారు. ఎవరికి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. ప్రయాణికులను సమీప స్టేషన్‌కు తరలించేందుకు 10 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ట్రాక్ పునరుద్ధరించే పనిలో రైల్వే సిబ్బంది నిమగ్నమైనట్లు చరణ్ చెప్పారు. రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలపై దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు.

రైలు బోగీల మధ్య నలిగి కార్మికుడి దుర్మరణం

పాట్నా: బీహార్‌లో . రైలు బోగీల మధ్య నలిగి ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన బెగుస రాయ్‌లోని బరౌని జంక్షన్ లో శనివారం చోటు చేసు కుంది. రైల్వే వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. సోన్‌పూర్ రైల్వే డివిజన్ పరిధిలోని స్టేషన్‌లో పని చేస్తున్న అమర్ కుమార్ రావు శనివారం ప్లాట్‌ఫామ్ 5పై విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆ సమయంలో లక్నో-బరౌనీ ఎక్స్‌ప్రెస్ రాగా... రైలు కప్లింగ్‌లను తెరిచేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో రైలు అనూహ్యంగా రివర్స్ రావడంతో రెండు కోచ్‌ల మధ్య అతను ఇరుక్కుపోయాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటన అనంతరం రైలు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై రైల్వే అధికారులు విచారణ ప్రారంభించారు.

రెండు రోజుల్లో అల్పపీడనం

చెన్నై: బంగాళాఖాతంలో రెండు రోజుల్లో అల్ప పీడనం ఏర్పడనుందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ఈ అల్ప పీడనం వాయుగుండంగా మారే అవకాశాలుండటంతో తమిళనాడులో అనేకచోట్ల చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 11, 13 తేదీల్లో రాజధాని నగరం చెన్నైలో చాలాచోట్ల కుండపోత వర్షం కురిసే అవకాశముందని తెలిపారు. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్ప పీడనం రెండరోజుల్లో పడమటి దిశగా శ్రీలంక తీరం వైపు నెమ్మదిగా కదులుతుందని తెలిపారు. ఈశాన్య అరేబియా సముద్రం పరిసర ప్రాంతాల్లో లక్షద్వీపాల్లో ఉపరితల ఆవర్తనం నెలకొనడటంతో కన్యాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ నెల 10న కడలూరు, మైలాడుదురై, నాగపట్నం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు.

పేదలను దోచేలా పన్ను వ్యవస్థ

కేంద్రంపై రాహుల్ విమర్శ

రాంచీ : కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శనివారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విరుచుకుపడ్డారు. 'పేదలను దోచుకునేలా' దేశంలో పన్ను వ్యవస్థ ఉందని అన్నారు. 'భారత పన్ను వ్యవస్థ పేద ప్రజలను దోచుకుంటోంది. అదానీ కూడా మీకు సమానంగానే పన్నులు చెల్లిస్తున్నాడు. అతనికి రూ.11 లక్షల కోట్ల విలువైన ధారావి భూమిని దారాదత్తం చేశారు' అని జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఒక ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ విమర్శలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కూడా ఆయన ధ్వజమెత్తారు. 'ప్రధాని మోదీ సీ ప్లేన్‌లో ప్రయాణిస్తారు. సముద్రం లోపలికి వెళతారు. కానీ ధరల పెరుగుదలతో పేదలు, మహిళల జీవనం అత్యంత ఇబ్బందికరంగా మారింది' అని అన్నారు. షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు), షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), ఇతర వెనుకబడిన వర్గాలు (ఓబీసీలు) దేశ జనాభాలో 90 శాతంగా ఉన్నారు. కానీ వారికి ప్రభుత్వ సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించలేదని ధ్వజమెత్తారు. 'ప్రధాని మోదీ మాఫీ చేసిన పెట్టుబడిదారుల రుణాలకు సమానమైన నిధులను పేదలకు పంపిణీ చేస్తాం' అని రాహుల్ చెప్పారు.

సీఎం పీఏ ఇంట్లో ఐటీ తనిఖీలు

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సహాయకుడు (పీఏ) సునీల్ శ్రీవాత్సవ ఇంట్లో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. రాంచీ, జంషెడ్‌పూర్‌లో ఈ తనిఖీలు జరిగాయి. తొమ్మిది చోట్ల సోదాలు జరిగినట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఈ నెల 13, 20 తేదీల్లో రెండు దశల్లో జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమికి... బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు మధ్య రాజకీయంగా వాడివేడి వాతావరణం నెలకొంది. ఈ తరుణంలో సీఎం సన్నిహితుడి ఇంట్లో సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా... భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొద్దినెలల క్రితం సోరెన్ జైలు జీవితం గడిపిన సంగతి తెలిసిందే. జైలుకు వెళ్లడానికి ముందు ఆయన సీఎం పదవికి రాజీనామా చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత మళ్లీ ఆ బాధ్యతలు స్వీకరించారు. మరోసారి అధికారాన్ని దక్కించుకునేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఉద్ధవ్ పొమ్మన్నాడు.... షిండే రమ్మన్నాడు

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మరో పది రోజుల సమయం మాత్రమే ఉన్నప్పటికీ నాయకులు పార్టీలు మారుతునే ఉన్నారు. పార్టీకి ప్రతికూలంగా వ్యవహరిస్తున్నాడన్న కారణంగా శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఇటీవల రూపేశ్ మాత్రే అనే నాయకుడిపై బహిష్కరణ వేటు వేశారు. దాంతో ఆయన ఇప్పుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేనలో చేరారు. ఏక్‌నాథ్ షిండే ఆయనకు స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, మహారాష్ట్రలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఈ నెల 20న పోలింగ్ జరగనుంది. ఈ నెల 23న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రధాన పోటీ అధికార మహాయుతిలోని మూడు పార్టీలకు, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీలోని మూడు పార్టీల మధ్యనే జరగనుంది.

ఢిల్లీలో కాల్పులు... ఒకరి మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ఒక వ్యక్తి మృతిచెందగా... మరో ఇద్దరు గాయపడ్డారు. నిందితులైన ముగ్గురు యువకులు మరో చోట కూడా ఒక వ్యక్తి ఇంటి వద్ద కాల్పులు జరిపారు. చివరకు పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఈశాన్య ఢిల్లీలోని కబీర్ నగర్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి స్కూటర్‌పై ఇంటికి తిరిగి వస్తున్న నదీమ్, అతడి ఇద్దరు స్నేహితులపై బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఏడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఆ తర్వాత నదీమ్ స్కూటర్, మొబైల్ ఫోన్ తీసుకుని పారిపోయారు. వారి బైక్‌ను అక్కడ వదిలేశారు. కాగా, ఈ కాల్పుల ఘటనలో నదీమ్ మృతిచెందగా... అతడి ఇద్దరు స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులైన ముగ్గురు మైనర్ బాలురను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితుల్లో ఒకరు నదీమ్ నుంచి అప్పు తీసుకున్నాడని, తిరిగి చెల్లించడంపై ఒత్తిడి చేయడంతో కాల్చి చంపారని వెల్లడించారు. మరోవైపు ఈ ముగ్గురు యువకులు అదే రాత్రి వేళ జ్యోతి నగర్‌లో కూడా కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు. రాహుల్ అనే వ్యక్తి ఇంటి బయట ఆరు రౌండ్లు కాల్పులు జరిపినట్లు చెప్పారు.

బీజేపీదంతా మోసమే

- కాంగ్రెస్ హామీలు కాపీ
- మా పార్టీది బలిదానాల చరిత్ర: ఖర్గే

బెంగళూరు/నాగపూర్: కాంగ్రెస్‌ది బలిదానాల చరిత్ర అని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. ఎన్నికల వేళ బీజేపీ 'జుమ్లా'ల పర్వాన్ని కొనసాగిస్తోందని, తమ పార్టీ ఇచ్చిన హామీలను కాపీ కొట్టి ఎన్నికల రాష్ట్రాల్లో ప్రకటనలు చేస్తోందని దుయ్యబట్టారు. బటేంగేతో కటేంగే అని యూపీ సీఎం యోగి, ఏక్ హయ్‌తో సేఫ్ హయ్ అని ప్రధాని మోదీ నినాదాలు ఇవ్వడాన్ని ఎద్దేవా చేశారు. ఈ రెండింటిలో బీజేపీ నేతలు దేనికి కట్టుబడతారో చెప్పాలని ఖర్గే అన్నారు. తమ పార్టీ 55 ఏళ్లలో చేసినదేమిటో చెప్పేందుకు సిద్ధమని... గత 11 ఏళ్లలో ఏం చేశారో చెప్పేం దుకు చర్చకు వస్తారా అని బీజేపీకి సవాల్ విసిరారు. ఖర్గే శనివారం కర్నాటక రాజధాని బెంగళూరు, మహా రాష్ట్రలోని నాగపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీపై, మోదీపై విమర్శలు గుప్పించారు. బటేంగేతో కటేంగే (విభజిస్తే చావే) అంటున్నది మీరు...విభజించేది మీరు... నిందలు వేరొకరిపైనా అంటూ ఖర్గే వ్యాఖ్యానించారు. దేశ ఐక్యతను కోరుకునేవారు ఇటువంటి విభజించే నినాదాలను సమర్థించరన్నారు. వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ నేతలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ ప్రతికి సంబంధించి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలు, రెడ్ బుక్ వివాదాన్ని దుయ్యబట్టారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కే ప్రధాని మోదీ ఎరుపు కవర్‌తో ఉన్న రాజ్యాంగాన్ని బహూకరించే చిత్రాన్ని విలేకరులకు చూపించారు. ఓట్ల కోసం ప్రజలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రెచ్చగొడుతు న్నాయని విభజిస్తే ప్రాణాలిస్తాం, ఐక్యంగా ఉంటే సురక్షితంగా ఉంటాం అన్న నినాదాలనుద్దేశించి ఖర్గే అన్నారు. కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ఆయన సమర్థించారు. ఇచ్చిన హామీలకు కట్టుబడి, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. కర్నాటక ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే బీజేపీ దుష్ప్రచారం సాగిస్తోంది కానీ దానిని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

'జార్ఖండ్, మహారాష్ట్రలో నేను వారికి (బీజేపీ) సమాధానాలు ఇచ్చా. ఇప్పుడు కూడా కర్నాటక రాష్ట్ర బడ్జెట్‌ను అధ్యయనం చేయాలని వారికి సూచిస్తున్నా. బడ్జెట్‌లో ఐదు హామీ పథకాల కోసం రూ.52వేల కోట్లు కేటాయించగా అందులో 47శాతం ఇప్పటికే ఖర్చు అయింది. బహుశ బడ్జెట్‌ను వారు చూసివుండరు' అని ఖర్గే అన్నారు. ఎన్నికల ప్రచారంలో హామీ పథకాలపై బీజేపీ నేతలు, మోదీ విమర్శలను తిప్పికొట్టారు. బడ్జెట్ కేటాయింపులు లేకుండానే బీజేపీ అనేక ప్రకటనలు చేసిందన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రకటించిన హామీ పథకాలను కాపీ కొట్టి మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ తదితర ఎన్నికల రాష్ట్రాల్లో ప్రకటనలు చేస్తోందని విమర్శించారు. బీజేపీ, మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తేవడం, పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15లక్షలు జమ చేయడం, రెండు కోట్ల ఉద్యోగాల సృష్టి, పంటలకు ఎంఎస్‌పీ పెంపుదల, బుల్లెట్ రైళ్లు తదితర హామీలనుద్దేశించి ఖర్గే అన్నారు. బీజేపీవన్నీ జుమ్లాలే.. ఎన్నికల్లో ప్రయోజనాల కోసం హామీలు తప్ప ప్రజా సంక్షేమం దానికి పట్టదని ఖర్గే వ్యాఖ్యానించారు. కర్నాటకలో వక్ఫ్ వివాదంపై ప్రశ్నకు జాయింట్ సెలక్ట్ కమిటీ నివేదిక పార్లమెంటుకు ఇచ్చిన తర్వాత దీనిపై మాట్లాడటం శ్రేయస్కరమని బదులిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఈవీఎంలపై సందేహాలకు సంబంధించిన ప్రశ్నకు 'చెప్పిందే చెప్పడం నాకు నచ్చదు. కపిల్ సిబల్, అభిషేక్ మను సంఘ్వీ వంటి నేతలతో కూడిన బృందం ఈవీఎంల కోసం పనిచేస్తోంది. అనేకమంది ఈ పనిలో నిమగ్నమయ్యారు. ఏం జరుగుతుందో చూద్దాం' అని ఖర్గే చెప్పారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతానికి చెందిన ఇద్దరు బడా నేతలు (నితిన్ గడ్కరీ, దేవేంద్ర ఫడ్నవీస్‌నుద్దేశించి) రెండు బృహత్ ప్రాజెక్టులను గుజరాత్‌కు మళ్లకుండా ఆపలేకపోయారని, తమ పదవులు కాపాడుకోవడం కోసం ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టేశారని విమర్శించారు. విదర్భలో ఎంవీయే గెలుపుపై దీమా వ్యక్తంచేశారు. మోదీ అబద్ధాలు చెబుతారు... వాటిని బిగ్గరగా చెబుతారంటూ రెడ్ బుక్, అర్బన్ నక్సల్స్ అంటూ బీజేపీ నేతలు, ప్రధాని చేసే వ్యాఖ్యలనుద్దేశించి ఖర్గే అన్నారు. 'నల్లధనం వెనక్కి తెస్తాం. ఉద్యోగాలిస్తాం. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తాం' అంటూ మోదీ అబద్ధాలు చెప్పలేదా అని ప్రశ్నించారు. మహారాష్ట్రను అభివృద్ధి పథంలో నడిపించేందుకు మంచి ప్రభుత్వం అవసరమని చెప్పారు. మహారాష్ట్రలో ఎంవీయే మెజారిటీ సాధిస్తుందని, తమను ప్రత్యర్థులు విభజించలేరని ఖర్గే అన్నారు. మహారాష్ట్రలో ఈనెల 20న ఎన్నికలు జరుగుతాయి.

ఆ రాష్ట్రాలన్నీ కాంగ్రెస్ ఏటీఎంలే!

ప్రధాని మోదీ

ముంబై : కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలన్నీ ఆ పార్టీ ఏటీఎంలేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ ఏర్పాటయితే ఆ రాష్ట్రం పార్టీ 'షాహీ పరివార్' కి ఏటీఎం (ఆటోమేటెడ్ టెల్లర్ మెషిన్) అవుతుందన్నారు. నవంబరు 20న జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం అకోలా, నాందేడ్‌లో జరిగిన ప్రచార ర్యాలీల్లో మోదీ ప్రసంగిస్తూ, మహారాష్ట్రను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చనివ్వబోమని తేల్చిచెప్పారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు కాంగ్రెస్ ఇంత అవినీతికి పాల్పడుతోందని, ఒక్కసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ ఎంత అవినీతికి పాల్పడుతుందో ఊహించుకోవచ్చునని ప్రధాని అన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ ఏర్పాటయితే ఆ రాష్ట్రాన్ని తమకు ఏటీఎంగా మార్చుకుంటుంది. మహావికాస్ అఘాడీ అంటే అవినీతి, కుంభకోణాలకు నెలవు. కర్నాటకలో మద్యం విక్రయదారుల నుంచి రూ.700 కోట్లు కొల్లగొట్టారు. ఎన్నికల్లో గెలిస్తే ఇంకెంత దోచుకుంటారో ఊహించండి' అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. మహాయుతి (మహారాష్ట్రలో పాలక కూటమి) మేనిఫెస్టో మహిళల భద్రత, ఉద్యోగ అవకాశాలు, లడ్కీ బహిన్ యోజన విస్తరణపై దృష్టి సారించిందని, అయితే కాంగ్రెస్, శివసేన (యూబీటీ), శరద్ పవార్ ఎన్‌సీపీతో కూడిన మహా వికాస్ అఘాడి 'ఘోటల పత్ర' (కుంభకోణాల లేఖ) తో వచ్చాయని ప్రధాని చెప్పారు. ఎంవీఏ అంటే అవినీతి, టోకెన్ మనీ, ట్రాన్స్‌ఫర్ పోస్టింగ్ వ్యాపారం అని దేశం మొత్తానికి తెలుసని అన్నారు. కాంగ్రెస్‌పై దాడి చేస్తూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 'పంచతీర్థం'ని ఎప్పుడైనా సందర్శించి ఉంటే నిరూపించడానికి పార్టీ షాహీ పరివార్‌కు ధైర్యం ఉందా అని అన్నారు. 'ఓబీసీలు, ఆదివాసీలు, దళితుల ఓట్లు చీలిపోయి మళ్లీ అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ భావిస్తోంది. కానీ ఎస్సీలు, ఎస్టీలు, దళితులు, ఆదివాసీల ఐక్యత కారణంగా ఏళ్ల తరబడి కాంగ్రెస్ తన మద్దతును కోల్పోతోంది' అని ప్రధాని అన్నారు. 'కులాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టడం, దళితులు, వెనుకబడిన వర్గాలు ఏకం కాకూడదనేది కాంగ్రెస్ గేమ్ ప్లాన్. హర్యానాలో జరిగిన అల్లర్లలో దళితులు హత్యకు గురయ్యారు. నేరస్తులకు కాంగ్రెస్ అండగా నిలిచింది' అని ఆరోపించారు. దేశం బలహీనపడితేనే కాంగ్రెస్ బలపడుతుందని కాంగ్రెస్‌కు తెలుసు అని అన్నారు. గత రెండు దఫాలుగా తమ ప్రభుత్వం నాలుగు కోట్ల మంది పేదలకు ఇళ్లు అందించగలిగిందని, మరో మూడు కోట్ల ఇళ్లు ఇక్కడే నిర్మిస్తామని మోదీ చెప్పారు.తాను మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక లక్షల కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు జరుగుతున్నాయని, మహారాష్ట్రలోని వధావన్ పోర్ట్ పూర్తయితే దేశంలోనే అతిపెద్దది అవుతుందని మోదీ అన్నారు. 'తక్కువ నీటితో పొలాలకు నీరందించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. మా నినాదం ప్రతి చుక్కకు ఎక్కువ పంట. రైతులు దేశాభివృద్ధిలో హీరోలుగా మారడానికి మేము సాధికారత కోరుకుంటున్నాం' అని తెలిపారు. మరాఠీకి శాస్త్రీయ భాషా హోదా కల్పించాలన్న డిమాండ్‌ను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు పట్టించుకోలేదని, దానిని నెరవేర్చడం అదృష్టమని మోదీ అన్నారు. '2019లో ఇదే రోజున దేశ అత్యున్నత న్యాయస్థానం రామ మందిరంపై తీర్పునిచ్చింది. ఈ నవంబరు 9వ తేదీ కూడా గుర్తుండిపోతుంది, ఎందుకంటే సుప్రీం కోర్టు తీర్పు తర్వాత, ప్రతి మతానికి చెందిన ప్రజలు గొప్ప సున్నితత్వాన్ని ప్రదర్శించారు' అని అన్నారు. 'దేశం మొదటిది అనే భావన భారతదేశానికి అతిపెద్ద బలం' అని తెలిపారు. గతంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో చేసిన తీర్మానానికి మద్దతు ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను ప్రధాని తప్పుపట్టారు. కాంగ్రెస్ వ్యక్తులు 'భారత రాజ్యాంగం' అని లేబుల్‌తో ఉన్న ఎర్రటి పుస్తకాన్ని లోపల ఖాళీ పేజీలతో చూపిస్తున్నారని అన్నారు. ఆర్టికల్ 370 పట్ల కాంగ్రెస్ ప్రజలకు ఎందుకు అంత ప్రేమ అని మోదీ ప్రశ్నించారు. నవంబరు 20న మహారాష్ట్ర ప్రజలు అభివృద్ధి, భద్రత, శాంతిని ఎంచుకుని రాష్ట్రానికి, దేశానికి దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని ఆయన అన్నారు. నవంబరు 23న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

కలిసొచ్చే పార్టీలతో పొత్తుకు టీవీకే సిద్ధం

చెన్నై: రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరుగనున్న ఎన్నికల్లో భావసారూప్యత కలిగిన పార్టీలతో చేతులు కలిపేందుకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) సిద్ధమైంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత విజయ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అగ్రనటుడిగా రాణిస్తున్న విజయ్ ప్రారంభించిన టీవీకే పార్టీ తొలి మహానాడు ఇటీవల విల్లుపురం జిల్లా విక్రవాండిలో జరిగిన సంగతి విదితమే. ఈ మహానాడులో రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలను విజయ్ తీవ్రంగా విమర్శించారు. దానికి ఈ రెండు పార్టీల నేతలు ఖండించారు. ఈ నేపథ్యంలో 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరగబోయే ఎన్నికలకు అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే సహా అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఎన్నికలకు 15 నెలల గడువున్నప్పటికీ, కూటమిపై దృష్టి సారించిన పార్టీలు ప్రజాదరణ పొందిన పార్టీలతో పొత్తు కుదుర్చుకొనే ప్రయత్నాల్లో దిగాయి. పార్టీ తొలి మహానాడులో ప్రసంగించిన విజయ్.. అసెంబ్లీ ఎన్నికల్లో తమ నాయకత్వాన్ని అంగీకరించే పార్టీలతో దోస్తీ కడతానని వెల్లడించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా అధికారంలో కూడా మిత్రపక్షాలకు భాగస్వామ్యం కల్పిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనతో విజయ్‌తో పొత్తు కుదుర్చుకొనేందుకు కొన్ని పార్టీలు నిర్ణయం తీసుకున్నప్పటికీ, దీనిపై బహిరంగ ప్రకటన చేయలేదు. కాగా, టీవీకే ఇతర పార్టీల నాయకత్వం కింద పనిచేసేందుకు ఇష్టపడదని, తమ సిద్ధాంతాలకు కట్టుబడి తమ నాయకత్వాన్ని అంగీకరించే పార్టీలతోనే విజయ్ పొత్తు కుదుర్చుకుంటారని టీవీకే సీనియర్లు చెబుతున్నారు.

పప్పుయాదవ్‌కు మరో బెదిరింపు

న్యూఢిల్లీ: బీహార్‌లోని పూర్ణియా స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్‌కును చంపేస్తామంటూ మరోసారి బెదిరింపులు వచ్చాయి. ఎంపీని చంపడానికి ఇప్పటికే ఆరుగురు వ్యక్తులను పురమాయించామని, ఇదిగో ఈ తుపాకీతోనే అంతమొందిస్తారంటూ బెదిరించారు. ఈమేరకు పప్పూ యాదవ్ పర్సనల్ సెక్రెటరీ మహమ్మద్ సిద్దిఖ్ ఆలమ్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తి వాట్సాప్ మెసేజ్ పంపించాడు. టర్కీలో తయారైన ఓ తుపాకీ ఫోటోను కూడా షేర్ చేశాడు. ఎంపీని దీనినితోనే చంపుతారని అందులో పేర్కొన్నాడు. దీంతో ఆయన ఢిల్లీలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నవంబర్ 7న ఉదయం 2.25 నుంచి 9.49 గంటల మధ్య ఈ మెసేజ్‌లు వచ్చాయని తెలిపారు. కాగా, గతంలో కూడా పప్పూ యాదవ్‌ను చంపుతామంటూ బెదిరింపులు వచ్చాయి. అక్టోబర్ 28న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనకు బెరింపు కాల్స్ వచ్చాయని ఎంపీ చెప్పారు. అయితే ఆ కాల్స్ చేసిన వ్యక్తిని ఢిల్లీకి చెందిన మహేశ్ పాండేగా పోలీసులు గుర్తించారు. అతడిని ఈ నెల 2న అరెస్టు చేశారు.

విపక్ష నేతలను వేటాడటంలో బీజేపీ దిట్ట

హేమంత్ సోరెన్



రాంచీ: ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలను వేటాడటంలో బీజేపీ దిట్ట అని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అన్నారు. అలా చేసి ఆ పార్టీ అనేక ప్రభుత్వాలను పడగొట్టిందని ఆరోపించారు. బీహార్ సీఎం నితీశ్‌కుమార్‌ను ఎన్డీఏలో చేర్చుకోవడం దానికి ఉదాహరణగా పేర్కొన్నారు. రాష్ట్రాలపై జీఎస్టీ విధించి, వారికి ఆదాయ వనరులు లేకుండా చేసి... పేద రాష్ట్రాల నడ్డి విరిచిందని ఘాటుగా వ్యాఖ్యానించారు. జార్ఖండ్ రాష్ట్రాన్ని బీజేపీ రెండు దశాబ్దాలకు సరిపడా పిండేసిందని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి బీజేపీ పలు ప్రయత్నాలు చేసిందని, అవి బెడిసికొట్టడంతో తనపై కుట్ర పన్ని జైలుకు పంపించిందని సోరెన్ ఆరోపించారు. బీజేపీ 'విభజన రాజకీయాలు' రాష్ట్ర ప్రగతిని ఆపలేవని అన్నారు. హిందూ-ముస్లిం పోలరైజేషన్, మత విద్వేషాలు, విభజన రాజకీయాలు మినహా బీజేపీకి మరో అజెండా లేదని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి పదేపదే లేఖలు రాసినా కేంద్రం నుంచి అందాల్సిన రూ.1.36 లక్షల కోట్ల బొగ్గు బకాయిలు చెల్లించలేదని... వాటిని ఎలా పొందాలో తమకు తెలుసని ఆయన పేర్కొన్నారు. మణిపూర్‌లో కంటే జార్ఖండ్‌లో గిరిజనుల పరిస్థితి దారుణంగా ఉందని ప్రధాని చెప్పే మాటలే వారి కుట్రపూరిత ఆలోచనలను తెలియజేస్తున్నాయన్నారు. ఒక గిరిజన సీఎం జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ఉండడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని సోరెన్ మండిపడ్డారు. రాష్ట్రంలో నెలలతరబడి ఎన్నికల ప్రచారం చేస్తున్న సీఎంలు వారి రాష్ట్రాల పరిస్థితులను ఎందుకు పట్టించుకోవట్లేదు అని ఆయన ప్రశ్నించారు. జార్ఖండ్‌లో చొరబాటుదారుల గురించి మాట్లాడే కేంద్ర హోంమంత్రి అమిత్ షా ... తమ సొంత పార్టీ నేతలు చేసే అవినీతి, అక్రమాలను ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. వ్యాపారుల పార్టీగా పేరుపొందిన బీజేపీ... సీబీఐ, ఈడీ వంటి కేంద్ర ఏజెన్సీలను నియంత్రిస్తోందని మండిపడ్డారు. గుజరాత్‌లోని ఓడరేవుల్లో భారీగా మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోవడంపై ప్రధాని ఎందుకు స్పందించట్లేదని నిలదీశారు. తమ రాష్ట్రంలో ఉమ్మడి పౌరసత్వాన్ని అమలుచేయాల్సిన అవసరం లేదని అన్నారు. 81 అసెంబ్లీ స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీకి ఈ నెల 13న తొలివిడత, 20న రెండోవిడత పోలింగ్ జరగనుంది. 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

జేఎంఎం అవినీతి ప్రభుత్వం

అమిత్ షా



రాంచీ: జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) సంకీర్ణ ప్రభుత్వం అత్యంత అవినీతిమయంగా మారిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. ఇకనైనా వారిని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జార్ఖండ్‌లోని పాలములో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. అవినీతిపరులను తలకిందులుగా వేలాడదీస్తామని అన్నారు. రాష్ట్రంలో చొరబాటుదారులను అరికట్టడం కేవలం మోదీ నాయకత్వంలోని బీజేపీతోనే సాధ్యమవుతోందన్నారు. ఓబీసీ కోటాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ మహారాష్ట్రలోని కొన్ని వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని... అయితే మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం అనే విషయాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తుంచుకోవాలని అన్నారు. ఆయన తన వెంట ఎప్పుడూ రాజ్యాంగాన్ని తీసుకెళ్లి ప్రచారాల్లో దాన్ని చూపిస్తుంటాడని, నకిలీ రాజ్యాంగ ప్రతిని చూపుతూ దానిని అపహాస్యం చేస్తున్నారని అమిత్ షా దుయ్యబట్టారు. జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని... ఎన్ని తరాలు వచ్చి అడిగినా ఆర్టికల్ 370ని పునరుద్ధరించే అవకాశం లేదని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో అక్రమ చొరబాటుదారుల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అది తమ రాజకీయ అజెండా అని సీఎం హేమంత్ సోరెన్ అంటున్నారని.... కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వారిని వాడుకుంటున్నారని దుయ్యబట్టారు.

కాషాయం ధరిస్తే 'యోగి' కాలేరు

అఖిలేశ్ యాదవ్



లక్నో : సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ శనివారం సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై పరోక్ష విమర్శలు చేశారు. మనిషి 'సాధువు' అయ్యేది ఏమి ధరించాడనే ద్వారా కాదని, అతను ఏమి మాట్లాడతాడనే ద్వారానే అని అన్నారు. ఎన్‌కౌంటర్‌లు చేసే వారి కోసం కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, అధికార పీఠంలో ఉన్న వారి రోజులు ముగియనున్నాయని అఖిలేశ్ అన్నారు. 'వారి భాష మారిందని, వారి ఆలోచనా విధానం, అవగాహన కూడా మారిందని మీరు చూడవచ్చు' అని తెలిపారు. 'తనకంటే పెద్దగా ఎవ్వరినీ భావించని వ్యక్తి, అతను ఎలాంటి యోగి? ఒకరినొకరు వ్యతిరేకించే వ్యక్తి ఎవరైనా ఉంటే, అది ప్రభుత్వంలోని వ్యక్తులే' అని యూపీ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. 'ఒక సాధువు ఎంత గొప్పవాడో, అతను తక్కువ మాట్లాడతాడు. అతను మాట్లాడినప్పుడు అది ప్రజా సంక్షేమం కోసమే. అయితే ఇక్కడ ప్రతిదీ వ్యతిరేకం. ఏ రకమైన భాష వాడుకలో ఉంది. ఒక వ్యక్తి ధరించే దాన్ని బట్టి యోగి కాదు. కానీ మాట్లాడేదాన్ని బట్టి' అని అన్నారు. నోట్ల రద్దు తర్వాత బ్యాంకులో నోట్లను మార్చుకునేందుకు క్యూలో నిల్చొని ఉన్నప్పుడు మహిళ ప్రసవించిన బాలుడు 'ఖజాంచి' జన్మదిన కార్యక్రమంలో పాల్గొన్న అఖిలేశ్... ఈ బాలుడు ఎంత పెద్దవాడైతే, నోట్ల రద్దు వైఫల్యాన్ని ప్రజలకు అంత ఎక్కువగా గుర్తు చేస్తాడని అన్నారు. 'నిజమేమిటంటే, ప్రపంచ ఆర్థిక చరిత్రలో నోట్ల రద్దు అతిపెద్ద అవినీతిగా అవతరించింది. నోట్ల రద్దు బీజేపీ అవినీతి సముద్రమని నిరూపించింది' అని ఆయన అన్నారు. పెద్ద నోట్ల రద్దు ప్రభావం రైతులు, కార్మికులు, మధ్య తరగతి, జీతభత్యాల తరగతి, చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులందరినీ ఒకే విధంగా పీడిస్తున్న 'స్లో పాయిజన్' తో అఖిలేశ్ యాదవ్ పోల్చారు.

హిమాచల్‌లో సమోసా రాజకీయం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో ప్రస్తుతం సమోసాలపై రాజకీయం నడుస్తోంది. సీఎం సుఖ్వీందర్ సింగ్ పాల్గొన్న సీఐడీ కార్యక్రమంలో ఆయన కోసం ఉంచిన సమోసాలు మాయమయ్యాయి. అవి ఆయన భద్రతా సిబ్బందికి చేరాయి. దీంతో సీఎం కేవలం టీతో సరిపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సమోసాల మాయంపై సీఐడీ అంతర్గత దర్యాప్తు చేపట్టింది. కాగా, ఆ రాష్ట్రంలో ప్రతిపక్షమైన బీజేపీ ఈ సమోసా వివాదంపై మండిపడింది. సీఎం కోసం ఉంచిన సమోసాలు కాపాడలేని వారు ప్రజలను ఎలా కాపాడతారని విమర్శించింది. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ సీఎం జైరాం ఠాకూర్ శుక్రవారం బీజేపీ నేతలు, కార్యకర్తలకు సమోసా పార్టీ ఇచ్చారు. సీఎం సుఖ్‌విందర్ సుఖ్‌ను ఎగతాళి చేసేందుకు ఈ అల్పాహార విందు ఏర్పాటు చేశారు. బీజేపీ నేతలు సమోసాలను తింటూ



వాటిని ఆస్వాదిస్తూ కబుర్లు చెప్పుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

విశాలాంధ్ర హైదరాబాద్

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బంజరాహిల్స్ రోడ్ నెంబర్ 13 మినిస్టర్స్ కాలనీలో గల రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గృహంలో ఎన్యూమరేటర్లు మంత్రి కుటుంబ వివరాలను సేకరించి స్టిక్కర్ అతికించారు. మంత్రి ఎన్యూమరేటర్లకు తన కుటుంబ వివరాలను తెలియజేసినారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు అలాగే ఇతర బలహీన వర్గాల అభ్యున్నతికై సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అలాగే రాజకీయ అవకాశాలను మెరుగు పరుచుటకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు పూర్తిగా సహకరించి వివరాలను తెలపాలని సూచించారు. ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్నా తీరును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ స్నేహ శబరిష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరామ్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, తహసీల్దార్ అనితారెడ్డి, సూపర్ వైజర్ శ్రీకాంత్, ఎన్యూమరేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా మూడుచింతల పల్లీ మండలంలోని జగన్ గూడలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల వివరాల సేకరణను శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి పరిశీలించారు. అదే మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలోని వరి కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తనిఖీ చేశారు. అనంతరం ఎంసి పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న తహశీల్దార్ కార్యాలయ నూతన నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పరిశీలించారు.

సర్వే ఫారాన్ని జాగ్రత్తగా పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్-మల్కాజిగిరి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు నిర్దేశిత ప్రొఫార్మాల నమోదులో కోడింగ్ ను అత్యంత జాగరుకతతో నింపాలని, ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలలో ప్రత్యేకించి కోడింగ్ ను సూపర్ వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు అన్నారు. శనివారం నుండి ప్రారంభమైన ఇంటింటి సమగ్ర సర్వేలో భాగంగా శామీర్ పేట్ మండలంలోని అలియాబాదులో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల వివరాల సేకరణను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఏవిధంగా ప్రొఫార్మాలను నింపుతున్నారని ఎన్యుమరేటర్లు అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రొఫార్మాలలో నిర్దేశించిన చోట పుస్తకంలో ఇచ్చిన విధంగా కోడింగ్‌లను నింపాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. మొదటిరోజు కాబట్టి కొంత నిదానంగా తప్పులు జరుగకుండా జాగ్రత్తగా ప్రొఫార్మాలను పూరించేలా ఎన్యుమరేటర్లకు సూచించాలని ఎంపిడిఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మమతాబాయి, సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో 'సమగ్ర కుటుంబ సర్వే'

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ పరిధిలో 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే'ను షెడ్యూల్ ప్రకారం, ఖచ్చితత్వం, క్వాలిటీతో చేపట్టేందుకు జిహెచ్ఎంసి, జోన్ ల పరిధిలో సమన్వయ, పర్యవేక్షణ అధికారులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్ నియమించారు. ఈ మేరకు శనివారం ఆయన మెమో జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో నిర్వహించే సామాజిక, ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ, కుల (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) సర్వే సమన్వయ అధికారిగా హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలోని సికింద్రాబాద్, చార్మినార్ జోన్‌లకు హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవత్స కోట, ఖైరతాబాద్ జోన్‌లకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్‌లకు జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ లను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. పర్యవేక్షణ అధికారులు సంబంధిత జోనల్ కమీషనర్‌లతో సర్వే సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయిలో సర్వే సకాలంలో ప్రభావవంతంగా పూర్తి అయ్యేలా చూస్తారు. క్షేత్రస్థాయి సర్వే పురోగతికి సంబంధించి జిహెచ్ఎంసి సమన్వయ అధికారికి తెలియజేస్తారు. జోనల్ కమిషనర్లు, మానిటరింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ నిర్దేశిత షెడ్యూల్ ప్రకార సర్వే సజావుగా జరిగేలా జిహెచ్ఎంసి కమిషనర్‌కు సమన్వయ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ సహకారం అందిస్తారు.

మిడ్ డే మీల్స్ కార్మికులని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: మధ్యాహ్న భోజనం కార్మికులుగా పనిచేస్తున్న ముగ్గురి మహిళలను విధుల నుంచి అకారణంగా తొలగించడం దుర్మార్గమైన చర్య అని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం, ధన్వాడ గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్‌లో దళిత మహిళ పసుల సువర్ణ, ఇజ్జంకి మణెమ్మ, ఇజ్జంకి కలమ్మ పదేండ్లుగా మధాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో సువర్ణ ఇల్లు ప్రమదవశాత్తూ కాలిపోగా, అప్పటి ఎమ్మెల్యే పుట్ట మధు తన కుటుంబానికి సాయం చేశారని ఆమె బహిరంగంగా చెప్పారు. సువర్ణ ఇలా చెప్పినందుకే ఆమె పాలిట శాపమైందన్నారు. తనకు జరిగిన అన్యాయంపై సువర్ణ స్థానిక ఎంఎల్ఎ, మంత్రి శ్రీధర్ బాబును కలిసినా ఫలితం దక్కలేదన్నారు. ఈ ఘటనపై పునరాలోచించి పేద కుటుంబాలకు చెందిన వారిని విధుల్లోకి తీసుకొనేలా ఆదేశాలివ్వాలని ఆయన మంత్రి శ్రీధర్ బాబును కోరారు. సమావేశంలో బాధితురాలు పసుల సువర్ణ, దళిత క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.మోజెస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడా డివిజన్ వెంకటగిరిలో పునర్ నిర్మితమైన నాలుగు దశాబ్దాల శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేసింది. కార్తిక మాసం రెండు సోమవారం అంటే నవంబర్ 11, 12 తేదీన రెండు రోజులపాటు ప్రథమ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా ఆలయం ముస్తాబు అవుతుంది. ఆలయంలో ముఖ్యంగా శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంతో పాటు కాశీ విశ్వనాథ, శ్రీఅన్నపూర్ణమ్మ, స్వామి అయ్యప్ప, శ్రీకృష్ణ విగ్రహంతో పాటు కాలభైరవ, వల్లి సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి, సాయిబాబా ఆలయంలో ప్రతిరోజు నలుగురు పురోహితులు వేణు శర్మ, చంద్రశేఖర్ శర్మ, వేణు మహాదేవ్ చార్యులు, సందీప్‌తో ప్రతిరోజు పూజాది కార్యాలు నిర్వహిస్తూ ఉండడం ఓ ప్రత్యేకత. ఇక్కడ నెలకొల్పిన దేవాలయంలో ప్రతి అమావాస్య, పౌర్ణమి నాడు కాశీలో జరుగు విధంగా గంగా హారతి శ్రీ కాశీ విశ్వనాధునికి హారతి చేయడం అలాగే ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పారాయణం, అయ్యప్ప మాలధారణ వారికి ఉండడానికి వసతితో పాటు అన్ని ఏర్పాట్లను, నూతనంగా నిర్మితమైన ఆలయంలో హైందవ శాస్త్ర ప్రకారం అత్యంత వైభవంగా జరుగుతుంది అని ఆలయ కమిటీ తెలియజేసారు.

ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో సదరం క్యాంప్ ఏర్పాటు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: దివ్యాంగులకు సదరం క్యాంపు ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో కార్యనిర్వహక అధికారి ఆధ్వర్యంలో జరిగిన అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఎంతోమంది పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్లాల్సి వస్తుందని, వారి పరిస్థితి ఎంతో బాధాకరంగా ఉంటుందని దీనిని దృష్టిలో పెట్టుకుని షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే సదరం పరీక్షలు జరిగే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు చేపడతానని ప్రకటించారు. సదరం క్యాంపుల్లో డాక్టర్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించడం కోసం ఎంతో దూరం దివ్యాంగులు వెళ్తున్నారని వారు ఎన్నో ఆపసోపాలు పడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఇకపై అలా జరగకుండా ప్రత్యేకంగా ఇక్కడే సదరం క్యాంపు ఏర్పాటు జరిగే విధంగా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే నిరుపేద ప్రజలను సిబ్బంది ఆదరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. చిన్న రోగమైన ఎంతో బాధతో తనకు తెలియక ఆందోళనతో వస్తాదని అలాంటి వారిని ఆందోళనకు మానసిక ఒత్తిడికి దూరం చేసే బాధ్యత వైద్యులపై ఉంటుందని గుర్తు చేశారు. వచ్చిన రోగిని పరీక్షించకుండా చికాకుతో వ్యవహరించడం, ఇక్కడ ట్రీట్మెంట్ ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయడం లాంటివి మానుకోవాలని హితబోధ చేశారు. పేదవాళ్లు తమ ఆర్థిక పరిస్థితి బాగోక ఎంతో నమ్మకంతో ఆసుపత్రికి వస్తారని అలాంటి వారిని చేరదీసి వారిలోని ఆందోళనను పోగొట్టాల్సిన కనీస బాధ్యత వైద్య సిబ్బందిపై ఉంటుందన్నారు. దవాఖానాలో విధి నిర్వహణ సమయంలో అందరూ హాజరై ఉండాలని ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రిలో ఏవైనా కొరత ఉంటే దానిని తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం

ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రైల్వే ఉద్యోగాల భర్తీలో కేంద్ర ప్రభుత్వం చాలా ఏండ్ల నుంచి తెలుగు రాష్ట్రాల యువతకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని, రైల్వే ఉద్యోగాలలో తెలంగాణకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ దేశంలో అత్యున్నత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి ఉద్యోగాల భర్తీకే 13 ప్రాంతీయ భాషల్లో రాత పరీక్షలు నిర్వహిస్తుంటే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ఆర్బీ)ల ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు మాత్రం కేవలం ఇంగ్లిష్, హిందీ భాషల్లోనే పరీక్షలు నిర్వహిస్తున్నారని, దీంతో ఆ ఉద్యోగాలన్నీ ఉత్తరాదివారికే లభిస్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్ల పరిధి లోని ఆర్ఆర్బీల ఆధ్వర్యంలో 5,696 అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. వీటిలో దాదాపు 750 పోస్టులు సికింద్రాబాద్ ఆర్ఆర్బీ పరిధిలో భర్తీ చేయనున్నారన్నారు. మెరిట్‌తో పాటు కంప్యూటర్ బేస్డ్ టెస్టులు, ఇంటర్వ్యూల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నప్పటికీ అసలైన రాత పరీక్షలను మాత్రం హిందీ, ఇంగ్లిష్ లోనే నిర్వహిస్తున్నారన్నారు. అంటే హిందీ, ఇంగ్లిష్ భాషలు నేర్చుకున్న వారికే ఆర్ఆర్బీ ప్రాధాన్యమిస్తున్నదని విమర్శించారు. దేశంలోని ఎన్నో మాతృ భాషలు ఉన్నప్పటికీ తప్పనిసరిగా హిందీ, ఇంగ్లిష్ భాషలను నేర్చుకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నదని, తద్వారా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తెలంగాణ, ఏపీ యువతకు రైల్వే ఉద్యోగాలు ఎన్నటికీ లభించవని కేంద్ర ప్రభుత్వం చెప్పకనే చెప్తున్నదని వారు విమర్శించారు. త్వరలో జరగనున్న అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన రాత పరీక్షలను తెలుగులో రాసేందుకు అనుమతించాలని వారు కేంద్ర ప్రభుత్వం, ఆర్ ఆర్ బీ బోర్డ్ ను డిమాండ్ చేశారు. డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అయినా రైల్వే బోర్డు ఈ సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఏఐ వై ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ లింగం రవి, సత్య ప్రసాద్, శ్రీమాన్ పాల్గొన్నారు.

12న తెలుగు వర్సిటీ సాహిత్య పురస్కారాలు ప్రదానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలుగు వర్సిటీలోనీ వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏడాది అందజేసే సాహితీ పురస్కారాలను 2022 సంవత్సరానికి గాను ఈనెల 12న నాంపల్లిలోని తెలుగువర్సిటీ ఎన్టీఆర్ కళామందిరంలో ప్రధానం చేయడం జరుగుతుందని ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య వై.రెడ్డి శ్యామల తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.వి.రమణాచారి, విశిష్ట అతిథిగా ఆచార్య తంగెడ కిషన్‌రావు హాజరవుతారని, సభకు అధ్యక్షులుగా తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు వ్యవహరిస్తారని తెలిపారు. పురస్కారంగా ఒక్కొక్కరికి రూ.20 వేల 116 నగదుతో పాటు పురస్కార పత్రాన్ని అందజేయడం జరుగుతుందని ఆచార్య రెడ్డి శ్యామల తెలిపారు. సాధారణ పాఠకులతోపాటు కవులు, రచయితలు, విమర్శకులు నాటకకర్తల నుండి సూచనలను స్వీకరించి 2019, 2020, 2021 సంవత్సరాల్లో ప్రచురించబడిన పుస్తకాలను సేకరించి న్యాయ నిర్ణేతల చేత వివిధ దశల్లో ఎంపిక కాబడిన ఉత్తమ సాహితీమూర్తులకు ఈ పురస్కారాలను అందజేయనున్నట్లు వర్సిటీ ఇంచార్జ్ రిజిస్ట్రార్ వివరించారు.

పురస్కార గ్రహీతలు వీరే...

వరదాభ్యుదయం-పద్య కవితకు పెంద్యాల కిషన్ శర్మ, కాలం వాలిపోతున్న వైపు-వచన కవితకు మెర్సీ మార్గరెట్, ఆటపాట బాలసాహిత్య గ్రంధానికి ఎన్నవెళ్ళి రాజమౌళి, నూనె చుక్క కథకు కొట్టం రామకృష్ణా రెడ్డి, కెరటం నవలకు తాళ్లపల్లి యాకమ్మ, అనుభూతి-అన్వేషణ సాహిత్య విమర్శకు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, స్వాతంత్రోద్యమ వీరుల నాటకత్రయం గ్రంధానికి పి.ఏ.దేవి, వీరయ్య అనువాద గ్రంధానికి గురుమూర్తి గుబిలి, ఆజాద్ హింద్‌ఫౌజ్-ముస్లిం పోరాట యోధులు వచన రచన గ్రంథానికి సయ్యద్ నశీర్ అహ్మద్, రంగుంటే ఇష్టం రచయిత్రి ఉత్తమ గ్రంధానికి చాగంటి తులసిని ఎంపిక చేశారు.

కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వినాయక నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్యటించి కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో బోర్ మరమత్తులు, విద్యుత్ పోల్స్, త్రీ ఫేస్ లైన్స్, డ్రైనేజ్ మరమత్తులు, చేపిస్తామని కాలనీవాసులకు తెలియజేశారు. ఈ కాలనీకి సంబంధిత అధికారులు పిలిపించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వాటి పరిష్కారినికి చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ విభాగం, సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం, జలమండలి మేనేజర్ కృష్ణ ప్రసాద్, ఉదయ్ పాల్గొన్నారు. దీనిలో భాగంగా సాయినగర్‌లోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించడం జరిగింది. పాఠశాల వద్ద పారిశుద్ధ్యం, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సంబంధింత సిబ్బందికి తెలిపారు. ఈ స్కూల్ వద్ద తరచుగా పోలీస్ పెట్రోలింగ్ కూడా నిర్వహించాలని సీఐ సందీప్‌కి ఫోన్ ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఉపేందర్, కార్యదర్శి రమేష్, జగదీష్ చారీ, ఓం ప్రకాష్, చంద్రమౌళి, వెంకటేష్, రమాదేవి, సుజాత, పద్మ, సుమతీ, సంగీత, సోమేష్, ధనరాజు, పందు, కృష్ణ, రాజేష్, సాయి సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ పరిధిలోని సెయింట్ ఆన్స్ స్కూల్లో ప్రిన్సిపాల్ టీ నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్ లను సందర్శించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ ఎదిగే పిల్లలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమైందని, ఆహార పదార్థాల పైన ఆహార అలవాట్ల పైన సంపూర్ణ అవగాహన ఉండాలని స్కూల్ యాజమాన్యం ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని విద్యతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులకు అవగాహన కల్పించినప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని సింగిరెడ్డి పద్మా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉర్దూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా విద్య వ్యవస్థకు ఎంతో తీవ్ర నష్టం జరిగిందని, ఉపాధ్యాయ నియామకాలు చేయకపోవడం చేత పది సంవత్సరాల విలువైన కాలాన్ని విద్యార్థులు నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న 11వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థ పునరుజ్జీవనం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే అవకాశం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని కాబట్టి వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారు మంచి లక్ష్యాలను సాధించడానికి మీరు తర్ఫీదు ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం ఉర్దూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఉర్దూ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఖాజా కుతుబుద్దిన్, షకీల్ అహ్మద్, అన్సారి, మమ్మద్ నజాముద్దీన్, అబ్దుల్ సలాం ఖాన్, నీయాం సిద్ధికి, ఎయంఓ దుంకుడు శ్రీనివాస్, గట్టు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వ్యవసాయాధికారి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రైతులకు ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2300 చెల్లిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ అన్నారు. శనివారం కీసర మండలంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు తగిన సలహాలు, సూచనలు అందజేసారు. సన్నరకం వరికి ప్రభుత్వ మద్దతు ధరతో పాటు, బోనస్ గా ఐదు వందల రూపాయలు చెల్లిస్తున్నదని తెలిపారు. రైతులు వరి కోసాక తాలు, చెత్త లేకుండా చూసుకోవాలని, తేమ 17 శాతం ఉండేట్టట్లుగా చూసుకోవాలని ఆమె సూచించారు. రైతులకు ఎప్పుడు అందు బాటులోనే ఉంటామన్నారు.

సబర్బన్ రైళ్లు, బస్సు ప్రయాణీకుల సంఘం స్వర్ణోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సబర్బన్ రైళ్లు, బస్సు ప్రయాణికుల సంఘం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ స్వర్ణోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్ హాజరయ్యారు. సిపిఎం జిఎస్ ఎ.కె సింగ్, డి.ఎస్.టి.ఈ. ఫిర్దస్ ఖాన్, పార్మర్ సీనియర్ డిజిఎం డాక్టర్ అనిరుధ్, సీనియర్ డి.ఈ.ఈ. కిరణ్ కుమార్, సీనియర్ డి.ఎస్.ఓ కె.విజయ్ కుమార్, హెచ్.కె.విష్ణు చైతన్య, శశాంక్ నామ్‌దేవ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సర్ణోత్సవ వేడుకలకు హాజరైన అధికారులందరినీ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. మల్కాజిగిరి రైల్వే స్టేషన్ అభివృద్ధికి, ఇతర కార్యక్రమాలకు అసోసియేషన్ తరపున ఈ 50 సంవత్సరాలలో ప్రధాన కార్యదర్శి నూర్ అహ్మద్ చేసిన నిరంతర కృషిని అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షులు ఏ.వీరస్వామి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బాల గంగాధర్, విజయ ప్రసాద్ రెడ్డి, సుధ, కరీమ, శంకర్‌రావు, భరద్వాజ్ పరిణం, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కొరత లేకుండా చూడాలి

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ పరిధిలోని సాయి నగర్ 40 ఫీట్ రోడ్డులో మంచినీటి పైప్ లీకేజీ కారణంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా శనివారం ఉదయం స్థానిక 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి మేనేజర్ తిరుపతితో కలిసి పరిశీలించి లీకేజీ పనులను తొందరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ విజయపాల్ రెడ్డి, 25వ డివిజన్ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు రవీంధర్ చారి, మధుసూదన్, భాను, వాటర్ లైన్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేలో గవర్నర్ కుటుంబ వివరాలను సేకరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా గవర్నర్ కుటుంబ సభ్యులను నమోదు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ప్లానింగ్ ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తనియా, జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ స్నేహ శబరిష్, జిల్లా కలెక్టర్ అనుదీప్, గవర్నర్ సెక్రటరీ. విద్య శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేష్, ఖైరతాబాద్ డి.సి రజనీ కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా క్షుణ్ణంగా పరిశీలించాలి: కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సవరించే ప్రక్రియ క్షుణ్ణంగా పరిశీలించాలని, చనిపోయిన వారి పేర్లను జాబితా నుండి తొలగించాలని, డూప్లికేషన్ లేకుండా ఓటరు నమోదు చేపట్టాలని కలెక్టర్ నారాయణ రెడ్డి బూతు లెవెల్ అధికారులకు సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 9,10 తేదీలలో యువతీ యువకులు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవడానికి నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపును జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించడం, ఓటరు జాబితాలో డూప్లికేషన్, చనిపోయిన వారి పేర్లను జాబితా నుండి తొలగించాలని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ నిర్వహణపై మాట్లాడుతూ 75 కాలములలో చేపట్టే సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ఎన్యూమరేటర్లకు శిక్షణ సందర్భంగా ఇచ్చిన గైడెన్స్ ఆధారంగా అర్థం చేసుకొని జాగ్రత్తగా ఫామ్‌ను పూర్తి చేయాలని తెలిపారు. ఎన్యూమరేటర్లకు ఏమైన సందేహాలు ఉంటే మీపై అధికారులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్న తరువాత సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన ఉపాధ్యాయునికి సూచించారు. మీరంత క్రమశిక్షణ, పరిశుభ్రతను, మంచి అలవాట్లను పాటించి, మీతోటి విద్యార్థులను కూడా పాటించేలా చూడాలన్నారు. జీవితంలో ఎదగడానికి పదవ తరగతి తొలిమెట్టు అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు గొప్ప గొప్ప స్థానాల్లో ఉన్నారన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. ప్రతి రోజు స్కూల్‌కు యునిఫాం ధరించి రావాలని, తరగతిలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని, కసితో, క్రమశిక్షణతో చదవాలని, ఉన్నత స్థితికి మీరంత చేరుకోవాలని అన్నారు. పదవ తరగతి పరీక్షలలో పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించాలని తెలిపారు. విద్యార్థులకు టీం వర్క్ అలవాటు చేయాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. కలెక్టర్ వెంట శంషాబాద్ తహశీల్దార్ రవీందర్ దత్తా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి అపన్న హస్తంలా ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి డిపి కాలనీకి చెందిన విజయలక్ష్మి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స కొరకై ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 60000 చెక్కును మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తన నివాసంలో సదరు మహిళకి అందజేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కి భాదిత మహిళ కృతజ్ఞతలు తెలిపారు.

సమర్థవంతంగా కులగణన: ఆర్డీఓ

విశాలాంధ్ర - ఆమనగల్లు : కులగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా సమగ్ర సమాచారం సేకరించి సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ శ్రీను నాయక్ సూచించారు. శనివారం ఆమనగల్లు మండలం శంకర్ కొండ తండా, సామాయపల్లి, మేడిగడ్డ తండా, ఆమనగల్లు మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న కుల గణన ఓటర్ల జాబితా ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లలిత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అమనగల్లు మున్సిపాలిటీలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయం, కుల సర్వే, సమగ్ర ఇంటి సర్వే చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వసంత మాట్లాడుతు సర్వే దరఖాస్తులను జాగ్రత్తగా నింపాలని, సమగ్ర ప్రజలందరూ సహకరించాలని కోరారు. చైర్మన్ రాంపాల్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మైసిగండి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభించారు. ఈ సర్వేలో కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కే స్టాలిన్, కిషన్, మాజీ తులసిరామ్, బాబ, మదన్, రమేష్, భోని, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలమూరు రెడ్డి సేవా సమితి, బిబిఆర్ ఫంక్షన్ హాల్, బికే రెడ్డి కాలనీ నందు శనివారం మహిళా విభాగం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉసిరి చెట్టుకు పూజలు చేసి మహిళలందరూ సామూహికంగా శ్రీ వెంకటేశ్వర గోవింద నామాలు జరిపించారు. అనంతరం ఉసిరి చెట్టు కింద సమావేశమై వనభోజనాల విశిష్టత గురించి తెలియపరుస్తూ ఈ వనభోజన కార్యక్రమం జీవితాంతం గుర్తుండిపోయే కార్యక్రమం అని తెలిపారు. పుణ్యప్రదమైన ఈ కార్తీకమాసంలో దేవతారాధన చేసి నివేదనలు సమర్పించి ఆ ప్రసాదాన్ని కార్యక్రమానికి విచ్చేసిన మహిళలందరూ భక్తిశ్రద్ధలతో ఆరగించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, సేవా సమితి మహిళా విభాగ అధ్యక్ష కార్యదర్శులు సరస్వతి, స్వరూప, కోశాధికారి శోభ వనజ, వరలక్ష్మీ, నర్మద, శశికళ, మీనాక్షి, హేమలత, నిర్మల, శ్రీలత, అనిత, రమాదేవి, విజయ లక్ష్మి, రాజేశ్వరి, డా.చేతన, వినోద తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, సహాధ్యక్షుడు పసుల ధనుంజయ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జి. వెంకట్రామా రెడ్డి, ప్రచార కార్యదర్శి నల్లమద్ది సురేందర్ రెడ్డి కార్యవర్గ సభ్యులు టి. పరమేశ్వర్ రెడ్డి, ఎస్. బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సోరియాసిస్ సమస్యకు 'సోకేర్'తో ఉపశమనం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : సోరియాసిస్ చికిత్సకు అద్భుతంగా పని చేసే 'సోకేర్' ఆయిల్‌ను బేగంపేటలోని ది ప్లాజాలో పర్పుల్ లైఫ్ సైన్సెస్ శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా పర్పుల్ లైఫ్ సైన్సెస్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ రాఘవరెడ్డి మాట్లాడుతూ సోరియాసిస్‌తో బాధపడే వారికి ఈ ఆయిల్ అద్భుతంగా పని చేస్తుందన్నారు. ప్రకృతి ద్వారా లభ్యమయ్యే వాటితో మనిషికి వచ్చే వ్యాధులను నయం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశోధన ఆధారిత సంస్థ పర్పుల్ లైఫ్ సైన్సెస్ పరిచయం చేస్తున్న మొదటి ఉత్పత్తి ఇదన్నారు. ఇది యాక్టివ్ హెర్బల్ ఎక్స్‌ట్రాక్ట్, హ్యూమెక్టెంట్ కలయిక అన్నారు. సోరియాసిస్ లక్షణాలను సమర్థవంతంగా తగ్గిస్తుందన్నారు. ఎర్రటి చారలు, డ్రై స్కిన్, క్రాకడ్ స్కిన్, దురద, మంటలా ఉన్న ఈ ఆయిల్‌తో ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ ఉత్పత్తిలో అంతోసయానిన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ సహా బకుచియోల్, ప్సోరాలిడిన్, ప్సోరాలెన్ వంటి పదార్థాలు ఉన్నాయన్నారు. అంతోసయానిన్ ఆక్సిడేషన్ విరోధక, ఇన్ఫ్లమేషన్ నిరోధక గుణాలు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయని తెలిపారు. సోరియాసిస్ లక్షణాలను తగ్గించడంలో దోహదపడుతుందని చెప్పారు. పర్పుల్ కార్న్‌ని వాణిజ్య పద్ధతిలో సాగు చేస్తున్న ఒకే ఒక్క భారతీయ కంపెనీ పర్పుల్ లైఫ్ సైన్సెస్ అన్నారు. దీని నుంచి ఆంథోసైనిన్ సేకరిస్తున్నామని చెప్పారు. పర్పుల్ లైఫ్ సైన్సెస్ అనేక దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే ఉత్పత్తులపై పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పర్పుల్ లైఫ్ సైన్సెస్ ఫైనాన్స్, ఆపరేషన్స్ డైరెక్టర్ కే మణికంఠ రెడ్డి మాట్లాడుతూ సోకేర్ ద్వారా సహజ ఆరోగ్యాన్ని పునర్నిర్వచించడానికి శక్తివంతమైన, శాస్త్రీయ ఆధారిత ఉపశమనాన్ని అందించనున్నామని తెలిపారు. ఇందులో ఎటువంటి దుష్ప్రభావాలు లేవన్నారు. దీర్ఘకాల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రభావవంతమైన సహజ పరిష్కారాలను అందుబాటులోకి తేవడమే మా లక్ష్యమన్నారు. అధునాతన సూత్రీకరణ సాంకేతికతతో ప్రకృతిలో అత్యంత శక్తివంతమైన అణువులను కలపడం ద్వారా ఇతర దీర్ఘకాలిక పరిస్థితుల కోసం పర్పుల్ లైఫ్ సైన్సెస్ చురుగ్గా పని చేస్తుందన్నారు.

కార్పొరేటర్ నివాసంలో కుటుంబ సర్వే చేసిన అధికారులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని నివాసం ఉండే డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేంకుమార్ కుటుంబ సర్వేను అధికారులు శనివారం చేపట్టారు. విజయనగర్ కాలనీలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఉప కమిషనర్ రాజుతో కలసి కార్పొరేటర్ కుటుంబ వివరాలు తీసుకొని సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రవి కిరణ్ మాట్లాడుతూ ప్రజలు సర్వేకు వచ్చే సిబ్బందికి సహరించాలని, సర్వే వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ సర్వే కూడ ఉపయోగకారిగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు సత్యనారాయణ, సంపత్ రావు, నాగేష్, శంకర్రావు, రోజా, రమణి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించిన మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) లో భాగంగా శనివారం ఉదయం పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్ 12వ డివిజన్‌లో సర్వే చేస్తున్న ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నారా అని మేయర్ అమర్ సింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, వార్డ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యం

విశాలాంధ్ర-దుండిగల్: చిన్నారులలో నైపుణ్యత సాంకేతిక పెంపొందించడమే ప్రధాన లక్ష్యం అని ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ తబస్సుమ్ జైది, జోనల్ హెడ్ రవి నాయక్ పేర్కొన్నారు. కామన్వెల్త్ యూత్ కౌన్సిల్, స్టూడెంట్ అసోసియేషన్, గ్లోబల్ అండర్‌స్టాండింగ్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సహకారంతో నిర్వహించిన ప్రముఖ ఫెస్ట్, మెకాథ్లాన్ హైదరాబాద్ ఎడిషన్ యువ ప్రతిభ, ఆవిష్కరణల స్ఫూర్తిదాయక ప్రదర్శనకు సాక్షమిచ్చింది.8 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు 1500 మంది విద్యార్థులు రోబోటిక్స్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టలలో తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్కిడ్స్ ది ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి క్యాంపస్ ప్రిన్సిపాల్ తబస్సుమ్ జైదీ మాట్లాడుతూ "మెకాథ్లాన్ 2024 హైదరాబాద్ ఎడిషన్ తమ విద్యార్థుల అద్భుతమైన సృజనాత్మకత నిబద్ధతను హైలైట్ చేసిందని, వాస్తవ ప్రపంచ సవాళ్లను విద్య ఎలా పరిష్కరించగలదని నొక్కి చెప్పింది. ఇక్కడ ప్రదర్శించబడిన అసాధారణమైన ప్రాజెక్ట్ సూత్రాల గురించి దృఢమైన అవగాహన మాత్రమే కాకుండా ప్రపంచ సమస్యలను పరిష్కరించగల సామర్థ్యాన్ని కూడా ప్రతిబింబిస్తాయి. జిమ్మీ అహుజా విద్యార్థుల విజయాల గురించి మాట్లాడుతూ మెకాథ్లాన్ 2024 హైదరాబాద్ ఎడిషన్‌లోని వినూత్న ప్రాజెక్టులు లెర్నింగ్, సృజనాత్మక ఆలోచనల శక్తివంతమైన సమ్మేళనాన్ని వివరిస్తాయి. సానుకూల ప్రభావం చూపడానికి సైన్స్, టెక్నాలజీని ఉపయోగించి యువకులకు సాక్ష్యమివ్వడం స్ఫూర్తిదాయకం. పాల్గొనే వారందరి అంకితభావానికి ఆయన అభినందించారు. వారి అంకిత భావం విద్య అన్‌లాక్ చేయగల అపరిమితమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుందని తెలియజేశారు.

కొమ్మలు నరికారు... తీయడం మరిచారు...

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఎలక్ట్రిసిటీ విభాగం అధికారులు రోడ్ల పక్కన విద్యుత్ తీగలకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను నరికి వేశారు. నరికిన కొమ్మలను తొలగించకుండా అక్కడే పడి వేయడంతో స్థానికులు, పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. డివిజన్ పరిధిలోని శివ హోటల్ వద్ద, భవాని నగర్ కాలనీ, న్యూ భవాని నగర్ కాలనీ, గ్రీన్ హిల్స్ కాలనీ పలుచోట్ల అధికారులు కొమ్మలు నరికించారు. నరికి పడేసిన కొమ్మలను తక్షణమే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ సూచనల ప్రకారం సమాచారాన్ని సేకరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ పరిధిలో గల 18వ వార్డుల జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిషాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటిని సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సర్వే చేసే ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం ఖచ్చితమైన సమాచారం సేకరించాలని విధులలో ఎలాంటి అవలసత్వం వహించకుండా సర్వే నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సూచనల ప్రకారం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని మార్పులు చేర్పులు తదిరత అంశాల కోసం అన్ని పోలింగ్ కేంద్రాలలో బూతుల వద్ద అధికారులు సిద్ధంగా ఉంటారన్నారు. ఈ నెల 9 ,10 తేదీలలో బిఎల్వోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని ఫామ్ సిక్స్ సెవెన్ పూర్తి చేసి అందజేయాల్సిందిగా కలెక్టర్ సూచించారు. ఆర్డీవో, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ నాగార్జున రెడ్డి,ఎన్యుమనెటర్స్, సూపర్వైజర్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కళ్లల్లో ఆనందమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో- పెద్దపల్లి : రైతుల కళ్ళలో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట, అందుగులపల్లి, బ్రాహ్మణపల్లి, రాగినేడు, కనగర్తి, కాపులపల్లి, కాసులపల్లి, గోపయ్యపల్లి, పాలితం, బొంపెల్లి, మేరపల్లి, తుర్కల మద్దికుంట గ్రామాల్లో అలాగే పెద్దపల్లి పట్టణంలోని చందపల్లిలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యంలో ఎలాంటి కటింగ్ లేకుండా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. దళారుల చేతిలో మోసపోవద్దని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, వాటిని రైతుకు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ప్రతి గింజ సన్న వడ్లకు బోనస్ రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజా పాలనలో రైతులకు మేలు చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమన్నారు. మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, మాజీ జడ్పీటీసి బండారి రాంమూర్తి, సందవేణ రాజేందర్, సత్యనారాయణ రెడ్డి, అరే సంతోష్, ఏదల్లి శంకర్, కూర మల్లారెడ్డి, ప్రమేష్, విజయ్, రాజయ్య, నెటట్ల కుమార్, వెంకటేష్, శ్రీనివాస్,ఐకెపి ఏపిఎం సంపత్, సింగల్ విండో సిఈఓ తిరుపతి, మాజీ సర్పంచులు, ఎంపీటీసిలు, కాంగ్రెస్ నాయకులు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : అమ్మవారి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 - జగద్గిరిగుట్ట డివిజన్ షిరిడి హిల్స్‌లో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ నల్ల పోచమ్మ తల్లి దయతో ప్రజలంతా సుభిక్షంగా, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆయన కోరారు. అనంతరం ప్రజలు ఎమ్మెల్యే కేపీ వివేకానందని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. శ్రీశ్రీశ్రీ జగద్గిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు అడ్వకేట్ కమలాకర్, మక్సుద్ భాయ్, మెట్ల శ్రీను, ఎర్ర లక్ష్మయ్య, వెంకటేష్, ఎర్వ సాయి కిరణ్, దేవాలయం చైర్మన్ సురేందర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు బండ మహేందర్, సాయి, మహేష్, నరేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఎత్తివేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నకిరేకంటి చిట్టిబాబు అధ్యక్షతన కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి 40వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ అమరుల ఆశయాలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం సిపిఐ ఎంఎల్ (సిపి) కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కలిసొచ్చే పార్టీలు, సంఘాలతో ఐక్య పోరాటాలు చేస్తామని తెలిపారు. అమరవీరుల అసమాన త్యాగాలు ఎన్నటికీ వృథా కావన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే వారిపై భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. సమావేశంలో సిపిఐఎంఎల్ (సిపి) రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, ఐఎఫ్‌టీయు షేక్ షావలి, మహిళా నేత సంపంగి పద్మక్క తదితరులు పాల్గొన్నారు.

అంధులకు భరోసాగా జ్యోతి విద్యాలయ హైస్కూల్

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : చదువుతో పాటు, అన్ని రంగాలలో అందరికీ ఆదర్శంగా బి.హెచ్.ఈ. ఎల్ టౌన్‌షిప్‌లోని జ్యోతి విద్యాలయ హై స్కూల్ నిలుస్తుందని కరస్పాండెంట్ అంబ్రోస్ బెక్ అన్నారు. వారిలో చూపు మాత్రమే లేకపోవచ్చు కానీ నైపుణ్యం, ముందు చూపు మెండుగా ఉన్నాయని అభినందించారు. ఇలాంటి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అంధులకు కొండంత సహాయం చేయాలని సంకల్పించి "ఇట్రాడ్ సోచ్ ఫౌండేషన్" వారు చేపట్టిన ఓల్డేజ్ హెూమ్ ఫర్ బ్లైండ్ ప్రాజెక్ట్ కోసం జ్యోతి విద్యాలయ హైస్కూల్ యాజమాన్యం గత పదేళ్లుగా తమకు అన్ని విధాలుగా అండగా నిలబడుతుందని, సంస్థ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. పెద్ద ఎత్తున సహాయం చేయడానికి ముందుకు వచ్చి, తమ స్కూల్ విద్యార్థి విద్యార్థులకు సమాజం సేవా దృక్పథం గురించి వివరించి, సహాయ నిమిత్తం అందరు పాల్గొని, సహకరించాలని సోచ్ ఫౌండేషన్ నిర్వాహకులు పిలుపునిచ్చారు. అంధులు శనివారం విద్యాలయ ఆవరణలో ప్రత్యేక సంగీత కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ రకాల పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో సోచ్ సంస్థ నిర్వాహకులు, గౌరవ డైరెక్టర్ ఏ.వి.ప్రశాంత్ విద్యార్థులు, టీచర్లు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. ఇట్రాడ్ సోచ్ ఫౌండేషన్ ఫౌండర్ మధుకర్ రెడ్డి జ్యోతి విద్యాలయ హైస్కూల్ కరెస్పాండంట్, ఫాదర్ అంబ్రోస్ బెక్, ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరీలకు కృతజ్ఞతలు తెలిపారు.

నాచారం రిలయన్స్, చంద్ర గార్డెన్‌లో అకస్మాత్తుగా మంటలు

విశాలాంధ్ర - కాప్రా : అనుమానస్పదంగా నాచారం రిలయన్స్ చంద్రగార్డెన్‌లో కస్మాత్తుగా మంటలు చెలరేగాయి. నాచారం ప్రధాన రహదారి పక్కనే ఉండడం వల్ల రహదారి మీదుగా వెళుతున్న జనాలు ఒకేసారి భయాందోళనలకు గురయ్యారు. దాదాపు గంటసేపు పొగలు రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని చుట్టుపక్కల వారు భయభ్రాంతులు చెందారు. నాచారం ఫైర్ స్టేషన్ నుండి అగ్నిమాపక దళం సంఘటన చేరుకొని మంటలు, పొగ వస్తున్న ప్రదేశంలో పరిశీలించగా చెత్త వల్ల మంటలు అంటుకున్నాయని దానితో పొగ మొత్తం వ్యాపించిందని ఎలాంటి ప్రమాదం జరగలేదని భయం చెందవలసిన అవసరం లేదని ఫైర్ సిబ్బంది తెలిపారు.

పేదలకు రగ్గుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మాస్టర్ రిత్విక్ కృష్ణ పుట్టినరోజు సందర్భంగా అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ ఆధ్వర్యంలో స్థానిక 124 డివిజన్ ఆల్విన్ కాలనీ మహంకాళి నగర్‌లో గల కొంతమంది పేద విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి చాక్లెట్లు, రగ్గుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శిరీష సత్తూర్ మాట్లాడుతూ మన పిల్లలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నేర్పించడం వల్ల భావితరాలకు వారు ఆదర్శంగా నిలుస్తారని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమం చేయడానికి ముందుకొచ్చిన మాస్టర్ రిత్విక్ కృష్ణ తల్లిదండ్రులైన ప్రసూన, వికాస్‌లను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వరూప, ప్రసూన, గాయత్రి, సన్విత్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ చంద్రచూడ్...
చారిత్రక తీర్పులు

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ధనుంజయ యశ్వంత్ చంద్రచూడ్ పదవీ కాలం ఆదివారంతో ముగియనుంది. వారంతం కావడంతో శుక్రవారమే ఆయనకు చివరి పని దినమైంది. దీంతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఆయనకు వీడ్కోలు పలికింది. సంతృప్తిగా పదవీ విరమణ పొందుతున్నట్లు సీజేఐ డీవై చంద్రచూడ్ చెప్పారు. 2022 నవంబరు 9న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ డీవై చంద్రచూడ్ నియమితులయ్యారు. రెండేళ్ల పదవీకాలంలో అనేక చారిత్రక తీర్పులు ఇచ్చారు. అందులో అధికరణ 370, స్వలింగ సంపర్కుల వివాహం, ఎన్నికల బాండ్లు, డ్రైవింగ్ లైసెన్స్, బుల్డోజర్ కూల్చివేతలు, ఉమర్ ఖాలీద్, స్టాన్‌స్వామి, జీఎన్ సాయిబాబాకు బెయిల్ వంటివి ఉన్నాయి. నోయిడా ట్విన్ టవర్స్ కూల్చివేత, కేరళకు చెందిన హదియా కేసు, అవివాహితల అబార్షన్ హక్కు కేసుల్లోనూ ఆయన తీర్పులను వెలువరించారు. మొత్తంగా 613 తీర్పులు ఇచ్చారు.

సంచలన తీర్పులు కొన్ని...

ఎన్నికల బాండ్ల కేసు

రాజకీయ పార్టీలకు నిధులు ఇచ్చేందుకు కేంద్రం తీసుకువచ్చిన ఎన్నికల బాండ్లపై ఈ ఏడాది ఫిబ్రవరిలో సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. 2018 నుంచి అమలులో ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసింది. రాజకీయ పార్టీలు, ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసే వారి మధ్య క్విడ్‌ప్రోకోకు అవకాశమున్నట్లు తెలిపింది. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, వీటి జారీని బ్యాంకులు వెంటనే నిలిపి వేయాలని తీర్పునిచ్చింది.

ప్రైవేటు ఆస్తుల స్వాధీనం

ప్రైవేటు ఆస్తులను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకునే విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చింది. ప్రైవేటు వ్యక్తుల యాజమాన్యంలోని ఆస్తులన్నీ సమాజ ఉమ్మడి వనరులు కాబోవని తేల్చిచెప్పింది. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు వాటిని ఏకపక్షంగా పంపిణీ చేయలేవని తెలిపింది. కొన్నింటిలో మాత్రం మినహాయింపు ఉంటుందని 7:2 మెజారిటీతో సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమే

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదానిచ్చే రాజ్యాంగంలోని అధికరణ 370 రద్దు రాజ్యాంగబద్ధమేనని సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ ధర్మాసనం తెలిపింది. పిటిషనర్ల వాదనను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం.. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పునిచ్చింది.

శబరిమల ఆలయ ప్రవేశం

మహిళలకు శబరిమల ఆలయంలో ప్రవేశాన్ని కల్పిస్తూ సీజేఐ చంద్రచూడ్ సంచలన తీర్పునిచ్చారు. మహిళల మర్యాదకు భంగం కలిగించే మతపరమైన సంప్రదాయాలు, ఆచరాలు రాజ్యాంగ విరుద్ధమని తేల్చిచెప్పారు. వారికి ఆలయ ప్రవేశాన్ని నిరాకరించమంటే స్వేచ్ఛ, సమానత్వ హక్కులను హరించడమే అవుతుందని సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ ధర్మాసనం పేర్కొంది.

గోప్యతా హక్కు-స్వలింగ వివాహాలు

వ్యక్తికి గోప్యత అవసరమని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో గతంలో వెలువడిన తీర్పులను ఆయన నేతృత్వంలోని తొమ్మిది మందితో కూడిన సుప్రీం కోర్టు విస్తృత ధర్మాసనం కొట్టివేసింది. అలాగే స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత అంశాన్ని కొట్టివేస్తూ సీజేఐ నేతృత్వ రాజ్యాంగ ధర్మాసనం నాలుగు వేర్వేరు తీర్పులిచ్చింది. ఎల్‌జీబీటీక్యూఐఏ ప్లస్ కమ్యూనిటీకి చెందిన వారికి వివాహానికి సమానత్వ హక్కులు ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. అయితే సహజీవనానికి అంగీకరించింది. స్వలింగ సంపర్క జంటలపై వివక్ష చూపొద్దని, వారి హక్కులు కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

జైళ్లలో కుల వివక్ష

జైళ్లలో ఉండే ఖైదీల మధ్య కుల వివక్ష తగదని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ ధర్మాసనం పేర్కొంది. ఖైదీలతో జైలు అధికారులు ప్రవర్తిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

పేదలకు నివేశన స్థలాలు

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్నికల సందర్భంగా తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమి ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగిన జూమ్ సమావేశంలో రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించటంతో పాటు సిమెంటు, ఇసుక, ఇటుక, కంకర తదితర సామగ్రి ధరలు పెరిగిన రీత్యా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు కేటాయించటానికి అనువైన ప్రాంతాలను గుర్తించి లే-అవుట్‌లు వేయాలన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీవంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. నివేశన స్థలాల సాధన కోసం ఈ నెల 18న సచివాలయాల వద్దకు లబ్ధిదారులను తరలించాలని పిలుపునిచ్చారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా తీసుకున్న ఈ కార్యక్రమం జయప్రదానికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు ఇంటింటి సర్వే చేసి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, పట్టణాలు, నగరాల్లో పార్టీతో కలిసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయలన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల సమస్యను సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నాయని, అందువల్ల ఈ కార్యక్రమం జయప్రదానికి కృషి చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ముందుగా జూమ్ సమావేశం ప్రాధాన్యతను వివరించి... అన్ని జిల్లాల నాయకత్వాలు, ఆయా నియోజకవర్గాలలో మండలాలు, గ్రామాల వారికి కార్యక్రమాలను రూపొందించుకుని అర్హులైన పేదలతో అర్జీలు తయారు చేసి సచివాలయాల్లో సమర్పించేలా కృషి చేయాలన్నారు. సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, బి.కేశవరెడ్డి, బండి వెంకటేశ్వరరావు, సీహెచ్.ప్రభాకర్, టి.కృష్ణప్ప, రామానాయుడు, సుబ్రహ్మణ్యంలతో పాటు జిల్లాల ప్రతినిధులు మాట్లాడుతూ నవంబరు 18వ తేదీ కార్యక్రమం జయప్రదానికి కృషి చేస్తామని వివరించారు.

మాట నిలుపుకోండి

వలంటీర్లకు న్యాయం చేయాలి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని, నెలకు రూ.10 వేల గౌరవవేతనం ఇస్తామంటూ ఇచ్చిన హామీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. వలంటీర్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) అధ్వర్యంలో జరిగిన 'వలంటీర్ల ఆవేదన- చంద్రన్నకు నివేదన' సదస్సులో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక హనుమాన్‌పేట దాసరి భవన్ మారుతీ కల్యాణ మంటపంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షతన సదస్సు శనివారం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తూ ప్రభుత్వానికి సహాయంగా వలంటీర్లు పనిచేశారని చెప్పారు. ఇటీవల వచ్చిన వరదల సందర్భంలో వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. వలంటీర్లను ఏదో ఒక పార్టీకి చెందిన వారిగా ముద్రవేసి అన్యాయం చేయటం మంచిది కాదన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఆనం రామానారాయణరెడ్డి, కొలుసు పార్థసారధి తదితరులకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో టికెట్లు ఇచ్చి...కూటమి ప్రభుత్వంలో మంత్రులుగా నియమించారని, మంత్రి లోకేశ్ రెడ్‌బుక్‌లో పేరున్న నాయకులు ఈ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలుగా ఉన్నారని రామకృష్ణ గుర్తుచేశారు. వలంటీర్లను చూసి ప్రభుత్వం భయపడుతుందన్నారు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర గల ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేరవేర్చకుంటే ఆయన ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. మాట నిలబెట్టుకుని వలంటీర్లకు న్యాయం చేయాలన్నారు. వలంటీర్లు ఉన్నారో... లేదో తెలియదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించటం దుర్మార్గమన్నారు. సీపీఐ తరపున మరోసారి చంద్రబాబును కలిసి వలంటీర్ల సమస్యను పరిష్కరించాలని కోరతామని చెప్పారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ వలంటీర్లు ఉన్నారో లేదో తెలియకుండానే వారి వ్యవహారాలు చూసుకోవటానికి మంత్రి డోలా బాల వీరాంజనేయులను నియమించారా అని సందేహం వ్యక్తం చేశారు. వలంటీర్లకు సంబంధించిన జీవోలు ప్రభుత్వం నుంచి వచ్చినవి కావని కొంతమంది ప్రజాప్రతినిధులు చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కరోనా సమయంలో క్వారెంటైన్‌లో ఉన్న వారికి వలంటీర్లు అందించిన సేవలు మరువలేని అన్నారు. పనీపాట లేకుండా ఉన్న వారికి నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు... పని చేస్తున్న వలంటీర్లకు గౌరవవేతనం ఎందుకు ఇవ్వలేరని నిలదీశారు. అక్రమ అరెస్టులు, 14ఏ నోటీసులు, వారెంట్‌లు, పోలీసులతో వలంటీర్ ఉద్యమాన్ని నిలువరించలేరని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకొని నిబద్ధత చాటుకోవాలన్నారు. 8సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగినా వలంటీర్ల సమస్య గురించి ఆలోచన చేయకపోవడం, చర్చించకపోవడం బాధాకరమన్నారు. నాలుగు నెలల గౌరవ వేతన బకాయిలు చెల్లించాలని, విధులకు హాజరు విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్లు, ఇతర రాజకీయ పక్షాలు అడగకపోయినా వలంటీర్లకు నెలకు పదివేల రూపాయల గౌరవ వేతనం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నాయకులు ఎన్నిక ప్రణాళికలో పెట్టారని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. 2.60 లక్షల మంది వలంటీర్లుగా పని చేశారని, వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారితే ఏమౌతుందో తెలుసుకోవాలని హెచ్చరించారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వర రావు మాట్లాడుతూ ఆవేశంతో కాకుండా ఆలోచించి మాట్లాడేవారు నిజమైన నాయకులని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఉద్యోగమా? ఉద్యమమా? వలంటీర్ల పరిస్థితిపై చంద్రబాబు ఆలోచన చేయాలని కోరారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు మాట్లాడుతూ వలంటీర్ల పోరాటానికి ఏఐటీయూసీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి లంకా గోవింద రాజులు, రాష్ట్ర అధ్యక్షులు ఎం.జగదీశ్, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కేఆర్ ఆంజనేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని, సహాయ కార్యదర్శి వై.బాబి, నగర కార్యదర్శి కంచల భార్గవ్, కుమార్, అశోక్, జంగాల చైతన్య, ప్రసాద్, హరీశ్, గాడి అజయ్, మమత, లక్ష్మి, సరోజినీ, మీనా, సుకన్య తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆరేటి రామారావు బృందం విప్లవ గీతాలు ఆలపించి... ఉత్తేజపరిచింది. నగరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఉన్న నేపథ్యంలో వలంటీర్ సదస్సు వద్ద పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

మామిడి రైతుల అభివృద్ధికి సహకరిస్తా

ఎంపీ కేశినేని శివనాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యుల అభివృద్ధికి అండగా ఉంటానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. గన్నవరం నుంచి విదేశాలకు మామిడి ఎగుమతి చేసేలా కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడతానన్నారు. ఎయిర్ కార్గోలో ఎగుమతి చేసేందుకు దిగుబడి పెంచాలని సూచించారు. విజయవాడ, గురునానక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం (ఎన్టీఆర్ భవన్)లో శనివారం మైలవరం నియోజకవర్గం కేశినేని శివనాథ్‌ను రెడ్డిగూడెం మండలానికి చెందిన ఎఫ్‌పీసీ సభ్యులు కలిశారు. నాణ్యతగల మామిడి కాయలు పండించేందుకు ఫ్రూట్స్ కవర్స్, ప్లాస్టిక్ ట్రేలు, దాపోలీ హార్వెస్టర్ల కోసం ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇప్పించాలని కోరారు, తాము పండించిన మామిడికాయల నాణ్యత, సాగు విధానాన్ని ఎంపీకి వివరించారు. రెడ్డిగూడెంలో ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్‌ను త్వరగా ప్రారంభించేందుకు కృషి చేయాలని సభ్యులు కోరారు. రైతుల సమస్యలపై కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీసీ డైరెక్టర్లు చేబ్రోలు కృపారాజు, కొండపల్లి పరమేశ్వరరావు, సభ్యులు చేబ్రోలు శ్రీనివాసరావు, సీహెచ్ నాగప్రసాద్, కొండపల్లి మణికంఠ, అడపా బసవయ్య, రాజు, సాంబశివ రావు, ఉద్యానశాఖ అధికారి నరేంద్ర కుమార్, ఫ్రూట్ టెక్ కంపెనీ అధినేత అప్పారావు పాల్గొన్నారు.

సమాజ పురోగమనంలో శ్రమవిలువ వెలకట్టలేనిది

'శ్రమకావ్యం' సదస్సులో ప్రముఖ కవి సుద్దాల

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ప్రపంచ చరిత్ర మొత్తం శ్రమతోనే నిండి ఉందని, మానవ వికాసం, సమాజ పురోగమనంలో శ్రమ విలువ వెలకట్టలేనిదని ప్రముఖ కవి, ఉత్తమ సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. హైదరాబాద్, కొండాపూర్... సీఆర్ ఫౌండేషన్‌లో నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం అధ్వర్యంలో శనివారం సుద్దాల రాసిన 57వ 'శ్రమకావ్యం' గానం కార్యక్రమం జరిగింది. ఎస్ఆర్ఆర్ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ టి. సురేశ్‌బాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో రచయిత సుద్దాల మాట్లాడుతూ నాలుగు వేదాలు పుట్టకముందే శ్రమ సామవేదాన్ని ప్రవచిస్తున్నాను ... ఆధునిక కథా వాఙ్మయాని కన్నా ముందే శ్రమ కవితా కథా కథనకావ్యానికి సిరా పుష్పాల నేరి అక్షరమాల కట్టానని అన్నారు. ఇప్పుడు మనుషులను విడదీసే మతాలు పుట్టక ముందే తాను ఏకైక శ్రామిక మతాన్ని ప్రకటిస్తున్నానని చెప్పారు. క్రైస్తవం, ముస్లిం, హిందూ మతాల కన్నా ముందే ఏర్పడిన ఏకైక మతం శ్రామిక మతమన్నారు. పౌరాణిక ప్రతీకలను వాడుకొని కావ్యాలను రాశానని చెప్పారు. శ్రమ ప్రయాణమే శ్రమాయణం అని, రాముడు ధనస్సు, కృష్ణుడు వేణువు వేసుకున్న ఆభరణాలు, విష్ణువు పెట్టుకున్న కిరీటం కూడా శ్రమ జీవులు తయారు చేసిందేనని, శ్రముడు, శ్రమి కలిసి సాగిన ప్రస్థానం ఈ శ్రమ కావ్యం' అన్నారు. శారీరక శ్రమ నుండే పాట, నృత్యం పుట్టాయన్నారు. తొలుత సుద్దాల అశోక్ తేజ తనదైన బాణీ 'శ్రమకావ్యం' గానం వినిపించగా, అయన సాహిత్యంలోని గుబాళింపు పలువురిని ఆకట్టుకుంది. సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, కార్యదర్శులు మాజీ ఎమ్మెల్సీ పి.జె. చంద్రశేఖర్ రావు, చెన్నమనేని వెంకటేశ్వర్ రావు, కోశాధికారి వి. చెన్నకేశవ రావు, ప్రొఫెసర్ జి.వి. రత్నాకర్, ఎస్ఆర్ఆర్ పరిశోధన కేంద్రం సభ్యులు దేశిని లక్ష్మినారాయణ, జోష్యభట్ల కల్పన, కనపర్తి జ్యోత్స్న, డీ కృష్ణ కుమారి పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా లక్ష ఇళ్లు ఇస్తాం

మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర-తిరుపతి: ఈ ఏడాది డిసెంబరుకు లక్ష ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పజెప్పే బృహత్ కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. అర్హులైన పేదల సొంత ఇంటి కల సాకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని చెప్పారు. మంత్రి శనివారం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చిత్తూరు, తిరుపతి జిల్లాలలో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎంఏవై పథకం కింద రెండు జిల్లాలకు మంజూరైన ఇళ్లలో సుమారు 50 శాతం పూర్తి అయ్యాయని చెప్పారు. ఇసుక కొరత, వర్షాలతో కొన్ని చోట్ల నిర్మాణాలు ఆలస్యమైనట్లు తెలిపారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి కాకపోవడంపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలలో జాయింట్ కలెక్టర్, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 'ఎన్టీఆర్ హౌసింగ్' నిర్మాణాలకు ఇసుకను ప్రాధాన్యతగా ఇవ్వాలని ఆదేశించారు. అందుబాటులోని ఇసుకను రవాణా చేసుకోమని సూచించామని, రవాణా చార్జీలను గృహ నిర్మాణశాఖ భరిస్తుందని మంత్రి చెప్పారు. తమ నియోజకవర్గంలో గృహ నిర్మాణాలకు ఎదురయ్యే సమస్యలు, జరిగిన అవకతవకల గురించి స్థానిక ఎమ్మెల్యేలు చెప్పారని, వాటినీ త్వరగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. కుప్పంలో ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా విద్యుత్ సౌకర్యం లేదని, రెస్కో ఏపీఎస్పీడీసీఎల్ సమన్వయంతో ఈ పని చేయాలన్నారు. కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు మంత్రి వెల్లడించారు. హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులను కేంద్ర పథకాలు సరేగా, అమృత్, జల జీవన్ మిషన్ తదితర పథకాల అనుసంధానంతో చేపడుతున్నామన్నారు. బాధ్యతగా గృహాల నిర్మాణాలకు లక్ష్యం నిర్దేశించుకుని పూర్తి చేసేలా, లబ్ధిదారులను ప్రోత్సహించేలా శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు సహకారంతో స్టేజి కన్వర్షన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని మంత్రి పార్థసారధి తెలిపారు. బిల్లుల చెల్లింపుకు నిధుల కొరత లేదన్నారు. లబ్ధిదారులకు బిల్లులు నిధులు ఉన్నా చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని పార్థసారధి అన్నారు. సమీక్షలో జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, నెలవల విజయశ్రీ, కొరగొండ్ల రామకృష్ణ, మురళి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, ఎస్ఈ నాగభూషణం, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, చిత్తూరు ఉమ్మడి జిల్లా ఆర్డీఓలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్... స్వర్ణాంధ్ర సాధనకు తొలిమెట్టు

లంకా దినకర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ మొదటి బడ్జెట్ స్వర్ణాంధ్ర సాధన విజన్ 2047కు తొలిమెట్టు అవుతుందని 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేయడమే బాధ్యతగా పాలన సాగుతోందన్నారు. అమరావతి నిర్మాణం, రాష్ట్రంలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడం ప్రాధాన్యతలని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్ నిధుల కేటాయింపు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామ నాయుడు, ప్రకాశం జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఆనం రామనారాయణకు నివేదిక ఇచ్చామన్నారు. పవన్ కల్యాణ్ గతంలో జగన్ పాలనకు భిన్నంగా ఆర్థిక సంఘం నిధులు నేరుగా చేర్చడం వల్ల పంచాయతీల స్వయం సమృద్ధి సాధనకు అవకాశం కలుగుతోందన్నారు.

కృష్ణారావుకు రామకృష్ణ పరామర్శ

విశాలాంధ్ర-విజయవాడ: సమతా పార్టీ మాజీ అధ్యక్షుడు వీవీ కృష్ణారావును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం పరామర్శించారు. విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యుల నుంచి తెలుసుకున్నారు. కృష్ణారావుకు అందుతున్న వైద్యం వివరాలను వాకబు చేశారు. కృష్ణారావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కృష్ణారావు గతంలో ఇండియన్ పీపుల్స్ ఫ్రెంట్ జాతీయ కార్యదర్శిగా పనిచేశారు.



రామకృష్ణ వెంట ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వరరావు ఉన్నారు.

పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలి

రోడ్డు ప్రమాదాలపై పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రోడ్డు ప్రమాదాల విషయంలో పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే... వారు చేసిన తప్పులు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తాయన్నారు. ఇటీవల కాకినాడ జిల్లా తుని సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా... ఈ వ్యవహారంలో పోలీసులు ప్రవర్తించిన తీరు పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదంపై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితుల తల్లిదండ్రుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ఆ కుటుంబాలను తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని తెలిపారు. శనివారం మంగళగిరి లోని ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో తుని రోడ్డు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను పవన్ కల్యాణ్ పరామర్శించారు. ప్రమాద వివరాలు తెలుసుకుని చలించిపోయారు. మృతుల కుటుంబాలకు తన ట్రస్ట్ 'పవన్ కల్యాణ్ లెర్నింగ్ సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్' నుంచి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... 'ప్రమా దంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన విషయం బాధించింది. ప్రమాదంపై ఫిర్యాదు చేసేందుకు వారి తల్లిదండ్రులు సమీపంలోని పోలీస్ స్టేషన్‌కి వెళ్లగా అక్కడ అధికారులు ప్రవర్తించిన తీరు సరిగా లేదని తెలిసింది. కనీసం సమాధానం చెప్పకపోగా పోలీసులు మాట్లాడిన తీరు బాగాలేదు. రోడ్డు ప్రమాదంలో బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల బాధ తీవ్రమైనది. అంతటి కష్టాన్ని దిగమింగుకున్నారు. ఇద్దరు విద్యార్థుల్లో రేవంత్ బ్రెయిన్ డెడ్ అయితే...ఆయన తల్లిదండ్రులు అవయవదానం చేయడం నన్ను కదిలించింది. అయితే పోలీసులు ప్రమాదానికి కారణం అయిన డ్రైవర్‌పై ఎలాంటి కేసులు పెట్టలేదని తెలిసింది. కారులో ప్రయాణిస్తున్న వైద్యుడు కూడా బాధ్యతగా వ్యవహరించకపోవడం దారుణం. రోడ్డు ప్రమాద సమయాల్లో తక్షణ సాయం అవసరం. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారిని తక్షణం ఆసుపత్రికి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఘటనా స్థలి వద్ద ఉన్నవారిపై ఉంటుంది. కేసుల భయాల నుంచి బయటకు రావాలి. పోలీస్ ఉన్నతాధి కారులు ఈ అంశం మీద అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి. క్షతగాత్రులకు తక్షణం వైద్యం అందితే ప్రాణాలు దక్కే అవకాశం ఉంటుంది. కాకినాడ జిల్లాలో రోడ్డు ప్రమాద ఘటనలో పోలీసులు ప్రవర్తించిన తీరు పట్ల నేను క్షమాపణలు చెబుతున్నాను' అని పవన్ అన్నారు.

62 మంది విద్యార్థులకు వినికిడి యంత్రాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జాతీయ న్యాయ సేవల దినోత్సవాల సందర్భంగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో శనివారం వీఐటీ ఏపీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మడోనా డెఫ్ అండ్ డంబ్ స్కూల్‌కి చెందిన ప్రత్యేక ప్రతిభావంతులైన 62 మంది విద్యార్థులకు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ జి.నరేందర్ అధ్వర్యంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ... గురుదేవా ఛారిటబుల్ ట్రస్టు (విజయ నగరం) సహకారంతో వీటిని అందిం చారు. జస్టిస్ జి.నరేందర్ మాట్లాడుతూ న్యాయసేవలు అందరికీ అందుబాటులోకి తీసుకురావడం కోసం న్యాయ కళాశాల విద్యార్థులు కృషి చేయాలన్నారు. సత్వర న్యాయం అందించడం న్యాయసేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. సామాజిక, ఆర్థిక కారణాల రీత్యా ఎవరు న్యాయస్థానాలను సంప్రదించడానికి వెనుకాడకూడదని, వారి కోసం ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. వీఐటీ ఏపీ ఉప కులపతి ఎస్వీ కోటారెడ్డి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి యం.బబిత, గురుదేవా ఛారిటబుల్ ట్రస్టు కో ఆర్డినేటర్ జగదీశ్ బాబు, హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి జి.మాలతి, న్యాయసేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డాక్టర్ హెచ్.అమరరంగేశ్వర రావు, వీఐటీ ఏపీ లా కళాశాల డీన్ బెనర్జీ, లీగల్ ఎయిడ్ కో ఆర్డినేటర్ మాళవిక పాల్గొన్నారు.

ఏపీ స్టార్స్‌కు 'వీఐటీ' ల్యాప్‌టాప్‌లు

49 మంది విద్యార్థులకు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గ్రామీణ విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డు రాకూడదనే ఉద్దేశంతో వీఐటీ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.విశ్వనాథన్ సంకల్పానికి కట్టుబడి స్టార్స్ పథకాన్ని ఆ సంస్థ చేపడుతోంది. ఇదే క్రమంలో 49 మంది 'ఏపీ స్టార్స్'కు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసింది. ప్రభుత్వ కళాశాలలలో ఇంటర్ చదివి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులను (26 జిల్లాల నుంచి ఒక విద్యార్థి, విద్యార్థిని చొప్పున) ఎంపిక చేసి వారికి చేయూత అందజేస్తున్నామని వీఐటీ విశ్వవిద్యాలయం వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ తెలిపారు. వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యతో పాటు వసతిని, ప్రాథమిక వైద్య సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, 49 మందికి ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఈ పథకం ఒక వరమని, దీనిని సద్వినియోగించుకొని భవిష్యత్తును చక్కబెట్టుకోవాలని విద్యార్థులకు వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్వీ కోటా రెడ్డి సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి, డా॥ డి.వెంకట లక్ష్మి (స్టార్స్ కో-ఆర్డినేటర్) డా.జాన్ ప్రదీప్ (డిప్యూటీ డైరెక్టర్ అడ్మిషన్స్) విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.